
ఆంధ్రసచిత్రవార
పత్రిక

'బెలూన్ లో ధ్రువయాత్ర...'



26-4-63
25 నయాపైసలు


అశేష ప్రజానీకాన్ని ఆకర్షిస్తున్న అత్యుత్తమ చిత్రం
అన్నపూర్ణా వారి
చదువుకున్న అమ్మాయిలు
నిర్మాత డి. మధుసూదనరావు B.A.
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు
శ్రీ సారథీ స్టుడియోస్
హైదరాబాద్
నవయుగ విడుదల
n.v.k.s

పొదుపుకోసం అమృతాంజన్ అట్టపెట్టెల్లో వస్తోంది

నేడు మన దేశపు ఆదాయము రక్షణ కొరకు అవసరము. సాధారణంగా పరిచితమైన అమృతాంజన్ డబ్బా తయారుచేయడానికి కావలసిన టిన్‌రేకు నేడు జాతీయ అత్యవసరాలకు కేటాయించబడినది. కాబట్టి దీనికి బదులు మేము క్రొత్త రకం పొదుపైన అట్టపెట్టె వాడుతున్నాము. ఇంతేగాకుండా సీసాలో నమ్మకమైన అమృతాంజన్ అందజేయడానికి మోసంచేయడానికి వీలులేకుండా 'అలు కాప్ ('Alu'-cap) తో సీసా సీలు చేయబడింది ▪ పూర్వం ఎప్పటికంటే కూడా ఇప్పుడు మీకు అమృతాంజన్ ఎక్కువ అవసరము. కండల నొప్పులు, బెణుకులు, గుండె జలుబులు, కీళ్ళ నొప్పులు, ఆరోగ్యం చెరచి నీరసపరచి అధికంగా కావలసిన ఉత్పత్తులను తగ్గించే రోగాలు నిర్మూలించడానికి సహకరిస్తుంది.

అమోఘమైనది, మిత వ్యయంతో కూడినది, అనేక విధాల ఉపయోగపడేది.

అమృతాంజన్ అమోఘంగా పనిచేసే నొప్పుల నివారణిని మీరు కొనవచ్చు. ఇటువంటి మందులన్నిటికంటె దీనిలో గుణావహకమైన ఔషధాలు అధిక పరిమాణాల్లో ఉంటాయి. ▪ దీనిలో ఏకమైయున్న మందులు బాధలను నివర్తించి వెంటనే ఉపశమనం కలిగించడానికి శరీర చర్మంలో అతి శీఘ్రంగాను లోతుగాను ప్రవేశిస్తాయి. ప్రతీసారీ మీకు ఏ నాలుగు వడ్లగింజల ఎత్తో అమృతాంజన్ కావలసి ఉంటుంది. ఇంట్లో ఇంటిల్లిపాదీ ఉపయోగించినా ఒక బుడ్డి నెలల తరబడి ఉపయోగానికి వస్తుంది.



అమృతాంజనము

ఆరోగ్యం ఇస్తుంది

అమృతాంజన్ లిమిటెడ్ 14/15 లజ్ చర్చి రోడ్, మద్రాసు-4



గుండె జలుబు | కీళ్ళ నొప్పులు | తల నొప్పులు

JWT-AM-2225a

ఉత్తరాలు

ముఖచిత్రం

నా అభిమాన, అందాల చిలిపి తార కృష్ణకుమారి ముఖచిత్రం ఎంతో అందంగా, కన్నుల పండువుగా ఉన్నది. మీకు నా అభివందనలు.

వై. రాంబాబు(గుంటూరు)

కథలు

12—4—63 తేదీ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురితమయిన 'బ్రతుకలేనివాడు' కథ చదివాను. రచయితగారు బాగున్నట్టుగానే వ్రాశారు. అయితే చిన్న పొరపాటు ఒకటున్నది. పంచాయితీ మెంబరుగా నిలువబడిన బోళ్లషిప్పు కనకాయ్, ఆఖరుకు తనకు ఆ పదవి అనుకూలంగా లేకపోవుటచే, తిరిగి యథాస్థానమునకు వచ్చేశాడన్న విషయం వ్యక్తమయింది. కాని, ఒకమాటు పెద్ద పదవిలోకి వెళ్ళిన పేదవాడు తిరిగి తన యథాస్థానములోనికి వెళ్లడానికి అంగీకరించడు. అటువంటప్పుడు రచయితగారు ఏ విధంగా అలా వ్యక్తపరచారో పత్రిక ద్వారా తెలియజేస్తే నా సందేహం తీరుతుంది.

గుండుమళ్ల వెంకట రామారావు(శ్రీకాకుళం)

* * *

నే రాసిన 'మార్చికి మార్చికి మధ్య' కథమీద సందేహం వెలిబుచ్చిన సురేఖ, స్నేహ బృందానికి నా సమాధానం:

"సురేఖా! మీరనుకుంటున్నట్లు నేను మీ వాడినే!"

తంబు (విశాఖపట్నం)

సీరియల్ కథలు

తామర కొలను సీరియల్ చాలా బాగుగా నున్నది. ఇకముందు కూడా ఇటువంటి మంచి సీరియల్స్ ప్రచురిస్తారని కోరుచున్నాను.

జంగా, గాంధిజీ (చీక్కావోలు)

* * *

శర్వాణిగారు అనువాదం చేసిన "తామర కొలను" అను క్రొత్త సీరియల్ ఈ వార పత్రికకే వన్నె తెచ్చినది.

టి. లక్ష్మి (చీరాల)

* * *

శర్వాణిగారి క్రొత్త సీరియల్ "తామరకొలను" సహజంగా లేదు. వదినా, మరదుల మధ్య సంబోధన అంత బాగాలేదు. చిన్నప్పటినుంచి ఎంత పరిచయమున్నా, ఎం. బి. బి. ఎస్. చదువుచున్న మరిది "చూడరా బాబు, తినరా బాబు, ఫస్టుగా ఉందిరా బాబు, చాల వెలరా బాబు" అని ఏకవచన ప్రయోగం ఏ వదినగారూ చేయరు.

కుమారి రాణి (తాడేపల్లిగూడెం)

* * *

రమేష్ పుర్రె నొక్కటినే చూపించి, ఇది ఆడ మనిషి పుర్రె అంటాడు. కాని, అసలు పుర్రెద్వారా లేదా తెలియదు. అది ఒక్క పెల్విగర్డల్ (కూప కము) ద్వారానే ఆడ, మొగ అస్థిపంజరముల తేడా తెలుస్తుంది, క్రాంతి పొరపాట్లు కాకుండా ఉంటే బాగుణ్ణు. అయినమా కథ చాలా బాగా ఉంది.

వి. వి. శంకర్‌రావు(బరంపురం)

* * *

'శ్రీదేవి' సీరియల్ మొదట్లో అంత బాగుండక పోయినను, చివరికి చాల బాగా ఉన్నది. రచయితకు నా నమస్కారములు తెలియచేయవలెను.

కల్పకం (హైదరాబాద్)

తెరమీద తెరవెనుక

తారా—పథాన ప్రకాశిస్తున్న ఈ వర్ధమాన నటి ఇంత సుగుణాల రాశి అని తెలిసినప్పటినుంచి ఆమెతో పరిచయం చేసుకోవాలనిపిస్తుంది. ఉన్నత స్థాయిలో ఉండి కూడ సరళత, సోదరాభిమానము సహజముగ కలిగి ఉండుట చాల గొప్ప విషయము.

వై. వి. రత్నం (హైదరాబాదు.)

* * *

'తెరమీద—తెర వెనుక' శీర్షికలో కృష్ణకుమారి ఫోటోలు సరిగా పడలేదు. కారణం తెలుపుతారనుకుంటాము.

వి. మోహన్ (రాజోలు)

సోఫియాతో నా జీవితం

"సోఫియాతో నా జీవితం" అను వ్యాసము చాలా మధురముగా ఉన్నది. ఇటువంటి చక్కటి తారను పరిచయము చేసినందుకు మీ పత్రికకు ధన్యవాదములు.

ప్రసాద్ ఎస్. జె. ఆర్. (కొత్తఢిల్లీ)

* * *

ఈవారం ఆంధ్రపత్రికశీర్షికలో సోఫియా లోరెన్, గురించి, వారి భర్త కార్లోపోంటిగారు వ్రాసిన వ్యాసం నన్ను చాలా ముగ్ధుణ్ణి చేసింది. ఇంతవరకు వీరిని గూర్చిన వివరాలు ముఖ్యంగా "మోషన్ పిక్చర్" మ్యాగజీనులో చదువడమే గాని, ఇంత వరకు ఏ పత్రిక ఇలాగా ప్రచురించనందుకు మీకు నా హృదయ పూర్వక ధన్యవాదములు.

ముఖ్యంగా ఇలాటివే ఇకముందు కూడా ప్రచురించాలని కోరుతున్నాను.

లక్ష్మీకాంత్ (పెద్దపల్లి)

న్యూఢిల్లీ లేఖ

ఇటీవల పార్లమెంట్‌లో కొందరు పోషలిస్టు సభ్యులు చేసిన గందరగోళం గురించి ప్రస్తావిస్తూ, శ్రీ కృష్ణగారు ఏప్రిల్ 12 సంచికలో "హిందీ, ఇంగ్లీషుల మధ్య వాగ్వివాదం కాదిది; అధ్యక్షునిగా ఎన్నికైన వ్యక్తిని గౌరవించడం దగ్గర కలిగే మత్సరంఇది" అని వ్రాశారు. కాని, డాక్టర్‌లోహియా ఈ సంఘటనపై వ్యాఖ్యానిస్తూ, రాష్ట్రపతి రాధాకృష్ణన్ హిందీలో కాకపోయినా, తెలుగులోనో, తమిళంలోనో ప్రసంగించిఉంటే, తమ పార్టీకి అభ్యంతరం ఉండేదికాదని చేసిన ప్రకటన గమనార్హం. విదేశీ భాషలోకాక, భారతీయ భాషలలో ఏ ఒక్కదానిలో రాష్ట్రపతి మాట్లాడినా, రాజ్యాంగానుగుణంగా ఉండేదని సోషలిస్టుల భావం. వ్యక్తిగతంగా రాష్ట్రపతి తమకు గౌరవనీయమేనని వారు స్పష్టపరిచారు.

సత్యప్రియ (హైదరాబాదు)

★

ఆంధ్రసచిత్రవార పత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం : 26—4—63
శోభకృన్నామసం॥ వైశాఖమాసం॥ శుద్ధ॥ తదియ
సంపుటము : 55 సంచిక : 34

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా
వివరాలు

ఇండియా : రూ. 13.00 ఇతర దేశాలు : ఓడమీద Sea Mail రు. 20.00. (విమానం ద్వారా Air Mail బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు— రూ. 114.00. అమెరికా రూ. 176.50. ఆస్ట్రేలియా 135.00.)

*

విడిప్రతి : 25 న.పై.
సంవత్సర చందా : 13-0-0.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1



అభినేత్రి సావిత్రి

మనలోమాట

'బెలూన్‌లో ధ్రువయాత్ర' 19 వ శతాబ్దంలో చిన్న పిల్లలు చదవటానికి వ్రాసిన ఫ్రెంచి నవల 'విక్టర్ పాట్రీస్' రచయిత కలం పేరు. ఆయన అసలు పేరు ఏమిటో తెలియదు! జూల్స్ వెర్న్ కూడా బెలూన్ యాత్రకు సంబంధించిన నవల వ్రాశాడు కాని కొన్ని కారణాలవల్ల దానిని ఇప్పుడు పాఠకులకు అందించ లేకపోతున్నాము. ఇంతలో 'విక్టర్ పాట్రీస్' రచించిన ఈ చిన్న నవల 'బాలసాహితి' పాఠకులకు ఆనందం చేకూర్చ గలదని మా నమ్మకము! 'బెలూన్‌లో ధ్రువ యాత్ర' మరీ సాంకేతిక దృష్టితో చదవకుండా ఉండటమే మంచిది....

*   *   *

ఈ సంచిక 27 వ పేజీలో వ్యాసం శీర్షికలో నేను ఎందుకో గాని తప్పిపోయింది! అర్థం సూర లేదు. కాబట్టి అలానే వదిలివేస్తున్నాము. మరి రెండు సంచికలతో ఈ వ్యాసాల వరుస ఆగిపోతుంది!

*   *   *

వీలయినంత వరకు 'తెరమీద—తెరవెనుక' శీర్షికలో సినిమాలకు సంబంధించిన 'స్టిల్' చిత్రాలు వెయ్యరాదని నిశ్చయించుకున్నాము కాని శ్రీ రేలంగి వెంకట్రామయ్య గారిని గురించిన వ్యాసాలకి మాత్రం 'ఈ నిబంధన'ని అతిక్రమించాము! వచ్చే సంచికలో వీరి పాత చిత్రాలకు సంబంధించిన 'స్టిల్' చిత్రాలు మరికొన్ని వేస్తాము.........


శ్రీ 'రేలంగి'ని మేము 1961 లో ఒకసారి ఇంటర్‌వ్యూ చేశాము. ఈ ఇంటర్‌వ్యూ సమయానికి ఆయన సుమారు 175 చిత్రాలు పూర్తిచేసుకున్నారు. శ్రీ వెంకట్రామయ్యగారి 200 చిత్రం పూర్తి అయ్యే సమయానికి మరొక శీర్షిక – వీలయినంత త్వరలో!—ప్రచురించగలమని ఆశిస్తున్నాము!

లోకంపోకడ



"అబ్బే! ...రేం కాదయ్యా! హిందీ గొప్పదా? ఇంగ్లీషు గొప్పదా అని వారు తేల్చుకుంటున్నారు."

విషయానుక్రమణిక


సరే నేనోకంట మిమ్మల్ని
కనిపెడుతూంటానులే!
ప్రభుత్వ రంగం లోని సంస్థలు
లంచగొండి అధికారతత్వం
భాషలగురించి చేసే బిల్లు లోని సూత్రం
నీళ్లు
ప్రధానివాగ్దానం
పాలు
ఏంనాయనా! హిందీ ముఠాలో చేరినందువల్ల నీ మొహం అలా నల్లగా అయిపో యిందా!
ఉత్తరం
హిందీమూఢవాది
దక్షిణం
భారత్ యూనియన్ ఐక్యత



శ్రీ మొరార్జీ కాశ్మీర్ ప్రధాని బక్షీగులాం వద్దనుంచి, 190,000 గ్రాముల బంగారం 583000 గ్రాముల వెండి, 30 లక్షల రొక్కం రక్షణనిధికిగాను స్వీకరించారు.

వారు. శ్రీ నెహ్రూ తప్పులను ఒప్పుకోవటమే లేదు. పైగా ఆయన భారతదేశానికి రష్యా ఛత్రం ఇస్తుందనే భ్రమలో ఉన్నారు.

ఏమైనా, మన మిత్రులనుకున్న చైనావారి దురాక్రమణనుంచి మనని ఆదుకున్నది 'అమెరికన్ దుష్టులే' నన్న సంగతి మాత్రం మర్చిపోకూడదు.

ఏ కొద్దిమంది కాంగ్రెసేతర్లో తప్ప ఎవ్వరూ ప్రధానమంత్రిని తటస్థ విధానానికి తిలోదకాలివ్వమనలేదు. అసలీ తటస్థ విధానం ఏదో అతి పవిత్రంగా ఓ గుళ్లో దేవుణ్ణి పూజించినంత భద్రంగా, భక్తితో చూడాల్సింది కాదు. ఏదో పదిమంది మేలుకోసం ఆలోచించి ఏర్పరచుకున్న తీర్మానంగా తప్ప. చైనా దురాక్రమణ దృష్ట్యా సంస్కరించుకుని ఇకముందర ఎలాంటి ప్రమాదం రాని విధంగా మన తటస్థ విధానం బలంగా రూపొందించారా అనేది చెప్పమనే కాంగ్రెస్‌లోని కొందరు సభ్యులు కోరారు.

ఇక అవినీతి నిరోధం గురించి చూద్దామా అంటే దీనిపట్ల మన ప్రధానమంత్రి అనుసరిస్తున్న విధానం మరీ అసంతృప్తికరంగా ఉంది. 'నాకంతా బాగానే కన్పిస్తోంది' అనే

అధికారాన్ని అవకాశంగా ఉపయోగించే కాంగ్రెస్ ప్రభుత్వం

శ్రీ కృష్ణ

ఈ వారం ఇక్కడ చెప్పుకుంటున్న విశేషాలలో గ్రాంట్ల డిమాండు, అఖిలభారత కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం ముఖ్యమైనవి. ప్రతి తడవ మాదిరిగానే ఈసారి కూడా ప్రధానమంత్రి గొంతే ఎక్కువగా వినిపించింది! ఆయన ప్రతిపాదనలను విధానాలను కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. అయితే ఏం! చర్చ జరుగుతున్నప్పుడు మాత్రం ప్రధాని అనుసరించే తటస్థ విధానం తీవ్ర విమర్శలకు గురైంది. ఈ విధానంలోని విచక్షణాభావం అభావంగా ఉందని అనుమానించినవారు కాంగ్రెసు సభ్యుల్లోనే కొంతమంది ఉన్నారు. వారికి ఉన్న ఈ ప్రత్యర్థం మొహాన ప్రధానమంత్రి సంకుచితవాదులనే ముద్ర వేసిపారేశారు.

కాని అన్నిటికన్న ప్రమాదకరమయిన సంకుచితవాదం ఏమిటంటే చేసిన తప్పులు ఒప్పుకోకపోవటం; ఓ కే పట్టుదల పట్టటం.

తటస్థవిధాన విమర్శకులంతా, ఆ విధాన్ని పునః పరిశీలించమని అన్నారే గాని, మానివేయమన్నారా! కాకపోతే, చైనా చేసిన దురాక్రమణ దృష్టిలో ఉంచుకొని పరిశీలించమన్నారు! అంతే.

మన కులాల ఏర్పాటు కూడా ఒక విధంగా తటస్థ విధానంమీద ఆధారపడిందే. ప్రతి వర్ణం సర్వసత్తాక స్వాతంత్ర్యం గలది. ఉదాహరణకు బ్రాహ్మణుడు అందరికీ మిత్రుడే. ఎవ్వరికీ శత్రువుకాదు. కాని ఆవర్ణ వ్యవస్థ ఇతర వర్ణస్థులతో పంక్తి భోజనం గాని, వర్ణాంతర వివాహాలు గాని అంగీకరించదు. ఈ వేరుబాటు అనేది ఈ వ్యవస్థలో ఒక బలహీనతగా చెప్పవచ్చు.

తటస్థవిధానమనే 'ఒంటిస్తంభం' మేడమీది నుంచి ఇప్పుడు భారతదేశ స్థితి ఏమిటో పరిశీలించవలసిందిగా అఖిలభారత కాంగ్రెస్ కార్యవర్గంలోని కొందరు సభ్యులు అడిగారు. మనం ఏ సైనిక కూటమిలోనో చేరాలని కాదు వీళ్ల కోరేది. మైత్రీరాహిత్య విధానంవల్ల ఏర్పడిన దుష్ఫలితాలను గురించి చెప్పుకోటమే.

మహాత్మాగాంధి ఐతే తమ తప్పును ఒప్పుకునే


దృక్పథంను దేశం ఇక ఏ మాత్రం నమ్మేస్థితిలో లేదు. దేశభవిష్యత్తు, కాంగ్రెసు మంత్రుల సంక్షేమం దృష్ట్యా కొంత నిర్దిష్టమైన దృక్పథం అవసరం. ఫలానా మంత్రి అవినీతికి పాల్పడ్డాడని ఎవరూ అనటం లేదు. మంత్రులమీద ఆరోపణలు వినవస్తున్నప్పుడు వీటిని బహిరంగంగా విచారించి మంత్రుల నిర్దోషిత్వాన్ని నిష్కళంకతను ప్రజలకు ఋజువు చేయాలనే ఎవరైనా కోరుతున్నది.'

ప్రధానమంత్రి ఈ విషయాలను గూర్చి ప్రసంగిస్తూ, ఇలాంటి వ్యవహారాల విషయంలో అటార్నీ జనరల్‌తో సంప్రదించామన్నారు. అంటే, ఇలాంటి కేసులన్నీ విచారణలో ఉన్నాయన్నమాట. ఈపరిస్థితిలో

66 వ పేజీ చూడండి

జరిగిన కథ

[ఆఫీస్ ఉద్యోగి కృష్ణశాస్త్రి, అతని తమ్ముడు రమేష్ వైద్యవిద్యార్థి భార్యపేరు శాంత. బాగా పెరిగిన చనువువల్ల రమేష్ వదిన శాంతను వేళాకోళం చేయటం, కపటంలేని దురుసుతనంతో కూడిన అతని మాటలకు శాంత ఒక్కొక్కప్పుడు నొచ్చుకోవటం అలవాటు. శాంతకు తలనొప్పి బాధకలుగుతుంది. ఎన్నిమందు లిచ్చినా తగ్గదు.]



తామరకొలను

కన్నడమూలం **త్రివేణి**

అనువాదం **శర్వాణి**

(గత సంచిక తరువాయి)

రమేశ్ 'మానసిక శిక్ష' అనగానే శాంతకు భయం వేసింది.

"అయితే ఇది నయమయ్యే తలనొప్పి కాదంటావా ?"

"నయం కాకపోవట మేమిటి ?" తప్పకుండా నయమవుతుంది కాని, కారణమే తెలియలేదు. ఈసారి పరీక్ష లయ్యాక, నేనే మిమ్మల్ని వెల్లూరుకు తీసుకువెడతాను" అన్నాడు రమేశ్.

'వెల్లూరా ! దానికి బదులు అమెరికానైనా చూపించరా బాబూ" అంది శాంత.

"వీలయితే అమెరికానూ చూపిస్తాను. అది కాకపోతే ఇంకో మార్గం ఉంది....."

"ఏమిటది ?"

"నేను చదువుకోవటానికి అమెరికా వెడతాను. అక్కడే ఓ పిల్లను చూసి పెళ్లి చేసుకుంటాను. అప్పుడు మీరు మీ తోడికోడలిని చూడటానికి వద్దురుగాని. ఆమెకు వెన్నెలవంటి కాంతిని విరజిమ్మే ......"

"రమేశ్! నీ స్నేహితు లెవరో పిలుస్తున్నారు. చూడు"—అంటూ శాంత రమేశుడి వాగ్ధాటిని దివినుండి భువికి మరల్చేది.

రమేశుడు వెంటనే స్నేహితులకోసం పరుగెత్తేవాడు.

తన కాబోయే భార్య ఎలా ఉండాలో, వదిన ముందు వర్ణించేవాడు. ఆ వర్ణించటంలో తన్ను తానే మర్చిపోయి స్వప్నలోకంలో విహరించేవాడు.

"విద్యాసరస్వతి, రూపలక్ష్మి, రసిక—శిరోమణి



అతడు
తన
జుట్టు
అంటే
గర్విస్తాడు...
Tata's Perfumed HAIR OIL
THE TATA OIL MILLS COMPANY LIMITED MADE IN INDIA
టాటావారి హేర్ ఆయిల్ వాడుటచే అతని జుట్టు
ఆరోగ్యవంతముగా నిగనిగ లాడుతూ వున్నది!
టాటావారి హేర్ ఆయిల్‌లు • తలను చల్లపరుస్తాయి • జుట్టును ఆరోగ్యవంతముగా మంద
రముగా నుంచును • దువ్వుకొన్నాక జుట్టును చెదర నీయవు • పుష్కలంగా జుట్టునుపెంచు
తాయి • సువాసనతో మనోహరముగా వుండును • టాటావారి కోకోనట్ హేర్ ఆయిల్ —
సువాసనలలోను టాటావారి కేస్టర్ హేర్ ఆయిల్ — గులాబి సువాసనలోను • సైజులలో లభిస్తాయి
టాటావారి హేర్ ఆయిల్స్
7HOY-48-TEL

కుగుణాలఖని, ప్రేమరాశి .... " ఇలాంటి పదాలు ఆ వర్ణనలో దొర్లిపోయేవి.

శాంత అతడి ఊహలను చూసి, లోలోపలే నవ్వుకునేది.

"ఈ వయస్సే అంత; పిచ్చికుర్రాడు" అని ఊరుకునేది. శాంత పుట్టింటికి వెడితే, కృష్ణమూర్తి కన్నా ఎక్కువగా విసుక్కునేవాడు రమేశ్.

గాలి— మార్పువల్లనైనా కోడలి ఆరోగ్యం బాగుపడుతుందేమోనని పుట్టింటికి పంపుదామనుకున్నారు సుశీలమ్మగారు. శాంత పుట్టింటికి వెళ్ళి చాలా రోజు లయింది కూడా.

ఉత్తరం చూసిన వెంటనే శాంత—నాన్నగారు బయలుదేరి వచ్చేశారు.

కూతురి మొహం చూసి ఏమనాలో ఆయనకు తోచలేదు.

చాలాకాలానికి వచ్చిన తండ్రిని చూసి, సంతోషంతో "రా నాన్నా" అంది శాంత.

పాలిపోయిన మొహం, లోతుకు పోయిన కళ్ళు ఎత్తి కనిపించే పళ్ళు, ముక్కు—వీటిని చూసి 'తమ కూతురు ఇంతేనా' అనిపించింది.

"ఎందుకమ్మా ఇలా చిక్కిపోయావు" అని అడిగారు ఆయన.

"ఏంలేదు, ఈమధ్య మూడు పేలుగా తలనొప్పిగా ఉంటోంది; అంతే. మరేం కంగారుపడకు నాన్నా" అంది శాంత.

శాంత—మామగారు "అమ్మాయి అనారోగ్యం మాకంతా పెద్ద సమస్యయిపోయింది. ఎంతమంది డాక్టర్లకో చూపించాం గాని ఎందుకో, ఏమిటో కూడా తెలియలేదు. అందరికీ అదే బెంగగా ఉంది" అన్నారు.

"అందుకె మీకు ఉత్తరం వ్రాశాం. పుట్టింట్లో ఉంటే, ఏమైనా తగ్గుతుందేమోనని. ఎంతయినా ఇది అత్తవారిల్లు; తనూ ఊరికే కూర్చోదు. కొద్ది కొద్దిగా నయినా బాధ్యత ఉండనే ఉంటుంది. అక్కడైనా, కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోనీ" అన్నారు సుశీలమ్మగారు.

"ఎక్కడైతే ఏమిటమ్మా? నా కేమో రెండిళ్లకు ఏమీ తేడా కనిపించదు" అంది శాంత.

కోడలి మాటతో పొంగిపోయారు సుశీలమ్మగారు.

కాని, శాంత మాటలు ఉత్ప్రేక్ష కాదు.

ఇంటో భర్త, అత్తగారు, మామగారు, మరిది అందరికీ శాంతంటే ఎంతో ప్రేమా, విశ్వాసమూనూ. ఆడపిల్లలులేని సుశీలమ్మగారు కోడల్ని కూతురిలాగే చూసుకునేవారు. పెళ్లయిన కొత్తలో శాంతను పండగలకు కూడా పుట్టింటికి పంపేవారే కాదు పండగకు పిలవటానికి వచ్చిన శాంత తండ్రితో:

"మీ కయితే ఇంకా ఇద్దరు ఆడపిల్లలున్నారు. మాకు శాంత ఒక్కతే. తను వెళ్లిపోతే మాకు పండగేమిటి చెప్పండి" అన్నప్పుడు శాంత—నాన్నగారు ఏమీ బదులు చెప్పలేక పోయేవారు.

శాంత—తల్లి, కూతురు రాలేదని చిన్నబుచ్చుకున్నా, వియ్యపురాలు అన్న మాటలు ఆమె మనసుకు హాయి నిచ్చేవి.

గాలి మార్పువల్లనైనా తన ఆరోగ్యం ఓ దారికి రావచ్చునన్న ఆశతో ఈసారి శాంత పుట్టింటికి వెళ్ళడానికి ఒప్పుకుంది,

తామరకొలను

3

శాంత—నాన్నగారు రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నారు. సుశీలమ్మగారు శాంత—చెల్లెళ్ళూ, తమ్ముళ్లకోసం రకరకాల ఫలహారాలు చేసిపెట్టారు.

ఊరికి వెళ్ళేందుకు ముందురోజు సాయంకాలం, శాంత—నాన్నగారు శివగిరిరావుగారితో కలిసి బజారుకు వెళ్లారు. శాంత తన బట్టలు సర్దుకుంటోంది.

రమేశ్ ఇంటికి రాగానే కాళ్లు కడుక్కుని వంటింట్లోకి వెళ్లాడు. ఒక్కడ ఎవ్వరూ లేకపోవటంతో:

"వదినా" అని గట్టిగా కేకవేశాడు.

"ఏం కావాలి రమేశ్" అని తన గదిలోనుండే అడిగింది.

"నాకు టిఫిన్ ఇద్దురుగాని రండి."

"అలమరాలో మూత—పెట్టాను తీసుకో."

"సరే; అయితే, నా కక్కర్లేదు" అన్నాడు దురుసుగా.

"ఇలా చేస్తే ఎలా చెప్పు రమేశ్! రేపటినుండి టిఫిన్ పెట్టటానికి నేనుండను కదా. మరి అమ్మను కష్టపెట్టకు. వీలయినంతవరకూ నీ పనులు నువ్వే చేసుకోవాలి."

"రేపు పుట్టింటికి వెడతా ననగానే ఎంత గర్వం వచ్చేసిందో చూశారా? ఇక మేమంతా కనిపిస్తామా?"

శాంత జవాబు చెప్పకుండా అలమరానుండి టిఫిన్ తీసి ప్లేటులో పెడ్తోంది. రమేశ్ ఎందుకలా అన్నాడో శాంతకు తెలుసు.

తను పుట్టింటికి వెళ్ళినప్పుడల్లా రమేశ్ ఇలాగే తన అసంతృప్తి వ్యక్తపరిచేవాడు. కాని, ఆ అసంతృప్తి తెర వెనుక ఉన్నది. నిర్మల—స్పృహ మున్న విషయం ఆమెకు తెలియనిదా?

శాంత టిఫిన్ ప్లేటు రమేశుడి ముందుంచింది.

"నేనేం రాక్షసుడిని కాను, ఇవన్నీ తినడానికి. తీసెయ్యండి."

"ఎక్కువగా నెయ్యి వేస్తాను; తిను రమేశ్!"

"మీరు వేసే నెయ్యికోసం మొహం వాచిలేను నేను. ముందు తీసెయ్యండి."

శాంత సగం తీసి వేరే ప్లేటులో పెట్టింది. రమేశ్ మౌనంగా తింటున్నాడు.

"పింగ్‌పాంగ్ లేదా ఈరోజు?"

"ఉంది."

"రేపటినుండి త్వరగా లేవడానికి అలారం పెట్టుకో. ఆలస్యంగా లేస్తే కాలేజికి లేటవుతుంది."

"ఒక ముసలమ్మ ఉండేదిట. ఆమె దగ్గర ఓ కోడి ఉండేదిట. తన కోడి కూయకపోతే, తెల్లవారదనుకుందిట ఆ ముసల్ది" అని ఆగాడు రమేశ్.

శాంత నవ్వి, "తరువాత?"

"ఇహ ఇక్కడి విషయాలు మీ కెందుకు? పుట్టింట్లో హాయిగా ఓ సంవత్సరంపాటు ఉండి రండి. అత్తగారు, మామగారు, భర్త, మరిది–వీళ్ళ గొడవలేం లేకుండా."

"సంవత్సరం ఎందుకుంటామా? తొందరగానే వచ్చేస్తాను."

"ఏమక్కర్లేదు; మీరు లేకపోతే మాకు గడవ దనుకున్నారా ఏం? మీరు లేరని మే మెవ్వరం చచ్చిపోం."

"ఛ, అవేం మాటలు. రాక రాక నాన్నగారు వచ్చారు. వెళ్ళకపోతే బావుండదు."

"మహారాజులా వెళ్ళండి. ఎవరొద్దన్నారు?"

"అయితే ఈ కోపం ఎందుకు మరి?"

"మీ రిప్పుడు పుట్టింటి కెందుకు వెళ్ళా లసలు? ఆడపిల్లలు ఓ కారణానికి పుట్టింటికి వెడతారు. ఇప్పుడు మీకు అలాంటిదేమీలేదు. మీరెందుకు వెళ్ళాలి?"

"రేపు నీ భార్య వస్తే, ఇలాగే అడ్డపడతా వన్న మాట; పుట్టింటికి వెళ్ళొద్దని."

"రేపటి సంగతి అలా ఉంచండి. ఇప్పటి మాట చెప్పండి ముందు. నాకు పరీక్షలు దగ్గర కొచ్చాయి కదా. మీరు వెళ్ళిపోతే ఎలా?" ఎంతో గొప్ప కారణం ముందుంచాడు రమేశ్.

శాంత నవ్వాపుకోలేకపోయింది.

"నే నేం చదువుకున్నానో తెలుసా రమేశ్?"

"ఆఁ తెలుసు."

"అయితే చెప్పు"

"మెట్రిక్ పాసయ్యారు."

"ఇప్పుడు చెప్పు. మెట్రిక్ పాసయినవాళ్ళు ఫైనల్ ఎం. బి. స్టూడంటుకి పాఠం చెప్పగలరా?"

దానికి జవాబు చెప్పలేక తికమక — పడ్డాడు. రమేశ్; ఏమీ తోచకపోయేసరికి కోపంతో మండి పడుతూ:

"ఇలా మాట్లాడడం ఒకటి బాగా వచ్చు మీకు. ఎక్కడున్నా ఏడవండి. నాకేం? పుట్టింట్లోనే ఉండండి. ఇక్కడికి రానే రాకండి" అంటూ కాఫీ ఓ గుక్కలో తాగేసి చరచరా వెళ్ళిపోయాడు.

శాంత పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

శాంత—మనసు కలుక్కుమంది. వెళ్ళేముందు మరిదితో దెబ్బలాడి వెళ్ళాల్సి రావటం చాలా కష్టమనిపించింది. ఏం? తనకు ఆమాత్రం స్వాతంత్ర్యం లేదా?

"హుఁ. ఏమైనా అనుకోనీ నాకేం" అనుకుంది.

49 వ పేజీ చూడండి



"బాబూ! సినిమా వేలానికి ఒక మగ టిక్కెట్టు రెండాడటిక్కెట్లు యిప్పిస్తారా?"

జీవిత సంగీత

రాజ్యలక్ష్మి



(గతసంచిక తరువాయి)

మీనాక్షి—నోట మాట రాలేదు. గౌరి అభిప్రాయం తెలుసుకున్న తర్వాత కొంతసేపటివరకూ నిశ్చేష్టతతో ఉండిపోయింది— ఆలోచించింది ఆవిడ.

ఆరిపోతున్న గౌరి—చెంపలపై తిరిగి అశ్రు ప్రవాహం—

"అమ్మా! నా కడుపున పుట్టినాడన్న మాట తప్ప ఇంకో పాప మెరగడమ్మా— కులయామ డన్న కొదవే గాని, నవ్వడం ఏడవడం తప్ప మరో చెడ్డపని రాదమ్మా ఈడికి— నాఖరుగా ఆడు మీఇంట్లో పడిఉంటే చాలు; నా గుండె చల్లగా ఉంటది...."

తన మౌనంతో అంతసేపూ గౌరిని ఎంత కష్టపెట్టిందో తెలుసుకుంది మీనాక్షి.

"గౌరి, ఏడవకు! కులభేదం నాకు లేదు. చెప్పుకోవాలంటే మాకన్నా ఉన్నత కులాలవాళ్ళు ఎందరో ఉన్నారు.... అదికాదు. నీ కొడుకును పెంచ మంటే, రహస్యంగా ఎలాగో మావాడిగా చెప్పి పోషించగలను. కానీ, వాడిని నేను మాత్రం కష్టాలు పెట్టకుండా ఉంటానని ఎలా అనుకున్నావు ?"

జలజల కురుస్తున్న వానలో సూర్యకాంతిలా గౌరి—కళ్ళల్లో వెలుగు వచ్చింది.

"అలా అన బోకండమ్మా! మమ్మల్నీ మిమ్మల్నీ ఒక భగవంతుడే ఒక్కవిధానే పుట్టించినాడు. మాకైతే అదృష్టంకొద్దీ గేనం వస్తే వస్తది— మీలాటోల్లకి తల్లితండుర్లే చిన్నకాలంనుంచి గేనం బోధిస్తారు. మీ రెంత కష్టపెట్టినా నా కొడుకు సుఖపడగలడమ్మా!"

"గౌరి! నీ ఆలోచన అద్భుతమైనది. సరే! మరి నువ్వెక్కడికి వెళ్తావు— మీవాళ్ళు—మనువు కెళ్ళారుకదూ ?"

గౌరి వేదాంతినిలా నవ్వింది: "ఎక్కడికో పారిపోతాను; ఇష్టమైతే నచ్చినోణ్ణి పెళ్ళి చేసుకుంటాను. బతుక్కు కష్టమైతే ఏ రైలుకిందనో బుర్రెడతాను— నా కేమిటమ్మా! ఆడు సుఖపడితే చాలు...."

తోటి ప్రాణి జీవిత సమస్యను పరిష్కరించలేక మీనాక్షి బాధపడింది. 'ఎటువంటి పరిస్థితుల్లోనూ చచ్చిపోయే ప్రయత్నం చెయ్యకు' అనా లనుకుంది మీనాక్షి; కానీ— గొంతుపెగిలి రాలేదు— మనసు బంధంవేసింది. 'అవును; బ్రతికి ఏం చెయ్యాలి అప్పుడు' బేల హృదయాలు అనలే తట్టుకోలేవు— అదంతే!

"వెళ్ళొస్తానమ్మా! మీరు నాకు చేసిన సాయానికి ఎన్ని జన్మలెత్తినా ఋణపడి ఉంటాను!" దీనంగా చూస్తూ గద్గదికంగా అంది గౌరి.

పెద్దల జోక్యం...!

వి శా ఖ

చిన్నవాళ్ల విషయాలలో కొన్నిట్లో పెద్దలు జోక్యం కలిగించుకోకుండా, చూసీ చూడనట్లు వదిలేస్తే కొన్ని విషాద పరిణామాలకి దారితీస్తుంది. అలా దారితీసినప్పుడు చూసేవారు పెద్దవాళ్లనే దుయ్యబట్టుతారు. పెళ్లయిన క్రొత్తలో భార్యాభర్తల మధ్య చిన్న చిన్న దెబ్బలాటలు వచ్చాయనుకోండి. అది చినికి చినికి గాలివాన అయ్యే సూచనలు కనపడితే, పెద్దవారు కలుగజేసుకుని సంగతి సందర్భాలు తెలుసుకుని సర్ది—చెప్పాలి. ప్రస్తుతం నే వ్రాయదల్చుకున్నది దీన్ని గురించి కాదు. పెద్దలు పెళ్లయిన క్రొత్తలో చిన్న దంపతుల విషయా లన్నింటిలో కలుగజేసుకుని భార్యాభర్తల మధ్య మనస్పర్థలకి కారకులయ్యే విషయాన్ని గురించే వ్రాద్దామని సంకల్పించాను.

మా వేణుకి చదవుకున్న, అందమైన భార్య ఉంది. పెళ్లయి సరిగ్గా రెండేళ్లు అయిందో లేదో! అందరం: వేణు నెమ్మదస్తుడు. భార్య చదువుకున్నది; అన్నీ తెలిసినది. కనుక వాళ్ల సంసారం హాయిగా సాగుతోందనే అనుకున్నాము. ఈమధ్య మా యింటికి వచ్చినప్పుడు వేణుని చూసి, నేనూ మావారూ కూడా ఆశ్చర్యపోయాము. వేణు ముఖములో మునుపటి ఉత్సాహమే లేదు. "ఏం వేణూ! కులాసావా? మీ ఆవిడ నీతో ఊరికి రాలేదా?" అని అడిగాను.

అంతే; ప్రారంభించాడు వేణు:

"అన్నీ బాగున్నని కానీ, అయ్యో నోట్లోనే శని అన్నట్లుంది నా పని. మా ఆవిడ వాళ్ల అమ్మకి ఒక్కతే కూతురు. కనుక ఆవిడ మా యింట్లోకి కిటికీ తెరల దగ్గరనుంచి కొనిచ్చింది. అన్నింటినీ ఆవిడే సెలక్టు చెయ్యాలి. మా వాణికి ప్రతి దానికి వాళ్ల అమ్మ—సలహా కావాలి. లేందే, ఏమీ చెయ్యలేదు."

"అదేమిటి వేణూ! మీరూ, వాళ్లూ వేరే వేరే ఊళ్లల్లో కదూ ఉంటూంటా" అన్నాను—నేను ఆశ్చర్యంతో.

"అదే చెప్పొస్తుంట. మా మావగారు రెండు నెలలు సెలవుపెట్టి వస్తారు. అతని సెలవయిపోక, అతను వెళ్తారు. మా అత్తగారికి ఆఫీసు అదీ లేదుగా! ఆవిడ ఇంకో రెణ్ణెల్లో మూణ్ణెల్లో ఉండి వెళ్తుంది. వెళ్లిన నెలకే మా ఆవిడ పుట్టింటికి దయచేస్తుంది. పంపనంటే రాగాలు, భోగాలు. ఓ రెండు నెలలుండి వస్తుంది. అత్తగారి బాధ లేకుండా ఓ నాలుగు నెలలుండేసరికి మళ్లా మా మావగారు సంవత్సరాంతం సెలవు పెట్టి దంపతు లిద్దరూ వేంచేశారు, మళ్లీ ఆ ముందరి ఏడాదిలాగే ఈ ఏడాదీను. ఈ రెండేళ్లలో నేను వాణితో కలసి ఒంటరిగా ఆర్నెల్లయినా ఉండలేదు. ఈ గొడవ చాలక, మా మావగారు మా ఊరే ట్రాన్స్‌ఫరు చేయించుకున్నారు. నేను విసుగెత్తి సెలవుకు అర్జీ పెట్టుకుని వచ్చాను" అన్నాడు.

ఇలాగా వాణిలాంటి అమ్మాయిలకి ప్రపంచమంతా తమ్ము పెంచి పెద్దచేసిన తల్లిదండ్రుల తోటే ఉంటుంది. గారంగా పెరిగి, అన్నింటికీ తల్లి మీదే ఆధారపడతారు. దేన్నీ స్వయంగా ఆలోచించి నిర్ణయానికి రారు. తల్లీ, తండ్రీ ఒక్కగానొక్క కూతుర్ని ఆడంబరంగా పెద్ద ఉద్యోగస్తుడికి ఇచ్చి పెళ్లిచెయ్యదలచి చేస్తారు. అందులోనూ, ఈ పిల్ల ఏమీ ఆలోచించుకోదు. తల్లి చెప్పేసరికి సరే అంటుంది. పెళ్లయి అత్తారింట్లో ఉంటే, కష్టపడుతుందని బెంగ. పోనీ, వేరింటి కాపురం ఉద్యోగరీత్యా పెట్టుకున్నా, దేనికీ స్వంత తానుగా చేసుకోలేక, తల్లి—కొంగు విడువలేదు. ఇది ఒక రకంవారు. ఆ తల్లీ, తండ్రీ దూరంనుంచే క్షేమసమాచారాలు కనుక్కుంటూ వదిలేస్తే కొన్నాళ్లకైనా తన భర్త, తన ఇల్లు, తన పిల్లలు అని అన్నీ వస్తాయి. కానీ, వీళ్లు ఊరుకోరు. అన్నింట్లోనూ జోక్యం కలిగించుకుంటారు. దాంతో ఆ అల్లుడికి అసంతృప్తి పెరుగుతుంది. ఇలాంటివి ఇంకా విషాదంగా పరిణమిస్తే ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదు.

ఇంకో రకంవారు—తల్లికీ, తండ్రికీ తమ పిల్లల మీద అధికారం అదీ ఓ పట్టాన వదిలించుకోవటం ఇష్టం ఉండదు. పెళ్లయినా, తమ ఇంటిని వదలి వెళ్లిపోయినా, ఇంకా వాళ్లను పట్టుకు వేధిస్తారు. తాము అనుకున్నవన్నీ వాళ్ల నెత్తిన రుద్ది వాళ్లవి అని ఓ స్వంత అభిప్రాయం లేకుండా చేస్తారు. ఇలాగ అన్ని విషయాల్లోను పెద్దలు జోక్యం చేసుకోటంవల్ల నష్టమే గానీ, లాభం ఏదీ లేదు.

సరే; అత్తగారు—కోడలు గొడవలు పాతవే కదా! దాన్ని గురించేమీ వ్రాయ నవసరంలేదు. ప్రతి చిన్న విషయంలోను అత్తగారి జోక్యం సంసారానికెంత అనర్థమో వేరే చెప్పక్కర్లేదు.

ఆడదైనా సరే, మగవాడైనా సరే; అతి ఎక్కువగా తన తల్లిదండ్రులమీద ఆధారపడి తన పవిత్ర బంధానికి విలువ సరిగ్గా అర్థం చేసుకోకపోతే, అన్ని నష్టాలే ఉంటాయి. భార్యాభర్తలు ఒకరి కొకరు విలువ నిచ్చుకుని వారి వారి జీవిత మార్గాల్ని వారే వీలయినంత సర్దుకపోవాలి. సంసారం పెట్టేటప్పుడు—అదీ కొన్ని కొన్ని స్వయంగా నిర్ణయించుకోవాలి. పెద్దలు అనవసరంగా అన్నిట్లోనూ జోక్యం కలిగించుకోకూడదు.

సాధారణంగా ఇంగ్లీషు—పత్రికల్లో మాత్రమే అత్తగారిమీద (భార్య తల్లి) తమాషాలుంటాయి. అవి వాళ్లకి సాధారణంగా జరుగుతూ ఉంటాయట. ప్రస్తుతం మన దేశంలోనూ ఇలాగ తల్లులు తమ ఆడపిల్లలమీద తమ అభిప్రాయాల్ని రుద్దడం జరుగుతోంది; ఈమధ్య కాస్త ఎక్కువగా నే వింటున్నాం కూడా.

పెద్దవాళ్లు భార్యాభర్తలమధ్య ఏవో చిన్న చిన్న కలతలు రేగితే, సర్ది—చెప్పగలిగితే చెప్పాలి. అంతేకాని, పెద్దలే వాటిని చినికి చినికి గాలి వానగా చెయ్యకూడదు. పెద్దలు అన్నాక, విచక్షణా జ్ఞానం—అదీ ఎక్కువగా ఉంటుందని ఆశిస్తాం. కనుక తాము ఎప్పుడు కల్పించుకోవాలి అని, ఎప్పుడు చూసీ చూడనట్లు ఊరుకోవాలి—అన్నీ ఆలోచించుకు చేయాలి. ఒక సంసారంలో కలతలు ఆ చిన్న భార్యాభర్తలవల్ల కంటే, వారి తల్లిదండ్రులవల్లే కలిగాయంటే, అది ఎంత శోచనీయం! ★




విజయ

అలలు లేగి పడుతున్నాయి. మా మనసుల్లో అలల్లాగే, అవి కూడా అందని సమాధానాలకోసం పరుగెత్తి, ఢీకొని, ఓడిపోయి వెను దిరిగి పోతున్నాయి. శారద మౌనంగా కూర్చుంది. ఆమె చీర కుచ్చెళ్లు తడిసిపోయాయి అంచుల వద్ద. అస్తమిస్తున్న సూర్యుని కాంతి ఆమె కళ్లలోంచి ప్రతిఫలించింది.

అప్పటి శారదకు, ఇప్పటి శారదకు ఎంత భేదం! రెండు జీవితాల దూరం గతాన్ని, భావిని విభజించాయి.—

* * *

మానవ హృదయాంతర్గత భావాలు, విప్పిచెప్ప రాని సమస్యలు. ఉద్రేకోత్సాహాలూ, వ్యక్తిత్వ పరి ణామాలు ఏ బేరామీటరుకు అందవు. కాని, ఒక్కో సారి పరీక్షగా జరిగిపోయిన సంఘటనల్ని మథించి, కించిత్ హృదయం, కొంత మనస్సూ జోడించి ఆలోచిస్తే, కొంతవరకు సమస్య విడిపోవచ్చు.

* * *

రాజు నాకు బాల్యమిత్రుడు. నాలుగోక్లాసు నుంచి మాకు పరిచయం. ఆ రోజుల్లో కారు ఉండడం రాజసీవి అన్నమాట. వాడలాగే, రాజు లాగే వచ్చేవాడు బడికి. వీలయినప్పుడల్లా నేను వెంటనే ఉండేవాడిని. అలాగే స్కూలుఫైనలు దాకా వచ్చాం. దాంతర్వాత నేను బయాలజీ స్వీక రించి, మండూక సంహారం కానిచ్చాను. వాడు లాజిక్, హిస్టరీ తీసుకుని ఫ్రెంచి రివల్యూషనులో మునిగిపోయాడు. క్లాసులూ, శాఖాలూ వేరయినా ఒకటే కాలేజీ కాబట్టి ఇంటర్మీడియట్‌తో మా అనుబంధం దృఢతరం అయింది. తర్వాత నేను 'డాక్టరీ' కి మద్రాసు పోవడం, వాడు 'లా' చదవ టానికి బెల్గాం పోవడం జరిగింది.

మొట్టమొదటిసారిగా మాకు ఈ ఎడబాటు కొంత బాధగా కన్పించినా, ఎవరి పనులలో వాళ్లం మునిగిపోయి, కొంత ఉత్తరాల ద్వారా, కొంత మా అంతరంగంలో ఉన్న స్నేహంవల్ల కప్పిపుచ్చుకున్నాం బాధని. నేను అనాటమీ, పాథాలజీల్లోనూ, వాడు కంపెనీ లా, పీనల్‌కోడులోనూ మునిగిపోయాం.

వేసవి సెలవులకు నేనూ, వాడూ తిరిగి ఊరికి రావడంతో, మా జీవిత కాండలో సరికొత్త నాట కాలకు నాందీ ప్రస్తావన జరిగిందని చెప్పగలను. బహువచన ప్రయోగం—మా—అని—సరికాదేమో, కాని, వాడిని గురించే చెప్పబోతున్నా; వాడిని నాతో బాటు కాక, మరో విధంగా ఆలోచించుకోలేను— ఈనాటికి కూడా—ఇంత జరిగినా కూడా—

వాడిని చూడగానే కొంచెం నవ్వే వచ్చింది. గొంతు మారిపోయి మాంచి కోడె రంకె వేసినట్లు విన్పించింది. వాడు కరచాలనం చేసినప్పుడు వాడిలో నూతనంగా శక్తి కన్పించింది. ఈ సందర్భంలో మా వయస్సులు 18—19 సంవత్సరాలని చెప్పాలి. వాడి మాటల్లో, నడకల్లో క్రొత్త ధీమా, ఠీవి, దమకూ తెలియవచ్చాయి. వాడూ అదే మాటలు నన్ను గూర్చి అన్నాడనుకోండి—కాని వాడిలో మార్పు మాత్రం కొట్టవచ్చినట్లు కన్పించింది.

"టెన్నిస్ ఆడుతున్నాను ఈమధ్య—నీవో ?'' అన్నాడు మాటల్లో.

"అబ్బే .... టైం ఉంటేనా ? వీలయితే సెలవు రోజున 'చెస్' ఆడతాను .... అదీ ఒకటి రెండు మూవ్స్ కాగానే లేచిపోతాను పనిమీద'' అన్నాను.

ఆమాట అనగానే ఒక విలక్షణం స్ఫురించింది వెంటనే మా ఇద్దరి మధ్యా. నాకు టేబిల్‌టెన్నిస్ కూడా రాదు. మహ అయితే చెస్, కారమ్స్.

మా ఇద్దరి స్వభావాలూ విరుద్ధ దిశల్లో బయలు దేరాయా అనే సంశయం కలిగింది.....

నేను మూడో సంవత్సరంలో ఉన్నప్పుడు వాడో సారి మద్రాసు వచ్చాడు. పోయినసారి చూచిం దాని కంటే, ఇంకా ఠీవిగా ఉన్నాడు. మాటల్లో ఆవేశం, కళ్లల్లో ఉద్రేకం వెలిగాయి.

"ఒరేయ్, మూడేండ్లు చదివావు కదా మెడి సిన్! చెడ్డ అలవాట్లు పోవాలంటే ఏం చేయా లిరా ?'' అని అడిగాడు.

"రోజూ దినానికి మూడుసార్లు పేము బెత్తంతో తగిలిస్తే సరి'' అన్నాను. నవ్వాడు; కళ్లు మూతలు పడిపోయాయి. పైకి దువ్విన నొక్కుల జుత్తు నృత్యం చేసింది లేగి .... మెడ నరాలు ఉబ్బి, పైకి వచ్చినట్లు కన్పించాయి.

"మరేం లేదులే—బెల్గాంలో రెండు చుక్కలు వేయటం అలవాటయింది'' అన్నాడు; ఏ-రేం ప్రమాదం లేనట్లు.

"ఇక్కడ అవేం కుదరవు .... హాస్టలు రూల్సు! ఒప్పుకోరు'' అన్నాను.

"ఒరేయ్—నీవింకా వెనుకటి రోజుల్లో ఉన్నావురా —పద'' అన్నాడు.

రాత్రి తొమ్మిది గంటలకు ఇల్లు చేరేసరికి గగన మయింది. మళ్లీ మాట్లాడనని బెదిరించిం తర్వాత అతి కష్టంమీద నాతో వచ్చాడు గదికి. రాత్రంతా పొర్లుతూనే ఉన్నాడు పడకమీద .... జాలీ, కోపం—రెండూ కలిగాయి.

ప్రొద్దునే షేవింగ్ వగైరా అయింతర్వాత ఇద్దరం బయల్దేరాం హాస్పిటల్‌వేపు ....

"అన్నట్టు—వచ్చిన పని మరిచేపోయాను. సాయంత్రం కొంచెం షాపింగ్ ఉంది.... చైనా బజార్‌కు పోదాం .... '' అన్నాడు.

"ఏం ? ప్రెజంటా ఎవరికయినా ?'' అన్నాను; తలూపాడు.

"అవును—శారదకి'' అన్నాడు..

ఇదంతా వ్రాసేముందు పాత్రల్ని పరిచయం చేయడం ముగించాల్సిందసలు. శారద గురించి రాయాలంటే, వండర్‌ఫుల్ అనో, 'ఏ—వన్' అనో రాయలేను .... వరుసకి రాజుకి మేనత్త కూతురు. చిన్నప్పట్నించీ రాజు—స్నేహితంతోబాటు శారదతో కూడ పరిచయం నాకు. కాలేజీ రోజు ల్లోంచి శారదతో చనువు కూడా బాగా—రాజులాగే —పెరిగింది. మొత్తంమీద శారదతో ముఖాముఖి మాట్లాడగల పరిచయం ఉండిపోయింది .... చిన్న ప్పుడే శారదకూ, రాజుకూ 'ముడి' పెట్టేశారు పెద్దలు.

"ఏం ? విశేష మేమయినా ఉందా ?'' అన్నాను కుతూహలంగా.

"ఒఫ్‌కోర్స్—మరి ఎంగేజ్‌మెంట్ ఎనౌన్స్ చేసేందుకు నేను ఉంగరం ప్రెజెంట్ చేయక్క ర్లేదా ఏమిటి ?'' అన్నాడు.

మరే పరిస్థితుల్లోనో అయితే అంత మంచి వార్త విని ఆనందించేవాడిని కాని, పోయిన సంవత్సరం శారదతో మాటల్లో, నేను తెల్సుకున్న విషయాల వల్ల ఈ వార్త విని పూర్తిగా హర్షించలేక పోయాను. వివరంగా చెప్పాలంటే, శారద—వాళ్ల నాన్నగారిని కడుపులో పుండు చూపించటానికని మద్రాసు తీసుకువచ్చింది. అప్పటికే నేనో పెద్ద అపర ధన్వంతరిలాగా పరిగణించబడడంచేత, వైద్యం కాకపోయినా, మంచి డాక్టరును ఎన్నుకోవడం నాకే అప్పజెప్పింది శారద. మా ప్రొఫెసర్ సలహాపైన డా. గురుదాస్ గారికి చూపించడం, ఆయన ఆప రేషన్ చేస్తాననడం చాలా అనవసర విషయాలు.

ఒకరోజు—అంటే, శారద మద్రాసులో అప్పుడు గడిపిన వారం రోజుల్లో ఒకరోజు—ఇద్దరం మెరీ నాకు పోయాము. నీళ్లల్లో కాళ్లు తడుపుకుంది శారద. నాకు బాగా గుర్తు—

ఆకాశంరంగు చీర కట్టుకుంది. వెల్వెట్ జాకెట్ మీద ఎండ పడి మెరిసింది. ఇద్దరం కూర్చున్నాం.

శారదే ప్రారంభించింది ముందు....

"నిన్ను ఒక విషయం అడగాలి .... '' అంది.

"ఎవర్ని గురించి ?'' అన్నాను.

"నా గురించి ... పూర్తిగా చెప్పాలంటే నా వివా హము గురించి'' అంది.

"నీ వివాహం గురించి, నన్నడగడం దేనికి ?'' అన్నాను ఆశ్చర్యపోయి.

తలెత్తి చూసింది శారద. మరొకరయితే కరిగి పోయి ఉందురు ఆ చూపుల్లో మండి. వెంటనే వెన్నెల్లాంటి నవ్వు విరిసింది.

"భలేవాడివేలే—నా కామాత్రం తెలుసు!'' అంది.

"అసలు సంగతి చెప్పు—చీకటి పడుతూంది'' అన్నాను.

"అయితే విను—నీవు నన్నేవిధంగా అయినా అర్థం చేసుకో—అది నీ యిష్టం—నా అదృష్టం...మరొక మనిషిమీది భావాలు వ్యక్తిగత విషయాలు. నాకూ, రాజుకూ పెండ్లి జరగడం మంచిదంటావా ?''

"అది చిన్నప్పట్నుంచీ, అందరూ .... ''

"అందర్ని గూర్చి అడగడంలేదు నిన్ను'' అంది వేడిగా. "నీ అభిప్రాయం అడిగాను. రాజుకీ, నీకూ ఉన్న స్నేహం; నాకూ, రాజుకూ ఉన్న బంధుత్వం కన్నా గట్టిది. మా బంధుత్వం, మాతో ప్రమేయం లేకుండా—నీ వన్నట్లు—పెద్దలు ఏర్పరచింది— మీ స్నేహం మీకై మీరు తెలిసి, కావాలని పెంచు కున్న అనుబంధం'' అంది.

"నీకూ, రాజుకూ పెండ్లి నా కిష్టంకాక మరే మవుతుంది.?'' అన్నాను.

సూర్యు డస్తమించాడు. మూసే చీకటిలో శారద ముఖం గమనించబోయి విఫలుణ్ణయ్యాను. ఆ ప్రసన్న సౌందర్యమూర్తి మందహాసం వెనుక ఎన్ని కారుమేఘాలున్నయో కల్పించలేదు నాకు. ఉరు ములు మాత్రం లేశమాత్రం ధ్వనించాయి.

"మరి నీకు ఇష్టం కాకపోతే—నీవు ఇష్ట పడతావనే నా ఊహ శారదా !'' అన్నాను ఎలాగో.

"చూడు—నీవు చదువుకున్నావు. శరీర శాస్త్రంతోబాటు మనస్తత్వ పరిశోధన నేర్పారా మీకు ?'' అంది.

"నిజం చెప్తున్నాను. రాజును పెండ్లి చేసుకోడం నీకు ఇష్టంలేదని నే ననుకోలేను'' అన్నాను. నవ్వింది శారద—నెమ్మదిగా.

—48వ పేజీ చూడండి

గ్రహస్థితి

మేషంలో సూర్యుడు, వృషభంలో బుధుడు, కర్కాటకంలో అంగారక రాహువులు, మకరంలో శని కేతువులు, మీనంలో గురు శుక్రులు, వృషభ మిథున కటక సింహాలలో చంద్రుడు.

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

ప్రస్తుతం ధైర్యోత్సాహములతో కూడిన సమయం. ప్రత్యక్షంగా ఫలితం పొందటానికి మాత్రం నిదానం అవుతూఉంటుంది. ఎంత వచ్చినా ఖర్చు కాగల కారణాలు ఏర్పడుతవి. వివాదాలు, వ్యవహారాలలో మీ మాట చలామణి అవుతుంది. గతకాలంలో జరిగిన పొరపాట్లను ఏదోవిధంగా సరిదిద్దుకోగలుగుతారు. తీవ్రంగా యోచించవలసిన అవసరం లేకపోయినా, కారణం తెలియకుండా ఆ పని చేస్తూ ఉంటారు. మొత్తంమీద సుఖం తక్కువ అని చెప్పవలసిన సమయం. ఇతరుల విషయంలో ఎక్కువ శ్రమను సహించి ఉపకారం చేయగలుగుతారు. వ్రాతలలోను, లెక్కలలోను పొరపాట్లు రాకుండా జాగ్రత్తవహించండి. ఉష్ణాధిక్యం వల్ల బాధలుంటవి.

*　　*　　*

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)


సంఘంలో మీ మాటకు మద్దతు లభిస్తుంది. పనుల వత్తిడివల్ల శ్రమ—తోచినా పర్యవసానంలో సంతృప్తి అనేది కనుపిస్తుంది. వృత్తిలో మీరు అనుకున్నటువంటి పనులు క్రమంగా కొనసాగి సవ్యమైన ఫలితాన్ని ఇస్తవి. ఒక సందర్భంలో లెక్క చూడకుండా ధనం వినియోగించవలసి రావచ్చు. కుటుంబంలో ఉత్సాహము, సందడి బాగుంటవి. మీ ఆరోగ్యం గురించి ఎప్పటి కప్పుడు శ్రద్ధ వహించటం అవసరం. ఇంతకుముందున్నటువంటి ఉద్రేకము, ఆందోళన తొలగిపోతవి. మీరు తలచుకొన్న పనిని నిరాటంకంగా చేయగలుగుతారు. గౌరవప్రదమైన కాలం. 26, 27తేదులలో ఇష్టవస్తు లాభం, శుభవార్త.

*　　*　　*

మిథునం :

(మృగశిర 3, 4 పా., ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

మీ అభిప్రాయాలు ఆచరణలో పెట్టతగిన సమయం. బంధుమిత్రులవల్ల మీ కార్యక్రమాలకు సహాయం లభిస్తుంది. సందర్భానుసారంగా మాట్లాడి మీ గౌరవాన్ని నిలుపుకొన గలుతారు. ప్రయాణ సూచనలున్నవి. ఆదాయాన్ని మించిన ఖర్చులు తగలవచ్చు. ఈ సమయంలో చిన్నచిన్న పేచీలు రావటం సహజం. అంతమాత్రాన ఏ సందర్భంలో వెనుకకు తగ్గవలసిన అవసరం ఉండదు.



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

26-4-1963 శుక్రవారము మొదలు
2-5-1963 గురువారము వరకు

వ్యవహార రంగంలో న్యాయం నిమిత్తం మొదట కొంత శ్రమపడవలసి ఉంటుంది. అధికారులతో సంప్రదింపులు అనుకూలమార్గంలో జరుగుతవి. వృత్తి ఉద్యోగ మార్గాలలో ప్రశాంతంగా ఉంటుంది. దుబారా తగ్గించుకొనుట అవసరం. 27, 28 తేదులలో ధనలాభం, బంధువుల రాక.

*　　*　　*

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష.)

ఈ వారం మీ గ్రహస్థితిలో శుభ సూచనలు విశేషంగా కనుపిస్తున్నవి. ఇటు కుటుంబ విషయాలలో గాని, అటు వృత్తి, ఉద్యోగ, వ్యవహారాలలోగాని అసంతృప్తికి అవకాశం ఉండదు. మీరు నిర్వహించే పనులు నిరాటంకంగా సాగుతవి. ఇతరులవద్ద నుంచి రావలసిన ధనం వస్తుంది. ఇతరుల అసూయ వలన కొన్ని చిక్కులు ఏర్పడనున్నట్లు తోస్తుంది. కాని, దైవానుగ్రహంవల్ల ప్రత్యక్షానికి రాకుండా సమసిపోతవి. ధనాదాయం మామూలుగా ఉంటుంది. ముందుముందు జరుగవలసిన పనులను గురించి ప్రయత్నాలు సాగుతవి. దైవకార్యాలలో పాల్గొంటారు. ఇతరుల మాటలను నమ్మి లేనిపోని కార్యభారం పైన పెట్టుకొనవద్దు.

*　　*　　*

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

శ్రమపడినా ఫలితం దక్కుతుంది. ఒక పని చేస్తూ, మరొక విషయం గురించి యోచిస్తూ ఉంటారు. విశ్రాంతి ఉండదు. సాధారణ ప్రసంగాలలోనే పోటీలు, పట్టుదలలు రాగల సమయం. నూతన ధనాదాయ మార్గాలలో మీ ప్రయత్నం కలిసివస్తుంది. కోర్టు కచేరీలలో అంతగా ఉత్సాహం కనుపించదు. మంచి స్నేహితులు లభిస్తారు. రాజకీయాలలో గాని, పదిమందికి సంబంధించిన ఏ కార్యక్రమంలో గాని, మీ మాటవిలువ బాగుంటుంది. నౌకరులవంటి వారితో పేచీలు రాగల సమయం. వారం రెండవ భాగంలో దుబారా ఖర్చు ; పిల్లల అనారోగ్యాలవల్ల అశాంతి. 30, 1 తేదులలో త్రిప్పట, వస్తు నష్టసూచనలు.

ఈ వారము ధరలు

ప్రస్తుతం వస్తుదినుసుల ధరలు మందీ కాగల సూచనలున్నవి. చక్కెర ధర పెరుగుతుంది. నూలు ధర మామూలుగా ఉంటుంది. నూనె గింజల ధరలలో కొద్ది గిరాకి వస్తుంది. కాని, నూనె రకముల ధరలలో చెప్పుకోదగిన మార్పు ఏమీ ఉండదు.

కన్య :

(ఉత్తర 2, 3, 4 పా., హస్త, చిత్త 1, 2 పా.)

ఈ సమయంలో శ్రమ మీద ఫలితం మరొకరిది. పై అధికారులవల్ల మాటలలో యున్నంత ప్రీతి, క్రియలో కనుపించకపోవచ్చు. ఏ విషయంలోను తొందరపడవద్దు. మీ వ్యవహార విషయాలలో వత్తిడి ఎక్కువ అవుతున్నట్లు తోస్తుంది. తలవని తలంపుగా ఆత్మీయుల సహాయం లభిస్తుంది. ప్రయాణాలు చేస్తారు. ఆర్థికంగా పెరుగుదల కనబడకపోయినా అనేక సందర్భాలలో మీ పైన ఉన్న భారం తొలగించుకొన గలుగుతారు. పిల్లల ఆరోగ్యం బాగుండదు. మీవద్దనుంచి తెలుసుకొని మీకు ఎదురుతిరగగల మనుష్యులుంటారు. జాగ్రత్తగా ఉండండి. ప్రసంగాలలో గాని, ఖర్చుల విషయంలో గాని, నిగ్రహంతో ఉండదగిన సమయం. 29, 30 తేదులలో పేచీలు, వృథా శ్రమ.

*　　*　　*

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

మీరు ఎంత ప్రశాంతంగా, మృదువుగా ఉందామనుకున్నా, వృత్తి వ్యాపారాలలో కొంత కటువుగా ప్రవర్తించవలసివస్తుంది. ఈ సమయంలో తటస్థపడే మనుష్యుల ధోరణి మిమ్మల్ని చికాకు పరుస్తుంది. అత్యవసరం ఏర్పడేవరకూ మీ కార్యక్రమాలయందు శ్రద్ధ చూపలేకపోతారు. ధనాదాయం ఇంతకుముందుకన్నా బాగుంటుంది. కోర్టు కచేరీలలో పట్టుదల చూపవద్దు. ఇతరుల మంచి మాటలవల్ల మీ శ్రమ వృథాకాకుండా, చూచుకొనండి. తరచు శుభకార్యాలలో పాల్గొంటూ ఉంటారు. ఇతరుల వివాదాలలో మధ్యవర్తిత్వం వంటి బాధ్యతలను నిర్వహించవలసివస్తుంది. 1, 2 తేదులలో లాభవార్తలు, ప్రయాణ సూచనలు.

*　　*　　*

వృశ్చికం :

(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

ఈ సమయంలో మీ ఊహలకు ఒక రూపం ఏర్పడుతుంది. మనశ్శాంతి, బాహ్య విషయాలలో గౌరవం లభిస్తవి. తరచు ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటూ ఉండటంవల్ల విశ్రాంతి లోపిస్తుంది.

దేశ రక్షణకై ఆయుధాలు
ఎంత అవసరమో ఉత్పత్తి కూడా అంత అవసరమే!

కాని, శ్రమ— తోచదు. తలవని తలంపుగా ఆదాయం పెరుగుతుంది. ముందుముందు మీరు చేయబోవు కార్యక్రమాలు తృప్తికరమైన పద్ధతితో సిద్ధం అవుతవి. బంధువులకు సంబంధించిన కష్టవార్తలు వినవలసి రావచ్చు. కుటుంబంలో ఖర్చులు, కార్య భారము అధికం కాగల సమయం. స్థిరాస్తులు మొదలయిన వాటిమీద ధనం వెచ్చించటం జరుగుతుంది. సంఘంలో పెద్దరికం లభిస్తుంది. 26, 27 తేదులలో గౌరవం, లాభవార్తలు.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ. ఉత్తరాషాఢ 1 పా.)

ప్రస్తుతం జరుగని పనులయందే ఆసక్తి ఎక్కువ. అందువల్ల వృధాశ్రమ. ఆదాయం బాగుంటుంది. వ్యవహారాలలో సాఫీగా ముందుకు పోలేక పోతారు తరచు ఇతరుల సలహా తీసుకొనవలసివస్తూ ఉండటంవల్ల పనులు చురుకుగా ముందుకు సాగవు. శక్తిని మించి ఆడంబరం చేయవలసివస్తుంది గొప్ప వారి స్నేహం, సంఘ కార్యక్రమాలలో పాల్గొనటం మొదలయినవి ఉంటవి. ఈ వారంలో మీ ఆరోగ్యం చెడే అవకాశాలున్నవి. తలవని తలంపుగా మానసిక ఆందోళన కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో శ్రమను భరించవలసిన సమయం. 28, 29 తేదులలో విలువగల వస్తువులు కొంటారు. శారీరకంగా శ్రమ.

వారఫలాలు

మకరం.

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

ఆలోచించే సమయంలో కనుపించినంత సులభంగా పనులు సాగే అవకాశాలు కనుపించవు. ప్రస్తుతం ఆదాయంకన్నా ఖర్చులు పెరుగుతవి. మీ ఆరోగ్యం ఇంతకుముందుకన్నా బాగుంటుంది. సాధారణంగా ఏ సందర్భంలోనైనా పేచీలు రాకుండా సర్దుకుని పో—తగినకాలం. కుటుంబంలో శుభకార్య ప్రసంగాలు రావచ్చు కాని, ప్రస్తుతం గ్రహస్థితి వల్ల నిదానించవలసి ఉంటుంది. వృత్తిలో ఆశ కనుపించినంతగా ఫలితం చేతికి రాదు. ఈ సమయంలో చేసే శ్రమ అంతా ముందుకు అక్కరకు వస్తుంది. ఎవరు ఏమాట చెప్పినప్పటికి వినవలసిన సమయం కాని, ఆచరించవలసిన సమయంకాదు. 27, 28 తేదులలో కార్యసిద్ధి, సంతోషవార్తలు.

* * *

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)


ధనవృద్ధి, గౌరవవృద్ధి బాగుంటవి. మృదువుగా కాలం జరుగుతుంది. క్రొత్త విషయాలమీద బుద్ధి చురుకుగా పారుతుంది. మీరు నిర్వహించే కార్యక్రమాలు మీకు, ఇతరులకు కూడా సంతృప్తికరంగా పూర్తి చేయగలుగుతారు పిల్లల మూలంగా ఆనందము, సౌఖ్యము లభిస్తవి. బంధుమిత్రులు సమయంలో సహాయం చేయజాలకపోతారు. కాని, ఇబ్బంది ఏమీ ఉండదు. గతకాలంలోని మీ శ్రమ, ఆలోచనలు కలిసి—రాగల సమయం. ఇతరుల కలహాలలో ప్రవేశించకుండా ఉండవలసిన సమయం.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

'నొప్పింపక తానొవ్వక'' అన్నట్లుగా ఉండటం అవసరం. పరుల విషయాలలో ప్రవేశించటంవల్ల శ్రమమాత్రం మిగులుతుంది పని జరుపుకొనే వరకూ ఆదరిస్తారు. ఈ సమయంలో మృదువుగా మీ బాధ్యతను నెరవేర్చుకొనటం ముఖ్యం. ఈ వారం మీ మనస్సు డోలాయమానంగా ఉంటుంది. ఎవ్వరిమాటను కాదనలేకపోతారు ఖర్చుజరిగినా ఉపయోగం తక్కువ. మొత్తంమీద ఏ సందర్భంలోను ఇబ్బంది లేకుండా బయటపడగలుగుతారు. ధనం కాని, వస్తువులు కాని ఇతరులకు సహాయం చేయవలసిన సందర్భాలు ఏర్పడుతవి. శక్తికి మించిపోకుండా చూచుకొనండి. 1,2 తేదులలో అనారోగ్యం, ఆదాయ భంగం. ★





తొలిపలుకు

"ముందు మీరు చదవపోయే పేజీలలో నలుగురు సాహస యాత్రీకులు వస్తారు: మొదటివాడు ఫ్రెడరిక్ ఫాన్ ఎగ్ బర్గ్. ఈయనే లోపలి వాయువు పోకుండా బెలూన్ పైకీ కిందికీ వెళ్లేట్లు యాంత్రిక సాధనం కనిపెట్టాడు; తర్వాత అతని ప్రియ మిత్రుడు పాల్ టిర్ ఫెల్డ్ — లేడెన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్; మూడవ వ్యక్తి ఇతని బావమరిది మారిస్ స్పేడర్స్ హాగ్‌లో చదువుకున్నవాడిగా పరిగణింపబడేవాడు; చివరివాడు, ఫిలిపిన్ అనే పనిమనిషి. ఇతనికి ఇరవయి ఎనిమిది- ముప్ఫయి సంవత్సరాల వరకూ ఉంటాయి. బుద్ధి తెలిసినప్పటినుంచీ ఎగ్ బర్గ్ దగ్గర పనిచేస్తున్నాడు, జీవితాంతం అతని సేవలోనే ఉండేటంత విశ్వాసం కలవాడు.

"బెలూన్ పై తొడుగు గట్టిది. కింద కంపార్ట్ మెంటు ఒక పాత రైలుపెట్టెతో చేయించారు. అవసరం అయితే నీటిమీద తేలేందుకని కిందభాగం పడవవలె నిర్మించారు. లోపల నాలుగు పక్కలా కుదుపుల వల్ల కష్టం కలగకుండా ఉండటానికని మెత్తటి 'కుషన్'లు ఏర్పరిచారు. 'కంపార్ట్ మెంటు'ని తిరిగి మూడు గదులుగా విభజించారు. ఒక్కొక్క గదికీ రెండు కిటికీలు, బయట చిన్న బాల్కనీలు, పైకి మెట్లు. రెండు బెంచిల క్రింద అన్ని అవసరాలకు కావలసినంత నీరు, వంట వండడానికి 'గాస్' (Gas) ఏర్పాట్లు లోపలే ఉన్నాయి.

"సరియైన వసతులు దొరకని ప్రదేశాలను మనస్సులో ఉంచుకొని మంచినీరు, బిస్కత్తులు, ఎండపెట్టిన మాంసం, 'వైన్' (Wine) సీసాలు, పక్కచుట్టలు, బట్టలు, తుపాకి మొదలయిన ఆయుధాలు, పుస్తకాలు, పొగాకు ఇవన్నీ చేర్చి ఉంచారు.

"ఇవికాక, మేకులు, సుత్తులు మొదలయిన పనిముట్లు కూడా ఉంచారు.

"బెలూన్ కట్టివేసేందుకు లంగరులు నాలుగు, వివిధ పరిమాణాలు గల తాటి-చుట్టలు, అవసరమని జాగ్రత్త చేసుకొన్నారు.

"మే 4, 18—నాడు బయలుదేరారు. తూర్పుగా ప్రయాణం చేసి గ్రీన్‌లాండ్ ఇవతలగా ఉన్న ఒక ద్వీపం చేరుకున్నారు."

ఇక్కడ భూమిలో చెప్పవలసిన విశేషం ఏదీలేదు. గట్టి ఇసుక నేల సముద్రం కంటే కొంచెం ఎత్తుగానే ఉంది; తూర్పు వైపు కనిపించే కొన్ని కొండలు తప్పిస్తే చదునుగానే ఉంది. భూగర్భశాస్త్రజ్ఞులను దాని రాతి నిర్మాణం ఎటువంటిదో చెప్పమంటే కష్టపడేవారు; వృక్షశాస్త్రవేత్తలకు అక్కడ పరిశోధించేందుకు ఆధారాలు ఏవీ కనిపించేవి కావు - ఎందుచేతనంటే ఆ ప్రదేశంలో ఎక్కడా ఒక్క చెట్టయినా కనిపించడం లేదు.

బెలూన్ దిగటానికి అనువుగా ఉండే ప్రదేశం కోసం చూశారు; వాతావరణం నిర్మలంగా ఉండటం చేత అక్కడ.

వివరాలు తేలికగా లెక్కవేయగలిగారు; ఇది 86 49′, అక్షాంశము: తూర్పు తులాంశము 40°18′.

అంటే ధ్రువానికి నాలుగువందల ముప్ఫయి ఒక్క మైళ్ళ దూరం కన్నా లేదన్నమాట.

చుట్టూ పదిమైళ్ళవరకూ సముద్రం స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కడా వేరే భూభాగం ఉన్నట్లు లేదు.

వరుసగా రెండురోజులు గాలి వీయనే లేదు.

"ఈ నిశ్శబ్దత విసుగు పుట్టిస్తోంది!" అన్నాడు ఫాన్ ఎగ్ బర్గ్ నిరాశతో. ధ్రువ ప్రాంతాలలో భూమి అతి చదునుగా ఉండటంవల్ల వాయు సంచలనం లేకపోయి ఉండవచ్చు. అదీకాక, ఇదే ప్రదేశానికి కొన్ని వేల అడుగులు పైన కావలసినంత గాలి వీస్తుంది"

"అయితే బెలూన్‌ని పైకి తీసుకుపోతే ఏ వాయుప్రవాహమో తగల వచ్చు కదా?" అని అడిగాడు మారిస్.

"అలాగే అవచ్చు," అని సమాధానం ఇచ్చాడు ఫ్రెడరిక్. "కాని, ఆ గాలి ఏ దిక్కుగా వీస్తుందో! మనం వెళ్లవలసిన చోటుకే కాక వేరెక్కడికయినా కొట్టుకుపోతే?"

"సరే! అయినా ధ్రువ ప్రాంతానికి వెళ్లే విధానం ఏదో ఒకటి ఉండక పోదు!"

"ఉందేమో కాని, నాకుమాత్రం కనిపించడం లేదని చెప్పాలి" అన్నాడు ఫాన్ ఎగ్ బర్గ్.

ప్రయాణీకులలో ప్రతి ఒక్కరూ తల చేతులతో పట్టుకుని గాఢంగా ఆలోచించడం మొదలుపెట్టారు, ఉపాయం ఏదయినా తడుతుందేమోనని. కొన్ని సూచనలు చేయబడినా ఏ ఒక్కటీ పనికివచ్చేది కాదు. ఫిలిప్పిన్ అంతదాకా మౌనంగా ఉన్నా, కొంచెం జంకుతూనే ఒక సలహా ఇచ్చాడు:

"మన పెట్టెని నీటిలోకి దింపి, పడవని నడిపినట్లు తెడ్లతో నడప కూడదా? బాల్కనీలలో కూర్చుని తేలికగా పడవ నడపవచ్చు"

తక్కిన ముగ్గురూ ఒకరి ముఖాల నొకరు చూసుకున్నారు.

"ఆ! ఆ! బాగానే ఉంది!" అన్నాడు ఫాన్ ఎగ్ బర్గ్. "అయితే ఒకటే చిక్కు! తెడ్లు, చుక్కాని చేసేందుకు కావలసిన చెక్క ఎక్కడినుంచి తేవాలి?"

"దాని కేముంది? అంతకన్నా తేలిక పనిలేదు" అని జవాబిచ్చాడు ఫిలిప్పిన్. "మన కాలికింద చెక్కలు రెండు పెరికితే సరి. ఒకదానితో తెడ్లు, రెండోదానితో చుక్కాని చేసుకోవచ్చు. నేలలో చిల్లుపడినా కొంచెం జాగ్రత్తగా ఉంటే సరి."

అందరూ ఫిలిప్పిన్‌ని పొగడారు. అతను సంతోషంతో ఉబ్బిపోయాడు. అతని సూచనని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ వేళే తెడ్లు తయారుచేశారు. మర్నాడు ఈ కొత్తరకం ప్రయాణం అమలులోకి పెట్టారు.

ఈ పని అనుకున్న ప్రకారమే జరిగింది. బెలూన్ క్రింది పెట్టె నీటిలో సుమారు ఒక అడుగుకి మించి మునగకుండా తేలికగా ప్రయాణం చేస్తూ వెళ్ళిపోయింది.

రోజంతా విశేషం ఏదీ లేకుండా గడిచింది. సాయంత్రం భూమ్యాకాశ మధ్యరేఖకి పైన, కొంచెం తూర్పు దిక్కుగా నల్లనల్లని చుక్కలు కొన్ని కనిపించాయి. భూభాగం ఏదో అయి ఉంటుంది కాబట్టి అక్కడికి వెళ్లవచ్చుననుకున్నారు బెలూన్ ప్రయాణీకులు. 'పడవని' ఆ వైపుకి తిప్పారు.

మర్నాడు, ముందుగా కనిపిస్తున్న రాళ్లను సమీపిస్తూ ఉండగా, ఫ్రెడరిక్ ఒక వింత శబ్దం విన్నాడు. ఈ రాళ్ల వెనుకనుంచి ఏవో గర్జనలు వినిపించాయి

ప్రయాణీకులు ఒకరి ముఖాల నొకరు చూసుకున్నారు.

"ఈ చప్పుడు ఏమయి ఉంటుందంటారు?" అని అడిగాడు మారిస్ ఫాన్ ఎగ్ బర్గ్‌ని.

36-వ పేజీ చూడండి

నా పడవ

శ్రీ గంధం జోయెల్

అందాల నా మోడ
అలిగి వెళ్ళింది
కాగితపు నా మోడ
కదిలి పోయింది॥ అం॥

ఒంటరిగ కాలువ
ఒడ్డు చేరను నడిచి
చల్లనీటును పడవ
మెల్లగా వదలితిని॥ అం॥

చాల కాలమునుండి
మేలుగా చేసితిని
రంగు రంగుల పడవ
బంగారు నా పడవ॥ అం॥

చిన్ని చేపలు చూడ
నెనొన్న వచ్చుచు నుండె
మురిసి, దానిని చూచి
పరిగెత్తుచుండె॥ అం॥

సంద్రమున నడిచే
పెద్ద ఓడలకన్న
చిన్ని నా పడవనే
అన్నిటిలో మిన్న॥ అం॥

అందాల నా పడవ
అలిగి వెళ్ళింది
కాగితపు నా నావ
కదిలి పోయింది॥ అం॥

ప్రాయశ్చిత్తం



వేమూరి సత్యం

(గత సంచిక తరువాయి)

అవతలి వ్యక్తి తిరిగి నిశ్చింతగా నిద్ర కుపక్రమించాడు.

గ్రామానికి చివరన రాజులవీధి ఉన్నది. ఆ వీధి తరువాత ఇక ఇళ్ళు లేవు. అంతా పొలాలే. ఆ వీధిలో విస్సన్న గుడిసె అన్నిటికన్నా చివర వున్నది. ఆ గుడిసెకు వెనకాలే రెండు గుడిసెలు ఉన్నాయి. రాజుల వీధిలో ఏవో కొన్ని పెంకుటిళ్ళుతప్ప అన్నీ పూరి గుడిసెలే. వీధిలో వరుసగా ఇళ్ళు లేవు. రోడ్లు అసలేలేవు. గజిబిజిగా యిళ్ళు, గుడిసెలూ కట్టబడినాయి. విస్సన్న గుడిసె చుట్టూ రెండు చింత చెట్లు, తాటి చెట్లు విశేషంగానూ ఉన్నాయి. ముగ్గురు తమ సైకిళ్ళను ఒక చింత చెట్టుక్రింద నిశ్శబ్దంగా స్టాండువేసి పెట్టారు.

అంతటా భయంకర నిశ్శబ్దం. పైగా చీకటి. పొలాల్లో కీచురాళ్ళ ధ్వని తప్ప మరేమీ వినరావటం లేదు. సైకిళ్ళను స్టాండువేసి పెట్టగానే నారయ్య మెల్లిగా "సుందరం నువు ఈ చింతచెట్లకాడ వుండు. లతీవ్ నువ్వు అటు పొలం గట్టున కాయి. వాయాలు ఏడకూ పోడనుకో! అయినా మన జాగరత మనది. నేను గుడిసె దగ్గర కెల్తుండా" అంటూ ఆ గాండాంధకారంలో సాగిపొయ్యాడు.

"జాగ్రత్త సుందరం. హుషారుగావుండు" అంటూ లతీవ్ తనకు నిర్దేశింపబడిన స్థానానికి సాగిపొయ్యాడు.

సుందరం ఒక్కడే మిగిలాడు. అతడికి నిర్దేశించబడిన స్థలం ఇదే. చుట్టూ గాఢాంధకారంలో మిళితమయిన నిశ్శబ్దం. పక్కనే చింత చెట్లు. అతడికి ఒక్కసారిగా వళ్ళు జలదరించింది. చింత చెట్లమీద దెయ్యాలుంటాయని అతడికి చప్పున గుర్తు కొచ్చింది. వళ్ళు గగుర్పొడించింది. చేతిలో టార్చిలైటు లేదు. సైకిళ్ళకయినా డైనమో దీపాలులేవు. అన్నీ కిరసనాయులు దీపాలే. భయంతో సుందరం ఒక్కసారి తలెత్తి చింతచెట్లకేసి చూశాడు ఆకులు కొద్దిగా కదిలిన చప్పుడయింది. చెట్ల ఆకుల సందులోనుంచి ఏదో కదులుతున్నట్టే అనిపించిం దతనికి. కొద్దిగా చెమట పోసింది. ఇంతలో అతని భయానక ప్రవృత్తిని పరిహసిస్తున్నట్టుగా గుడ్లగూబ ఒకటి వికృతంగా అరుస్తూ, చెట్టుపై నుంచి ఎగిరిపోయింది. "అమ్మయ్య" అనుకొన్నాడు మనస్సులో. మనోధైర్యంకోసరం చిన్న కూనిరాగం ఒకటి మొదలుపెట్టాడు. "ఇంకా రాలేదేమిటి నారయ్య" అ మనస్సులో అనుకొన్నాడు. నారయ్య వెళ్ళి రెండు మూడు నిముషాలె అయినా ఎంతో సేపయినట్టుగావుందతని ప్రాణానికి

ఇదీ ఉద్యోగమేనా? కిరాతకపు పని! మరీ ఆ సబ్ ఇన్స్పెక్టరు అంత దారుణంగా, కిరాతక ప్రవృత్తితో ఎట్లా ప్రవర్తించగలడో? అత మనస్సు ఎట్లా ఒప్పుతుందో? ఆ 'కోటి' గాడిని ఎట్లా కొట్టాడో. లాఠీలతో కొడుతుంటే రక్తం చిమ్మింది. చూస్తున్న తనకే కన్నీళ్ళొచ్చాయి. చేతు లెట్లా వచ్చాయో? ఇంతా చేస్తే దొంగతనం చేసింది వాడుకానేకాదు. అబ్బబ్బ!..........." సుందరవుకు పది రోజులక్రితం వెంకటస్వామి పోలీసు స్టేషనులో గదిలో కోటిగాడిని కొడుతున్న దృశ్యం కళ్ళ ముందు మెదిలింది. మనస్సు వికలమయిపోయింది.

ఇంతలో విస్సన్న గుడిసె దగ్గిరనుంచి నారయ్య గొంతు గట్టిగా విన్పించింది "పదరా. ఈ వేషాలు నా దగ్గిర పనికిరావు. ముందు పద"

ఆ కేకలతో ఆ చుట్టుపట్ల కొంతమందికి నిద్రాభంగమయింది. లేచారు. సుందరావుకు ఒక విశేషమయిన గగుర్పాటు కలిగింది. నరసింహులు దొరికాడన్నమాట! ఇవ్వాళ వెంకటస్వామి చేతులో వాడి కాలో చెయ్యో విరిగిపోతుంది.........

రెండు క్షణాల పిమ్మట హఠాత్తుగా నారయ్య కేకలు విన్పించాయి. "పట్టుకోండి! నరసింహుల్ని

నాయాలు పారిపోతున్నాడు. సుందరం, లతీఫ్ పడిం కండి" ఆ కేకలతో సుందరం ఇంకా గాభరాపడి పోయాడు.

గుడిసెలలోనుంచి కొంతమంది బయటికొచ్చారు.

సుందర్రావు చింతచెట్టుకింద ఉండటంచేత, ఆ చీకటిలో ఎవరికి విన్పించలేదు. ఆ క్షణంలో అతడి శరీరంలో రక్తప్రవేగం హెచ్చింది. గుండె కొట్టుకోవటం ఎక్కువయింది. ఆ చీకటిలోకి దృష్టి సారించి చూడటం మొదలు పెట్టాడు. మరుక్షణంలో పది గజాల దూరంలో ఆరడుగుల మనిషి పరిగెత్తుకొస్తున్న జాడ కనిపించింది. అతడు లేని ధైర్యం తెచ్చుకొని వణకుతున్న స్వరంతో "ఎరది" అన్నాడు.

చీకట్లో పరిగెత్తుకొస్తున్న నరసింహులు సుందర్రావు కంఠస్వరం విని అక్కడ ఆగిపొయ్యాడు. అప్పటికే అతడు సుందర్రావు దగ్గిర కొచ్చేశాడు. అనుకోని ఈ సంఘటనకు నరసింహులుకు వణుకు పుట్టింది.

సుందర్రావు, "ఆగు! ఎవరు?" అన్నాడు ఎలాగో లేని ధైర్యం తెచ్చుకొని.

"బాబ్బాబు. కనికరించండి. నాకేటీ తెల్దు. ఈళ్ళు నన్ను స్టేషనుకు తీసికెళ్ళి చావగొట్టి నేనే సేశానని సెప్పిస్తారు. చంపుతారు బాబూ. పిల్లలు గలోడ్ని. ఆళ్ళను అన్యాయం చేయకండి" అంటూ నరసింహులు ఒక్కసారిగా సుందర్రావు కాళ్ళు పట్టుకొన్నాడు.

కొద్దిదూరంలో నారయ్య కేకలూ, గ్రామస్థుల మాటలూ వినబడుతున్నాయి. సుందర్రావు కర్తవ్యతామూఢుడయి నిల్చున్నాడు. అతడిపై నరసింహులు మాటలు పని చేసినయి. సుందర్రావు అట్లా నిల్చోవటం నరసింహులు గ్రహించి చటుక్కున లేచి నిలబడి కుడివేపు పరిగెత్తటం మొదలు పెట్టాడు. అటువేపే లతీఫ్ ఉన్నాడు.

నరసింహులు అటు పరిగెత్తగానే సుందర్రావు తేరుకొన్నాడు. తన తప్పిదం తెలిసొచ్చింది. "పట్టుకోండి, పట్టుకోండి" అంటూ నరసింహులు వెనకాలే పరిగెత్తాడు.

ఇంతలో నారయ్య ఎదురుగా పరిగెత్తుకొస్తున్నాడు. సుందర్రావు కనబడగానే, "ఏడీ? వాడేడీ?" అని అడిగాడు.

సుందర్రావు ఆయాసంతో నిల్చున్నాడు. అప్రయత్నంగా అతడి నోటివెంట "ఏమో?" అనే మాటలు వెలువడినాయి.

ఆ మాటలతో నారయ్య మళ్ళి పరిగెత్తటం మొదలుపెట్టాడు. సుందర్రావు ఎటూ తోచక, ఏమి చెయ్యాలో నిశ్చయించుకోలేక క్షణంసేపు అక్కడే నిల్చున్నాడు

ఇంతలో "అబ్బా! సుందరం!" అన్న లతీఫ్ కేక హృదయ విదారంగ విన్పించింది. ఆకేక వినటంతోనే సుందర్రావు నిశ్చేష్టుడయ్యాడు. వెంటనే తేరుకొని అటుకేసి పరిగెత్తాడు.

అప్పటికే లతీఫ్ కేక విన్న నారయ్య, ఇంకా కొంతమంది గ్రామస్థులూ లాంతర్లతో అటు పరిగెత్తారు. లతీఫ్ దాదాపు స్పృహ లేకుండా పడి ఉన్నాడు. తలమీద గాయమయి, తలంతా నెత్తురు మడుగైపోయింది. దుస్తులనిండా ఎర్రటి మరకలు లున్నాయి. నుదురుమీద ఏర్పడిన గాయంలోనుండి నెత్తురు స్రవిస్తోంది. నారయ్య లతీఫ్‌ను ఆ పరిస్థితిలో చూడగానే "లతీఫ్ ఏమిటిది?" అంటూ తన తలకు చుట్టుకొన్న తువ్వాలుతీసి, లతీఫ్ గాయానికి గట్టిగా కట్టాడు. "మీలో ఎవరన్నా వో చెంబుడు నీళ్ళు తీసుకురండి" అన్నాడు. ఇద్దరు ముగ్గురు నీళ్ళకోసరం పరిగెత్తారు. నీళ్ళు వచ్చాక నారయ్య తువ్వాలును నీళ్ళలో తడిపి గాయం తుడిచి మళ్ళీ కట్టాడు. ఆ తరువాత ఇంకో ఇద్దరు సహాయంతో లతీఫ్‌ను పక్కనేవున్న గుడిసెలోకి చేర్చారు.

పది నిముషాల తరువాత లతీఫ్‌కు తెలివి వచ్చింది. మెల్లిగా కళ్ళు తెరిచి చుట్టూ కలియజూశాడు. నారయ్య ఆదుర్దాగా లతీఫ్ ముఖంపై వంగి, "ఎట్లా వున్నది లతీఫ్" అని అడిగాడు.

లతీఫ్ నీరసంగా, "ఫరవాలేదు. వాడు పారిపొయ్యాడా?" అన్నాడు.

"ఆ! పోయినట్టే ఉన్నాడు నాయాలు. ఈసారి దొరకనీ? గుడిసెలో పెళ్ళాం పిల్లలయినా లేరు. నా సామిరంగా. ఆళ్ళనయినా స్టేషనుకు ఈడ్చుకెడుదును" అన్నాడు నారయ్య.

సుందర్రావు నోటి మాటలేక అట్లాగే నిల్చున్నాడు. తన స్నేహితుడు లతీఫ్ ఆ స్థితిలో పడి ఉండటం చూచేసరికి అతడి నోటినుంచి మాటలు రాలేదు. ఇదంతా తను చేసిందేనన్న భావన అతడి హృదయంలో తృటిలో మెరిసింది. లతీఫ్ ఆ రకంగా రక్తపు మడుగులో ఉండటానికి తనే బాధ్యుడు. నరసింహుల్ని తను బంధించిఉంటే ఇదంతా జరిగేదే కాదు. తన అసమర్థతే ఆప్తమిత్రుడికి ప్రాణాపాయకరమయిందేనన్న బాధ అతడిని పెన వేసుకుపోయింది.

"సుందరం ఏదన్నా ఎద్దుబండిని తెప్పించే ఏర్పాటు చెయ్యి. లతీఫ్‌ను తీసుకెళ్ళాలి" అన్నాడు నారయ్య.

అంగాటలో గాయపడిన లతీఫ్‌ను బండిలో ఎక్కించి తాము తెచ్చిన సైకిళ్ళు గ్రామ మునసబు ఇంటిలోనేవుంచి, సుందర్రావు, నారయ్య పినపందిపాడు బయలు దేరారు.

3

"ఈరోజు సెలవు దినమని తనకు ఆయన విన్న చెప్పారు. అయినా ఖాకీ నిక్కరు, చొక్కా తొడుక్కుంటూ, ఎక్కడికో బయలు దేరడానికి తయారవుతున్నారు" అని నళిని మనస్సు బాధ పడ్డది. ఖాకీ నిక్కరు, బుష్‌కోటూ వేసుకొంటున్న సుందర్రావును చూస్తుంటే. "డ్యూటీ రోజుల్లో సరేసరి. కంటికే కనబడరు. ఇక శలవు అనుకొన్న రోజు ఇంతేనా? ఆ ఒక్క రోజునయినా ఆయన నా కళ్ళ ఎదుట ఉండే అదృష్టం నాకు లేదా?" అనుకొన్న దామె మనస్సులో.

"ఇవాళ సెలవుగదుటండీ? మళ్ళీ డ్రస్సు వేసుకొంటువ్నారేం?" అన్న దామె సుందర్రావుతో.

"తెనాలివరకూ వెళ్ళివస్తాను నళినీ. నీకు తెలుసుగా? లతీఫ్ ఆసుపత్రిలో ఉన్నాడు. ఈ వారం రోజులూ డ్యూటీ చేస్తున్నానేగాని, మనస్సంతా తెనాలిలోనే ఉన్నది. చెప్పానుగదూ? ఆ దెబ్బకు మరొకడయితే ఈ పాటికి 'హరీ' మనేవాడు. లతీఫ్ కాబట్టి ఇంకా ప్రాణాలతో ఉన్నాడు."

నళిని సమాధానం చెప్పలేదు. అట్లాగే నిల్చుని సుందర్రావు చెబుతున్నవి వింటున్నది.

"ఆ సంఘటన తలుచుకొన్నప్పుడల్లా నా మనస్సు బాధపడుతుంది నళినీ. లతీఫ్ ఇట్లా ఆస్పత్రిలో



"...ఇరవయి వేలు నేను పుచ్చుతున్నానన్న వార్త అబద్ధం: ఇరవయి వేలు మా అన్నయ్య అల్లుడి కిప్పించా వంతే..."

దెబ్బలతో పడిఉండడానికి నేనే కదూ కారణం ? ఆ నరసింహాలు దొంగ ఏడుపును విశ్వసించక వాణ్ణి అప్పుడే బంధించిఉంటే లతీఫ్‌కు యీ ప్రమాదం తప్పేదికదా ? నేను ఆ క్షణంలో తొచ్చాడటంతో నరసింహాలు నా బలహీనత కనిపెట్టి పారిపొయ్యాడు. అటువేపు లతీఫ్ తారసపడటంతో

ప్రాయశ్చిత్తం

అతడిని కిందికి తోసి పక్కనే ఉన్న పెద్ద బండ రాయితో చావమోది పారిపొయ్యాడు ....''

''ఇంకా నయం. నా అదృష్టం బాగున్నది. మీరే అడ్డం వెళ్లిఉంటే .....'' ఆ పై మాటలు నళిని నోటినుండి బయటకు రాలేదు.

''అవేం మాటలు నళినీ ? అదృష్టం ఎందు కనుకోవాలి ? నా బాధ్యతను సరిగా నిర్వహించ లేదనుకొంటాను నేను. నా విధి—నిర్వహణలో అటు వంటి ప్రమాదం జరిగినా విచారపడవలసిందేమీ లేదు.''

నళిని సమాధానం యివ్వలేదు.

''నేను తెనాలి వెళ్లి మధ్యాహ్నానికల్లా వచ్చే

రిత్తగా. వేడివేడిగా ఒక కప్పు కాఫీ యివ్వు. నీపేరు చెప్పుకుని తాగుతాను.''

నళిని మాట్లాడకుండా లోపలి కెళ్ళింది.

పది నిముషా లనంతరం సుందర్రావు కాలి—నడకను బయలుదేరాడు. మైలున్నర నడిచి నందివెలుగు చేరుకుని అక్కడనుంచి బస్సులో తెనాలి వెళ్ళాలని సంకల్పం. డొంకదారివెంట నడుస్తుంటే, యిందాక నళిని "యింకా నయం. నా అదృష్టం బాగుంది....'' అన్న మాటలు గుర్తుకొచ్చినయ్. నిజమే. తానే నరసింహుల్ని పట్టుకోవటానికి ప్రయత్నించి ఉంటే, యిప్పుడు లతీఫ్ ఉన్న స్థలంలో తాను ఉండేవాడు. లతీఫ్ శరీరం, ఉక్కు కనుక తలమీద తగిలిన అంతటి గాయానికి ప్రాణం పోలేదు. తనయితే.... తానయితే ఏమయ్యేవాడోననే భావన సుందర్రావు మనస్సులో కలుగగానే అతడి వళ్ళు జలదరించింది. తనకు సంభవించి ఉండేదన్న మృత్యువును తలుచుకొన్నమాత్రాన అతడు వణికిపొయ్యాడు. తను చనిపోతే తన తండ్రి, సరోజ, నళిని ఏమయిపొయ్యేవారు? తన తండ్రి అష్టకష్టా లనుభవించి ఏదో రకంగా సరోజ వివాహం చేసి, ఆమెను అత్తవారింటికి పంపేవాడు. తన నళిని గతేమయ్యేది? చిరునవ్వుతో వెలిగిపోయే అంత అందమయిన ముఖం మేఘావృతమయిన నీలాకాశం వలె కాంతివిహీనమై పోతుంది తను లేకపోతే. తను లేని ఆమె జీవితానికి అర్థం ఏముంది? ఆమెను ఎవ్వరాదరిస్తారు? తన కష్టసుఖాలు ఎవరితో చెప్పుకొంటుంది? ఒక వ్యక్తి జీవితంతో మరో వ్యక్తి జీవితం పెనవేసుకపోతే యిదే ఉపద్రవం. ఆ పెనవేసుకపోవటంలో ఆనందం, జీవం, అన్నీ ఉండవచ్చు. కాని, ఎడబాటంటూ జరిగితే అది దుస్సాధ్యమై మిగిలిన జీవితాన్ని నరకతుల్యం చేస్తుంది. మానవజీవితంలో ఈ ప్రేమలూ, ఆపేక్షలూ, మమకారాలూ తప్పవు. అవి ఉన్నంతవరకు ఆత్మక్షోభ, దుఃఖం తప్పవు....

ఆలోచనల పరంపరలతోనే నందివెలుగు చేరుకొన్నాడు సుందర్రావు. సమయానికి రెడీగా బస్సు ఏదీ లేదు. ఒక్క గుంటూరు—తెనాలి రోడ్డు ఒకటే గాక, ఇంకా నందివెలుగు మీదుగా రెండు బస్సు మార్గాలు వెడతాయి. ఇది చిన్న కూడలి వంటిది. అన్నీ తెనాలి వెళ్ళవలసినవే. అయినప్పటికి ఒక్క బస్సు కూడ లేదు.

పావుగంట నిల్చున్నా బస్సు రాలేదు. ఇంతలో గుంటూరు నుంచి ఏదో లారీ రావటం కనిపించింది సుందర్రావుకు. రెండడుగులు ముందుకు వేసి, చెయ్యి ఎత్తి లారీకి ఎదురుగా నిల్చున్నాడు. ఖాకీ లాగూ, తెల్ల బుష్కోటూ, బూట్లూ చూసి లారీ—డ్రైవరు లారీ ఆపాడు.

"లారీ తెనాలి పోతుందా?'' అని ప్రశ్నించాడు సుందర్రావు.


లారీ—డ్రైవరు సుందర్రావును పోలీసు కానిస్టేబుల్‌గా గుర్తుపట్టాడు. "ఎక్కండయ్యా'' అన్నాడు నమ్రతగా.

సుందర్రావు ఆసుపత్రి చేరేసరికి ఉదయం పదిగంట లయింది. అప్పుడే సర్జను వచ్చి చూసి వెళ్ళాడు. లతీఫ్ మంచంవద్ద యిద్దరు స్త్రీలు తలనిండా ముసుగు వేసుకొని కూర్చుని ఉన్నారు. సుందర్రావును చూడగానే యిద్దరూ లేచి నిల్చుని తమ తలమీది ముసుగును ముఖంమీదకు లాక్కుని కొద్దిగా పక్కకు తొలిగారు.

సుందర్రావు లతీఫ్ దగ్గరికి వెళ్ళాడు. అతడి తలనిండా కట్లు ఉన్నాయి. పెద్ద ఆపరేషన్ చేయవలసివచ్చింది. తన ప్రతిభ ఏమీలేదని భగవంతుడి దయ, లతీఫ్‌కు యింకా జీవించవలసిన గీత ఉండటంచేతనే అతడు బ్రతికాడనీ ఆపరేషన్ చేసిన సర్జనే చెప్పాడు. సుందర్రావును చూడగానే లతీఫ్ ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.

సుందర్రావు మంచంపక్కనే ఉన్న చిన్న బల్లమీద కూర్చున్నాడు. "ఇప్పుడెట్లా ఉన్నది లతీఫ్?'' అని అడిగాడు.

38వ పేజీ చూడండి



దొంగ బంగారం వ్యాపారి

రోనాల్డ్ బ్రూకర్

2

క్ర కత్తాలో దిగేముందు ఈ చక్కెర పొట్లం విమానంలోని వంట సామానుతో కలిపివేసి సునా యాసంగానే, కస్టమ్స్‌కి తెలియకుండా, అమ్మాయి చెప్పిన చిరునామాకి తీసుకొని వెళ్లి యిచ్చాడు. పంచదార నీటిలో కరగబెట్టి బంగారంపొడి వడ గట్టేశారు.

ఈవిధంగా సహకరించినందుకు ఈ స్టువర్డ్‌కి బహుమతి 100 పవున్లు (సుమారు 1360 రూపా యలు). ఇది విన్న నేనూ కొంత అదనపు ఆదా యము ఏర్పరచుకోవాలని నిశ్చయించుకున్నాను. నా జీతం అప్పుడు వారానికి 15 పవున్లు.

నవంబర్‌లో, ఒకరాత్రి ఒక అందగత్తెని 'డ్రింక్'కి పిలిచాను. ఇవీ అవీ మాట్లాడాము — నేను నా ఉద్దేశం తెలియపరిచాను.

ఆ రాత్రే కొంచెంసేపుతర్వాత తిరిగివచ్చి కలు సుకోమన్నది — ఊరికి అవతలవైపునున్న ఒక హోటల్లో.

ఆమె చెప్పిన చోటికి వెళ్లాను. ఆమెతోబాటు, పొట్టిగా నల్లద్దాల కళ్లజోడు వేసుకున్న ఒక మనిషి వచ్చాడు. తలమీద చిన్న— నల్లని రంగుకల— టోపీ పెట్టుకున్నాడు.

ఆతన్ని పరిచయం చేస్తూ పేరు ఆహమ్మద్ అని చెప్పింది నా స్నేహితురాలు. బెయిరుట్‌నుంచి సెలవుమీద ఇక్కడికి వచ్చానని చెప్పాడు అహ మ్మద్.

రెండు గంటలతర్వాత— ఎన్నో డ్రింక్‌ల తర్వాత అతను ఈ దొంగల ముఠాలో పెద్దవాడని గ్రహిం చాను. ముఠా అధిపతికి సన్నిహితుడనికూడా స్పష్ట మవుతూనే ఉంది.

హఠాత్తుగా అహమ్మద్ నావైపు తిరిగి, "బ్రూకర్, నిన్ను గురించి విన్నాము. నీకు వివాహం అయింది. మంచి యిల్లు కట్టుకుందా మనుకుంటు న్నావు; అవునా ?" అని అడిగాడు ముద్దమాటలతో.

అవునని ఒప్పుకున్నాను. ఇంగ్లాండ్‌లో సము ద్రం దగ్గరగా ఇల్లు ఏదయినా దొరికితే కొనుక్కుందా మని డబ్బు చేరవేస్తున్నట్లు చెప్పాను.

అసలు నన్ను గురించి ఏమి తెలుసో, ఎలా తెలుసో చెప్పమని అడిగాను.

"మాకన్నీ తెలుసులే !" అన్నాడు టూకీగా

తన ప్రతిపాదనలు చేశాడు తర్వాత

బెయిరుట్‌లో కొంత బంగారం తీసుకుని దొంగ తనంగా కలకత్తా చేర్చవలసిందని చెప్పాడు

ఒక నోట్లకట్ట బయటకు తీసి, నా బహుమానం 150 పవున్లు ఉంటుందని చెప్పాడు.


"అయితే ఒక విషయం గుర్తుంచుకో! ఆ బంగా రం నువ్వే కాజేద్దామని అనుకున్నావా, ప్రియ మయిన భార్య నిన్ను మళ్ళీ చూడదంతే !" అన్నాడు నెమ్మదిగా.

మూడు వారాల తర్వాత బెయిరుట్‌లో దిగి హార్బర దగ్గరే ఉన్న ఒక చిన్న హోటలుకి వెళ్ళి దాని యజమానిని అడిగాను, "మిస్టర్ ఏండ్రూస్" ఎక్కడ అని

క్రిందికి వంగి చిన్నగోనెసంచి ఒకటి తీసి నాకు ఇచ్చాడు

నా హోటలు గదికి వెళ్లిన తర్వాత దానిని తెరిచి చూచాను. దానిలో ఒక్కొక్కటి 20 అంగు ళాల పొడవు ఉన్న బంగారం కడ్డీలు ఉన్నాయి.

—34 వ పేజీ చూడండి



"...నేను ఇంతకుముందే పంపిన రాజీనామా ముఖ్యమంత్రిగారు స్వీకరించర ధైర్యం నాకుంది....."

"రాజులు సైన్యంతోను, కవులు కవనంతోను, రేలంగి హాస్య

నూర్రోజుల సినిమాలో వేస్తే గొప్ప—నూరు సినిమాల్లో వేస్తే మరి గొప్పా—నూటడెబ్భైఐదు సినిమాల్లో వేస్తే "అబ్బా!" పైగా 'హాస్యం' అన్ని పిక్చర్‌లలోనూ చేయడం చేసింది చేయకపోడం ఇదే అతని హాస్య విజయంలోని సూత్రం.

వీరాజీ



రేలంగి హాస్యం
రోజుకి రోజూ
మరింత మోజూ
అందుక్కారణం
రోజూ రోజూ ఒకే ఫోజూ
ఒకే టైపూ కాకపోడమే!

“ఫకీ ఫకీ పకరసం
మనస్సు గాంచు దీనరసం
మాసిపోవు నీరసం
మరిపించు నవరసం”

ఈ రసం తప్పకుండా హాస్యరసమై ఉండాలి. దీన్ని పుష్టిగా పోషించిన హాస్యమూర్తి ‘రేలంగి’ ని

తోను గెలుస్తారు”

కూడా ఉండాలి. ఈ పాట రెండో సారి బాలనాగమ్మలో తలారి రాముడు శ్రీ రేలంగి వెంకట్రామయ్య “నీరసం” మాసిపోవునట్లు ప్రేక్షకులకు హాస్య రసం సరఫరా చేసిన సందర్భం లోనిది. ఈ హాస్యమూర్తి తెలుగు తెరమీద మజా మజాగా ప్రేక్షకులకు [యిందుడు వేషం 1935 లో ఈయన తెరమీది తొలి వేషంట. నే పుట్టలేదు కూడా అప్పుడు] ఎప్పుడూ కొత్తగా హాయిగా హాస్యం అందిస్తూ ఉండి నూటడెబ్భై ఐదు సినీమాల కాలం [అమ్మ బాబోయ్!] అయింది. ఈ విశిష్టత మాత్రం చాలా అరుదైనది — పైగా ఎన్ని బిరుదులిచ్చినా ఈ ‘ఫీట్’ కు చాలదు. శ్రీ రేలంగి డబుల్ సెంచరీకి ‘రంయ్‌న’ వెళ్తున్నప్పుడు ఈ శీర్షిక కోసం ఆయన్ని నిలదీసి, ప్రత్యేకంగా పాఠకులకు అందిస్తున్నాము కనుక చాలా సంతోషంగా ఉంది.

“వెకిలి చేష్టలకు వెర్రిగెంతులకు కుప్పిగంతులకు పిల్లికూతలకు జనం హాస్యమని విరగబడి నవ్వారు. సానుభూతిని కలిగించేది కదిలించేదీ అన తత్వాన్ని హాస్యంలో పొదిగి ప్రయోజనాత్మకంగా ప్రేక్షకులకు అందించాలి — “సృజనాత్మకమైన నైపుణ్యం, వినిన వెంటనే మరిచిపోలేని చమత్కారం హాస్యంలో చూపాలి” ఇది రకరకాల పాత్రలను రకరకాలుగా పోషించి, మనవాడని చెప్పుకునే ‘గర్వా’న్ని తెలుగువాడికి యిచ్చిన శ్రీ రేలంగి వెంకట్రామయ్య నమ్మకం; అదే ఆయన “అభ్యాసం కూసు విద్యగా సాధించుకొన్న ఆశయం కూడా”



ట్రాన్సిస్టర్ శ్రీ రేలంగికి మంచి కంపానియన్. ఆయనకూ ఆంధ్ర సచిత్ర వారపత్రిక చదవడమంటే మీలాగే సరదా…


“రేలంగికి రేలంగియే సాటి”

ఈ వ్యాసంలో ‘రేలంగి’కి మరో అలంకారం వేద్దామనుకున్నాను. ఇదివరకే చాలామంది చాలా హారాలు, అలంకారాలు వేశారు మరి— అంచే సొంతంగా అందామనుకున్నాను. మొదట హాస్యనటుడులేదా యింకొంచెం పిన్సిపియర్‌గా, ఫాక్ట్‌గా ‘గొప్ప హాస్యనటుడు’ అందామనుకున్నాను. అంటే “రేలంగి గొప్ప హాస్య నటుడు.” ఆ వాక్యం అయిందన్నమాట కాని బెజవాడకు నేరుగా టిక్కెట్ కొనుక్కుని వెళ్లి అక్కడ దిగుతూ “హా! కనిపెట్టితిన్ బెజవాడన్” అన్నట్లుంటే వాక్యం కేనా? బెజవాడను కనిపెట్టాను ?



ప్రొడ్యూసర్ శ్రీమతి రాజ్యంతో “హరిశ్చంద్ర” కి “క్లాప్” హాయ్‌గా.

అందుకని “శ్రీ రేలంగికి సాటి “రేలంగి”యే అన్నాను. అది సబబు. మూకీలు పోయి టాకీలు వచ్చాయి. ఆ టాకీలకు బ్యాక్‌గ్రౌండు పాటలు వచ్చాయి — పైగా,వాటి మొహాలకురంగులువచ్చాయి. కాని, రేలంగిలాంటి హాస్యం శ్రీ రేలంగిమాత్రమే ‘మజా మజాగా మధురసంగా’ అందిస్తున్నారు. ఎవరేనా ‘రేలంగి’ లాంటి హాస్యం, చెయ్యొచ్చునేమో (దానికి డిమాండు జాస్తికదా) కాని, శ్రీ రేలంగిమాత్రం 175 వేషాలు వేసినాకూడా పలానివాడిలా అని మాత్రం అనిపించుకో లేదు.అంతేనా? నూటడెబ్భై ఐదు సినిమాల్లోనూ ఏ వేషాని కావేషంగా ఒక వేషంలా మరో వేషం రాకుండా నిత్యనూతనంగా అబాల గోపాలాన్ని నవ్విస్తున్న శ్రీ రేలంగి ఐదం



Eight new fashion-fresh colours!
ROUGE MODE
ROSE MODE
BEWITCHING CORAL
RED CONTRAST
FROSTED ORANGE
ROUGE FANTASQUE
TEASING PINK
CORAL
Choose your shade of creamy HI-FI lipstick from this exciting range! Luscious, light, bright colours from party pinks through golden-orange tones to brilliant clear reds.
MAX FACTOR
SOLE SELLING AGENTS T. T. KRISHNAMACHARI & CO.
BOMBAY - CALCUTTA DELHI MADRAS
© 1963 Max Factor & Co
Aiyars OC. 245B

గానూ, వర్గాగాను యింకా మాంచి "ఫారమ్"
(క్రికెట్‌లో సి. కె. నాయుడులా) లోనూ ఉన్నారంటే
దానికి కారణం, యీ నటునిలోని 'ఒరిజి
నాలిటీ' రెండోది సిన్సియారిటీ— పైగా యిందులో
జీవితంలో కాచి వడబోసిన అనుభవాల తపస్సుకూడా
ఉంది.

"హిందీలోకి వెళ్లాలి"

ఈ నటుడికి యివాళ ప్రేక్షకుల హృదయాల్లో
గల పెద్ద పీఠంకన్న ఎక్కువ పీఠం — వాళ్ల
హృదయాల్లోవున్న ఆపేక్షా చోటుకన్నా ఎక్కువ
సన్మానం ఎవ్వరు చేయలేరు యివ్వలేరు అంటే
అతిశయోక్తి కాదేమో. ఐతే యింత బ్రహ్మాండ
మైన టాలెంటూ కేవలం దక్షిణాదినే వుండిపోకుండా
ఉత్తరాదికి హిందీలోకి వెళ్తే 'తెనుగు మజా' వాళ్లకీ
తెలిసేదేమో అని పిస్తుంది మనలో కొందరికి. హిందీ
పాతాళభైరవి తర్వాత ఈయన మరో హిందీ
సినిమాతో వచ్చినట్లు లేదు. వస్తే బాగుణ్ణు....
ఆయనకూ "మన ధాటి మన వాగ్ధాటి—మన హాస్యం
ఎంత గొప్పవో ఉత్తరాదిన చాటాలనివుంది" గనుక
ఈ అవకాశం వస్తుందనే ఆశిద్దాము. వెనుకటికి
'యంగమన్ హాపీ' క్లబ్‌లో వేషాలేసినప్పుడు ఎలా
ఉండేవాడో నే చూడలేదు గాని, శ్రీ రేలంగి నేను
ఈ శీర్షికకు మీా రెక్కించాలి, అని పట్టుబట్టి
వెళ్లి కల్సినప్పుడుమాత్రం చాలా 'యంగ్'గానూ,
'హాపీ'గానూ ఉన్నారు.

యంగ్ అండ్ హాపీ

ఐతే చాలామంది 'యంగ్'గా, పైగా హాపీగా
కూడా ఉంటారు ఈ లోకంలో. కాని, వీళ్లంతా
ఎదుటివాళ్లను 'యంగ్'గానూ, 'హాపీ'గాను అంటే
మాంచి ఖుషీగా ఫీలైయ్యేలా చేయలేరు. కాని
శ్రీ రేలంగి మాత్రం యిలా చేస్తారు. ఈ "మాజిక్"
చిన్నప్పట్నుంచీ అలవాటైపోయింది ఈ హాస్య
మూర్తికి.

'సంతోషమూ బలమూ'

తెనుగు సినిమాకు బాక్సాఫీసు దగ్గర ఈ హాస్య
మూర్తి యిచ్చే సంతోషమే సగము బలము—'రేలంగి'
లేకపోతేనా ? ఫలానీ సినిమా ఫ్లాప్" అనే మాట
చాలాసార్లు మనం వింటాం—

శ్రీ రేలంగి వెంకట్రామయ్యకు జనం మెచ్చింది
తను చేయడమూ, తనుచేసింది జనం మెచ్చేలా
చేయడమూ అనే రెండు రహస్యాలు తెలుసు. ఈ
"సూత్రాలు" యితనికి తెలిసినంతగా యింకొరికి
తెలియదేమో. లేకపోతే ఒక సినిమా తియ్యడానికి
యిటీవల కూడా ఏడాది పుచ్చుకుంటున్నారు. దానికి
చాలా తంతు వుంటుంది. తీరా తీశాకా చాలామంది
గట్టిగా నాలికర్చుకుంటున్నారు. కొందరు చేతులు
కాల్చుకుంటున్నారు. కాని, శ్రీ రేలంగి మాత్రం
మాటడబ్బైఐదు ఖయస్కోవుల్లో అన్నిరకాలుగా
హాస్యంచేసి, తాను నవ్వి—తాను ఏడ్చి,— తాను
కోపంగా పళ్లుకొరికినప్పుడూ కూడా జనం హాయిగా
నవ్వుకుని యిళ్లకు పోతూపోతూ "శివే కిందు! దరా"
అనిపించుకుంటూ వచ్చారు. ఇది ఒక "ఫీట్,"
అంతేనా, ఒక "హిస్టరీ" కూడా.

తెరమీద - తెరవెనుక

సూత్రాలూ రహస్యాలూ

ఇందులోని అసలు రహస్యం అనగా సూత్రం
ఏమిటి?" అనడిగాను. ఆయన పూర్తిగా తెనుగులో
చెప్పేసి:

"అట్నే ? సీక్రెట్ ?.... అనగా రహస్యమా ?"
ఏముందండీ..." అన్నాడాయన.

సారి ఏదో ఒక కొత్త టిటాక్...కొత్తహాస్యం
చెయ్యాల్సిందే. ప్రజలకు కొత్త కావాలి." ఎంత
హాయిగా తేలిగ్గా సింపుల్‌గా వుంది జవాబు !—

ఇంత చిన్న రహస్యం యిన్ని సంవత్సరాలు
ఒక నటుణ్ణి-ముఖ్యంగా హాస్యనటుణ్ణి అగ్రశ్రేణిలో
తారాపథాన ఉంచుతూందంటే ఆశ్చర్యంగా ఉందా?
లేదు. ఈ చిన్నదైన "రహస్యాన్ని" హాస్యంగా
పోషించడం— దీనికై చిట్కాలు ప్రతిదఫా వెయ్యా



తెనుగు తెర తొలి హీరోయిన్ సురభి కమలా బాయితో... [జయభేరిలో]

"వీండుకుండ తొణకదని ఆ రహస్యం ఒద్దు గాని
పోనీ, మీా వింటా హాస్యమేనా ఉందంటారా ?'
అన్నాను.

"అంటాను ... అది పుష్కలంగా ఉందంటాను.
కారణంకూడా చెబుతాను. ఎందుకంటారా?


జనం చాలా సెన్సిటివ్‌గా ఉంటారు. ముఖ్యంగా
కమేడియన్ అంటే మాత్రం మరీ శ్రద్ధగా
ఉంటారు. చేసిన ట్రిక్కు చేస్తే గారడీవా డెలాగైతే
చవకైపోతాడో, చేసిన హాస్యంచేస్తే అమ్మ బాబోయ్!
"రేలంగి"ని కూడా ఒప్పుకోరు .... అంచాత ప్రతి

డంలోనే అసలు ప్రతిభా, ఒరిజినల్ టాలెంటూ
ఎంతో కృషీ కూడా ఉన్నాయి.

అవే శ్రీ రేలంగిని యింకా "యంగ్"గానూ
(కులాసాగానూ) 'హాపీ'గానూ (తృప్తిగానూ) ఉంచు
తున్నాయి.

కొత్త "హాట్రిక్"

"గారడీవాడు ప్రతిసారి టోపీలోనించి కుందేలే
తీస్తూ ఉంటాడు"— హాడు "నే నేం తీస్తానో



శ్రీకాకొళకులు చేసిన సన్మానంలో శ్రీమతులు అం. జలి, సావిత్రి హారతులిస్తున్న దృశ్యం [రేలంగి శ్రీమతి అంజలీదేవితో పక్కింటి అమ్మాయిలోను. శ్రీమతి సావిత్రితో మామకు తగ్గ అల్లుడులోను నటించారు]

చెప్పగలరా ?" అనగానే జనం గొల్లున "చెవులపిల్లి" అంటారు. కాని, ఈ రేలంగి "గారడీవాడు" మాత్రం వచ్చేసారి సినిమాలో ఏం ట్రిక్కు చేస్తాడో ఆఖరికి సెన్సార్‌వాళ్ళు, సెట్‌మీదివాళ్ళు కూడా ఊహించలేరు. ట్రిక్కులకి దాని ఆజా తెలియదు. హాల్లో జనం మాత్రం నవ్వేస్తారు. వాళ్ళకి కుందేలు అంటే ఎలుక— ఎలుకంటే పిల్లి అగుపిస్తాయి ఈ గారడీవాడి టోపీలోనుంచి !! అదీ హాస్యం, అదే రహస్యం.

"మొత్తంమీద డబుల్ సెంచరీకి ఝామ్మని వచ్చేస్తున్నారు ?" అన్నాను— హాస్యానికి నిర్వచనమైన శ్రీ రేలంగిని అభినందిస్తూ నేను.

ఏదో యిలా నవ్వుతూ నలుగురినీ నవ్విస్తూ, ఒకరికి సంతోషం, తనకి తృప్తిగా ఈ యాత్ర ముగిస్తే అంతే చాలు.... థాంక్స్"—

ఎంత నిగర్వి ఈయన !—

గర్వం, కోపం యివన్నీ హాస్యమనే మధుర రసంలోనికి వెళ్ళి కలిసిపోతాయేమో ! గర్వం ఈర్ష్య లాంటివేమీ ఈ గొప్పనటునిలో అగుపించవు — ఎప్పుడూ సర్దాగా, అమాయకత్వం నిర్మలత్వం ప్రతిబింబిస్తూ యిన్ని సంవత్సరాలు ప్రజా హృదయాల్లో తిష్ఠ వేయడం ఒక్క రేలంగికే చెల్లింది. ఇంకెవరికి అందులోకి హాస్య నటులకు యింత వెలామణీ ఇంత ప్రఖ్యాతీ లేవు. చరిత్ర తిరిగి తిరిగి వస్తుందంటారు. హిస్టరీ రిపీట్స్‌కాని, రేలంగి మాత్రం నెవర్ రిపీట్స్— ఆఖరికి తనను తానేనా కాపీకొట్టడు.

"అహాహా.... నాకేనా సరే, పాత కాపీరైటు లేదు.... కొత్త కాపీ తియ్యాల్సిందే.... ఒకే రకంగా పాత్రను పోషిస్తే జనం ఒప్పుకోరు." అది ఆయన [illegible]

తెరమీద-తెర వెనుక

పాత రేలంగీ కొత్త హాస్యం

జెమినీ బాలనాగమ్మలో 20 సంవత్సరాలకు పూర్వం ఒక రేలంగి తలారి రాముడిలా అగుపించి చాలా రోజులు, గిలిగింతగా జనం గుండెల్లో ఉండిపోయాడు. మళ్ళీ అదే రేలంగి యిటీవల వెంకట్రమణావారి బాలనాగమ్మలో అదే తలారి రాముడిగా వచ్చి "మజామజా మధురసంగా" జనాన్ని హాస్యంతో సంతృప్తి పరిచాడు— ఇదే చరిత్ర తిరిగి వస్తుంది—కాని, రేలంగిమాత్రం తన 'హాస్యం నెవర్ రిపీట్స్' అంటే అర్థం—యథార్థంకూడా. సినిమా సినిమాకి కొత్తబాణీ "రేలంగిహాస్యా"నిది.

ఐతే కొత్త హాస్యంఅంటే యిది రోజా ప్రతి సినిమాకి ఎలా వస్తుందేం ? యిదేం "జలా ?" "గనా ?"

"కాదు; యిదో అన్వేషణ; ఇదో అనుభవం— ఓ తపస్సు,"—

అనుభవం అన్వేషణ

తెనుగుసినిమా కెంత చరిత్రఉందో శ్రీ రేలంగి వెంకట్రామయ్యకి అంత అనుభవం యీ తెలుగు తెరమీద ఉంది ఇందులో అతిశయోక్తి లేదు. ఆదిన 1936లో ధ్రువ లో కాబోలు ఇంద్రుడిగా వచ్చిన ఈ హాస్యనటునికి అంతకుక్రితం నాటకాలతోనూ నాతి వేషాలతోనూ, నాటు వేషాలతోనూ పైగా, సినిమాలకంపెనీల్లో ప్రొడక్షనులోను, అసిస్టెంటు డైరక్షన్‌లోనూ యివాళ మనం చెప్పుకుని "బాబోయ్ ఈ హాస్యం వెనకాతల యింత గంభీరమైన లోతుపాతులున్నాయా ?" అనుకునేటంత కథ ఉంది.

ఇవాళ తెనుగు "లీడింగ్ అండ్ బిజీ" ఆర్టిస్టుల్లో రేలంగి ఒకరు. ఈయన హాస్యాన్ని అన్వేషిస్తాడని, చెప్పానుకదా ? దానిసంగతి దాని మాత్రం అనాటి చెప్తాను— ముందు యీ నటుని విశిష్టత"ను పేర్కొనే ఒకటి రెండు రోల్సు చూడండి:

వివిధ పాత్రలలో రాణింపు

పెద్ద మనుషుల్లో తిక్కశంకరయ్య; పాతాళభైరవిలో "రాజాగారి బామ్మర్ది;" ఆనక "రోజులు మారాయి'లో 'విలన్' పోలయ్య పాత్ర, యిలా చాలా వున్నాయి. వైదగ్ధ్యంగల పాత్రలు పెద్దమనుషులు ప్రశంసలు పొందిన చిత్రం-అందుకు కారణాల్లో ఒకటి రేలంగి, రెండు కీ. శే. గౌరినాథశాస్త్రి (తలివమ్మాని పరేసనుకోండి) — ఈ పాత్రలోని తిక్కశంకరయ్య నిజం తిక్కవాడుకాదు. ఇతన్ని తిక్కవాళ్ళనుకునే వాళ్ళే అసలు తిక్కవాళ్ళు. ఇది చాలా విశిష్టమైన పాత్ర. ఇందులో హాస్యానికి ఉదాత్తత ఉంది. మంచిప్రయోజనం ఉంది. యిక్కడ ఈ హాస్యం వెనుకాతల కన్నీళ్ళున్నాయి— ఈ హాస్యం వెనుకాతల చెడ్డను చితక్కొట్టి తెరకెక్కించే కాగడా లున్నాయి. ఈ పాత్రను ధరించిన రేలంగీ, పాతాళభైరవి లోని "అక్కయ్య తమ్ముడు"ను ధరించిన రేలంగికీ ఎంత తేడా వుంది ? ఆ పాతాళ భైరవి రేలంగి, యీ పెద్దమనుషులు రేలంగీ తెరవెనుక నిజజీవితంలో ఒకరే గాని, తెరమీద మాత్రం రెండు పూర్తి కొత్త ప్రత్యేక వ్యక్తిత్వాలు—

పాతాళభైరవి లోని 'పాత్ర' మృచ్ఛకటికంలోని శకారుని నైజం గలది. ఇందులో కూడా "విలని" ఉంది. ఐతే శకారునిలోని తెలివితేటలు ఈ పాత్రకు లేవు. అవి ఆటుతర్వాతి చంద్రహారంలోని పాత్రలో అగుపిస్తాయి. అంచేతనే రాజకుమారిని సిన్సియర్‌గా ప్రేమించిన ఈ "రాజాగారి బామ్మర్ది" గా రేలంగి పాడిన చిరునవ్వే చాలే చిత్తయిపోతానే" అన్నది జనాన్ని ఆనందంతో చిత్తు చేసింది. కాని, రోజులు మారాయిలో పాత్రధారి వేరు. ఇక్కడ 'విలన్'



'ఛాలెంజ్!' (ఖైదీ కన్నయ్యలో)

కేవలం 'నంగిరి దుష్ట' కాదు; 'దుష్ట'—శ్రీ రేలంగి కీ పాత్రపోషణ ఒక కొత్త తురాయి.

తమాషా ఏమిటి అంటే "గుణసుందరి కథ' నుంచి నాకు జ్ఞానం వచ్చి చూశాకా మొన్నటి ఇరుగు పొరుగు—నేటి లవకుశ దాకా, పేర్కొంటూ రావాలీ అన్నా యీ ఆయనకు మచ్చుతునకలు, మంచి సినిమాలు విపరీతంగా ఉన్నాయి. అసలు ప్రతీ చిత్రమూ ఒక మచ్చుతునక; ఒక మైలురాయి.

వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు మొదట కాస్సేపూ ఆఫీసుగదిలో కూచున్నాను. గోడలకి నాలుగు వేపులా 'శతముఖాల' రేలంగి హాస్య మోహం వర సగా ఒక్కొ ఫ్రేములో ఒక్కోలా నవ్విస్తూ ఉన్నాయి ఒక్కొక్కటే ఆయన పాత్రలు— సుబ్బారాయుడ. మొదలు సుబ్బిసెట్టి వరకూ, సుబ్బిసెట్టి మొదలు మొన్న మొన్నటి చిత్రాల వరకూ అన్ని పాత్రలూ స్మృతిపథంలో తిరిగాయి. నాలో నేనే నవ్వుకుంటున్నాను. ఈ చిదానందం అక్కడి మా ఫోటోగ్రాఫర్‌తో సహా ఎవరికీ అర్థంకాలేద ఒహాశా 'మూడ్స్' అనుకుని ఉండాలి.—కాని ఆ రేలంగి పాత పాత్రల లోని కొత్తగా నవ్వి హాస్యం 'మజా'—అనక శ్రీ రేలంగిని చూడగానే ఆ చిత్రాలన్నింట్లోని "చిత్రా" లు పోయి, న కొత్త చిత్రం చూసినట్లు ఉల్లాసంగా అ చింది.

మంచితనం: కలుపుగోరుతన

"రండి .... రండి .... నిజం చెప్పొద్దూ .. అటున్న సూర్యుడు ఇటు పొడిచినా సరే ... అర్జెంటు రాచకార్యాలు డొక్కలో పొడిచినా , నేను మాత్రం ఉదయం స్నానం చెయ్యందే, ఏ ... చెయ్యను; ఎక్కడికీ వెళ్లను. స్నానం—ధ్యానం యీ మాత్రం మా గొప్ప "బాడ్ హాబిట్స్" అయి పోయాయి ..." అంటూ.

నవ్వుతూ ఆహ్వానించా రాయన. నాకు చాలా సంతోషమయింది.

"మీకు దేవుడంటే ప్రేమ కాబోలేం" అన్నాన

"అమ్మో ! అంతా ఇంతానా .... దేవుడం నాకు చాలా ప్రేమ .... మా యింట్లో ఓ మందిర పెట్టేశాగా" ప్రక్కనే ట్రాన్సిస్టర్ కూడా తెచ్చి పెట్టుకున్నారేమో! దాన్ని చూస్తూ, "ఈ రేడియో వాళ్లు మంచివాళ్లు బాబూ" అన్నాడాయన.

"నాకూ్కడా దురభిప్రాయం లేదు వాళ్ళ అంటే గాని, ఐనా ఆయనకు గల సదభిప్రాయం' అడిగాను.

"శనివారం శనివారం ఏడుకొండలవాడి సుప్ర భాతమ్ వినిపిస్తారు."—

ఆయనకున్న దైవభక్తి శుచి శుభ్రత 'కెరీర్' కు ఏనాడూ అడ్డురాలేదు. పైగా ఇవే దోహదం చాయి కూడా.

(మిగతా పైవారమే)

నేను దొంగబంగారం వ్యాపారిని

27-వ పేజీ తరువాయి

వాటిని తయారుచేసిన లండన్ కంపెనీ పేరు మీదనే చెక్కి ఉంది.

బెయిరుట్‌లో వాటి వెల 700 పవున్లు; కరాచీలో 1350 పవున్లు.

వాటిని ఎలా తీసుకుపోవటమా అని ఆలోచించాను.

ఈ వ్యవహారమంతా మానివేద్దామా అనుకున్నాను కాని, ఆ 150 పవున్లను గురించి ఆలోచించేసరికి నా విచక్షణాజ్ఞానం నశించింది.

కలకత్తాలో దిగగానే ఈ కడ్డీలను నా తువ్వాలులో చుట్టి ధైర్యంగా కస్టమ్స్ వైపుకి నడిచాను. అక్కడ వారికి నా గురించి తెలిసి ఉంటే. ఇంతకన్నా నేను ఏం తప్పుచేసి ఉండను. నా సామాను వెతకటం అనవసరం అనుకుంటారని ధైర్యంగా ముందుకి సాగిపోయాను. నేను అనుకున్నట్లే అక్కడ ఆఫీసరొ చిరునవ్వుతో పలకరించి పంపించివేశాడు. కల్లా, నిజమా అనుకున్నాను నేను!

ఇందుకోసం నన్ను కలుసుకున్న ఒక ఇండియన్‌కి ఈ బంగారం ఇచ్చేశాను. [ఇది నా హోటల్ గది బాత్ రూమ్‌లో జరిగింది.] అతను మాట్లాడకుండా 150 పవున్ల ఖరీదుచేసే రూపాయల కట్ట ఇచ్చేశాడు.

ఆ సాయంకాలం బాగా తాగేను. ఆహా! ఇన్నాళ్లకి రామ్‌బ్రూకర్ పెద్ద వ్యాపారంలోకి దిగాడు అనుకున్నాను.

నా 'సువర్ణ భవిష్యత్తు' మీద మరికొంత నమ్మకం కలుగజేసే సంఘటన ఒకటి ఆతర్వాత కొన్ని వారాలకు జరిగింది. అప్పుడు నేను డ్యూటీలో ఉన్న విమానం సిరియా మీదగా ఎగిరి వెడుతోంది.

నేను బార్ దగ్గర గ్లాసులు తుడుస్తున్నాను. పొడుగ్గా, నల్లగా ఉండే ఒక వ్యక్తి నన్ను సమీపించి, "ఎలా ఉన్నావు బ్రూకర్? నేనే 'బాస్' ని" అన్నాడు.

అతని చూపు చాలా తీక్షణముగానది. కాలం వృధాచెయ్యకుండా వెంటనే వ్యాపారం వివరాలు చెప్పడం ప్రారంభించాడు.

మా విమానం రెండు రోజులు బెయిరుట్‌లో ఆగిపోతుందిట. ఆ రెండు రోజుల్లో ఒక చోటికి వెళ్లమని చెప్పాడు.

అసలు యజమానితో నేరుగా పని చెప్పించుకో గలిగిన నాకు మంచి భవిష్యత్తు ఉంటుందని గ్రహించి వెంటనే 'సరే' అన్నాను.

ఆచోట అతని ఇల్లు! అక్కడ ఒక అనుచరుడితో నన్ను "మన సంస్థలో మంచి సభ్యులలో ఒకడు" అని పరిచయం చేస్తుండ గర్వపడ్డాను.

ఒక సొరుగు తెరచి నాతకి ఉపయోగించే 'వవ్' తో బాటు, ఒక బట్ట కూడా బయటికి తీశాడు.

"నీ కోటు, షర్టు తీసేయ్!" అన్నాడు.

నా కొలతలు తీసుకుని బట్టని కొన్నిచోట్ల మడిచి మడతవేసినచోట పిన్నులు గుచ్చి, నా నడుం చుట్టూ పెట్టి చూశాడు.

"రేపు నువ్వు వచ్చేసరికి కుట్టించి ఉంచుతాను. ఒక మనిషి ఎంత బంగారం తీసుకుపోగలడో గ్రహిస్తావు" అన్నాడు నవ్వుతూ.

3

విచిత్రం ఏమిటంటే, అధికారులు నన్ను పట్టుకునేసరికి వారి చేతికి ఏమీ ఆధారం దొరకలేదు. నేను రవాణా చేసిన బంగారం అప్పటికే ఇండియాలో అమ్ముడుపోయింది. అయితేనేమి, జైలుకు వెళ్లటం తప్పలేదు!

నేను పట్టించుకోలేదు కాని, బంగారం దొంగతనంగా రవాణా చెయ్యడం ప్రమాదకరమైన వ్యాపారం. ఎప్పుడు ఏవిధమైన అల్లరి బయలుదేరుతుందో చెప్పడం కష్టం. నేను నిజంగా భయ

వడ్డ సంఘటన ఒకటి అనుకోకుండా జరిగింది. కరాచీలో రిక్షా ఎక్కి వెడుతున్నాను. అక్కడ 'బాస్' తనని కలుసుకోమని చెప్పాడు. ఎలా జరిగిందో, క్షణంలో స్త్రైడు కాలువలో వెళ్లి పడ్డాను. ఎవరెవరో నామీద విరుచుకుపడటానికి సిద్ధంగా ఉన్నారు.

ఒక క్షణం నా కేమీ అర్థంకాలేదు. కాని వెంటనే తెలుసుకున్నాను. ఎవరో ఒక యూరోపియన్—కారు క్రింద ఒక పాకిస్తానీ వృద్ధురాలు పడిందిట. అందుకని, కనపడ్డ తెల్లమనిషినెల్లా పగపడుతున్నారుట.

ఇంకా వివరాలు తెలుసుకొనటానికి ఆగకుండా పలాయనం చిత్తగించాను.

ఒక స్త్రీల గుంపు నా వెంట పడింది. కొందరు గోళ్లతో నా ముఖం రక్కారు. కొందరు ఉమ్మి వేశారు. మరికొందరు స్త్రైడు కాలువలో అశుద్ధం నామీద విసిరారు.

ఏమి చెయ్యాలో తోచక పరిగెత్తుకుంటూ వెళ్లాను.

పోలీసులని పిలుద్దామా అంటే వీల్లేదు. నా రొమ్ముచుట్టూ 6000 పవున్ల విలువచేసే బంగారు కడ్డీలు ఉన్నాయి!

అవి కట్టుకున్న తర్వాత విమానంలోంచి ఎంత గర్వంగా దిగాను!

ఇప్పుడు వాటి బరువు అడుగడుగికీ అధికం అవుతోంది. ప్రయాసానికి చెమట నా కళ్లలోకి కారి మంటలు పెడుతోంది.

మా ముఠాలోనే పనిచేసిన జో బాకాటూర్‌కి పట్టిన అవస్థ నాకూ పడుతుందా అని ఆలోచించడం మొదలుపెట్టాను. డిశంబర్ 1959 లో ఎథెన్స్ విమానాశ్రయంలో గుండెల చుట్టూ ఎన్నో బంగారు గడియారాలు కట్టుకుని నడుస్తూ గుండె ఆగిపోయి మరణించాడు.

ఇంతలో నా ఎదుట ఒక పెద్ద కారు కనిపించింది. దానిని ఒక ఇండియన్ నడిపిస్తున్నాడు. నన్ను చూడగానే తలుపు తెరిచి : "ఎక్కండి! త్వరగా" అని అరిచాడు.

మరు క్షణంలో కారు లోపల ఉన్నాను. నేరుగా మెట్రోపోల్ హొటలుకి వెళ్లాము.

ఈ వ్యాపారం నడిపేవారు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. నేను హొటల్‌కి రాకపోయేసరికి ఆ ఇండియన్‌కి కారు యిచ్చి పంపారు. బంగారం నాదగ్గరే ఉంటే సరేసరి. లేదా సీటుక్రింద దాచి ఉన్న కత్తి నా వీపులో దిగేది ...

దొంగరవాణా అంత తమాషా కాదని తెలుసుకున్నాను.

నామీద నాకే జాలి వేసింది. కాని నా పరిస్థితిని చూసి జాలిపడ్డవా రెవరూ లేరు. నాకోసం కాచుకుని ఉన్న లెబనాన్ మనిషి, "బ్రూకర్ యిలా ఆలస్యం చేస్తే లాభంలేదు. 'బాస్' వింటే ఊరుకోడు" అన్నాడు.

నేను చెప్పినదేమీ వినిపించుకోలేదు. నేను మాట్లాడుతున్నంతసేపూ బంగారు కడ్డీలను తూకంవేస్తూ ఉండిపోయాడు.

అంతా సరిగ్గా ఉన్నదని నిర్ధారణ చేసుకున్న తర్వాత నా బహుమానం— సుమారు 2700 రూపాయలు ఇచ్చాడు.

"ఏమనుకోకు బ్రూకర్" అన్నాడు చిరునవ్వుతో: "ఇది పెద్ద వ్యవహారం. జాగ్రత్తగా ఉండాలి."

అతను చెప్పకపోయినా నేను తెలుసుకునేవాడిని.

'బాస్' స్వయంగా ఒకసారి అతని ఇంట్లో ఒక సొరుగు తెరిచి చూపించాడు. దానినిండా ఉన్న బంగారు కడ్డీల బరువుకి దానిని తెరవటమే కష్టం అయిపోయింది.

ఇంకా, ఇంకా ఈ పని చేసి డబ్బు గడిద్దామనే దురాశ నాలో ఎక్కువయిపోయింది.

తిరిగి బెయిరుట్‌లో దిగినప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను! బ్రిస్టల్ హొటల్‌కి వెళ్లి, కొత్త దుస్తులు ధరించి పక్కనే ఉన్న 'బాస్' తలుపు మీది 'బెల్' నొక్కాను. లోపల ఎవరూ లేరు. పక్క ఇంటివారు, ఇతను వారం రోజులదాకా తిరిగి రాడని చెప్పారు.

నాకు నిరాశ, చిరాకు కలిగాయి.

సరే, 'బాస్' లేకపోతే మరొకడు. అదే ఊరిలో ఉన్న మరొక కంసాలి వద్దకు వెళ్లాలి, అనుకున్నాను. ఇతను 'బాస్' కి పోటీ! సందేహించాడు.

"ఇదంతా మోసం అయితే ?" అన్నాడు.

'బాస్' నన్ను నిరాశ పరచాడని చెప్పాను.

అతను—అబ్దుల్ అందాం—కనుక పని చెప్పాలనుకుంటే వెంటనే నమ్మకంగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పాను.

వికృతంగా నవ్వి, నా భుజంమీద చెయ్యి వేస్తూ, నమ్మకం అనేది వెలకి దొరుకుతుంది తెలుసా ?' అన్నాడు.

"నువ్వు నమ్మకంగా ఉంటే సరేసరి, లేదా నీ ప్రాణాలు నీకు దక్కవు. జాగ్రత్త !" ఇంకా బాగా అర్థం అయ్యేందుకని వేలితో గొంతుక కోస్తున్న సంజ్ఞ చేసి చూపాడు.

"సరే, నా వెంట రా !" అని లోపల గదిలోకి తీసుకుపోయాడు. అదే అతని కార్ఖానా.

ఒక పాత సూట్‌కేసు తీసి దాని అంచుల చుట్టూ ఉన్న చెక్కని ఒలిచివెయ్యటం మొదలు పెట్టాడు.

ఇనప్పెట్టెలోనుంచి కొంత బంగారం తీసి దానితో తన పని ప్రారంభించాడు.

గంట తర్వాత పెట్టె అంచులమీద నల్లటి లక్క పంకా క్రింద ఎండుతోంది; లక్క క్రింద ఇందాక తీసిన చెక్కలు, వాటిక్రింద బంగారం!

అతని చాకచక్యానికి ఆశ్చర్యపడ్డాను.

"ఇంకా చాలా బంగారం వేసి ఉండేవాడిని కాని ఇప్పటికి నీ కిది చాలు. ఇదే నా పరీక్ష !" అన్నాడు.

హొటల్‌కి తిరిగి వచ్చిన తర్వాత పెట్టెని జాగ్రత్తగా పరిశీలించాను. అబ్దుల్ నైపుణ్యం ఎటువంటిదంటే, ఏవిధమయిన 'మరమ్మతూ' తెలియటంలేదు.

నాకు హాయి, అనిపించింది. ఇటువంటి నిపుణుడితో దొంగరవాణా కష్టమయిన పనికాదు.

ఎంతో ధీమాగా టెహరాన్ మీదుగా కరాచీ వెళ్లే విమానం ఎక్కాను. (సశేషం)

బెలూన్‌లో ధ్రువయాత్ర

21-వ పేజీతరువాయి

"అరె, నాకు మట్టుకేం తెలుసు!"

"నీటి సింహా (walrus) లు" అన్నాడు పాల్ దూరదర్శినిలో నుంచి చూస్తూ. దానిలో అతనికి ఈ మృగాలు రెండుమూడు కనిపించాయి.

"నీటి సింహాలే!" అన్నాడు మారిస్. "జాగ్రత్తగా ఉండాలి. ఇవంత మంచివి కావు. వీటికి దూరంగా ఉండిపోతే నేం?"

"ఉండిపోవచ్చు కాని, ఆ రాళ్ల నవతల ద్వీపం ఏదయినా ఉందేమో చూడాలని ఉంది" అని జవాబిచ్చాడు ఫ్రెడరిక్.

"పోదాం పదండి!" అన్నాడు పాల్. "అయితే, తుపాకులు తీసుకు వెడదాం; ఈ నీటిసింహాల చర్మం చాలా దళసరిగా ఉంటుందిట. తుపాకులే వీటికి సరి!"

ముందుకు పోయినకొద్దీ ఆ మృగాల గర్జనలు అధికం అయ్యాయి. ఇవి వేటకుక్కల అరుపులూ, ఎద్దుల రంకెలూ కలిసిపోయినట్లు ఉన్నాయి.

ఇంతలో హఠాత్తుగా రాళ్ల మధ్య ఒక సందులో ఇంచుమించు ఇరవయి పెద్ద తలలు కనిపించాయి.

"చూడండి దొంగ లెలా చూస్తున్నారో!" అని అరిచాడు ఫిలిప్పిక్.

"ఇప్పుడేం చేద్దాం?" అని అడిగాడు ఫ్రెడరిక్.

"నాకూ తెలీదు," అన్నాడు పాల్. "పోనీ ఒకసారి తుపాకి పేల్చి నడిపించి చూస్తే?"

"అలాగే చేద్దాం!" అని జవాబిచ్చాడు ఫెడరిక్.

పాల్ ఒక తుపాకి తీసుకుని గాలిలోకి పేల్చాడు.

అనుకున్నంత పనీ జరిగింది. నీటిసింహాలన్నీ మాయమయ్యాయి.

మారిస్, ఫిలిప్పిన్‌లు ఇద్దరూ చురుకుగా తెడ్డువెయ్యడం ప్రారంభించారు; కాని కొంత దూరం వెళ్లారో లేదో ఫాన్ ఎగ్‌బర్గ్ కేక వెయ్యడంతో ఆగిపోయారు.

నీటిసింహాలు మళ్లీ వచ్చాయి. ఈ సారి ఇరవయి బదులు ఏభయి వరకూ కనిపించాయి.

"జాగ్రత్త!" అన్నాడు పాల్ తుపాకిలో తిరిగి తోటాలు వేస్తూ! "పరిస్థితి ప్రమాదంగా ఉందేమోనని భయపడ్తున్నాను!"

మారిస్, ఫిలిప్పిన్‌లు తెడ్లు దించేసి చెరొక తుపాకి పుచ్చుకున్నారు.

"యుద్ధం మొదలు పెడదామా?" అని అడిగాడు మారిస్.

"అంతపనీ అవసరం అయ్యేట్లే ఉంది కాని, కొంత సేపాగి మొదలు పెడితే మంచిదేమో!" అని జవాబిచ్చాడు ఫాన్ ఎగ్ బెర్గ్.

"సరే, వీటిలో ఇరవయికి పైగాను నా దగ్గరికి వస్తే తుపాకులు ఉపయోగిద్దాం. వీలయినంతవరకూ వాటి కళ్ళ మధ్యకి గురిపెట్టి పేల్చండి. నేను 'సిగ్నల్' ఇవ్వగానే అందరూ కలిసి ఒక్కసారిగా కాలుద్దాం!" అన్నాడు పాల్.

నీటిసింహాలన్నీ గుంపుగా చేరి ఉన్నాయి. ఇంతదూరంలో అవి ఊపిరితీస్తూ ఉంటే వాటి గుర్రు వినిపిస్తోంది.

అనువుగా ఉన్నంత సమీపానికి రాగానే పాల్ తన తుపాకి ఎక్కుపెట్టాడు.

"ఫయిర్!" అని అరిచాడు.

నాలుగు తుపాకుల శబ్దంతో ఆకాశం దద్దరిల్లింది. నీటి సింహాల గుంపు చెల్లాచెదరయింది.

తుపాకీమందు కాలిన పొగ తగ్గగానే నీటిసింహాల్లలో కొన్ని గాయపడ్డట్లు తెలిసింది. మిగిలిన వాటి సహాయం కోసం తక్కినవి మరికొన్ని మూగడం మొదలు పెట్టాయి. కొన్ని బెలూన్ ప్రయాణీకుల వంక బెదిరించే చూపులు చూస్తూ కదలకుండా అలాగే ఉండిపోయాయి.

చివరికి నీటిసింహాలు రెండు దళాలుగా విడిపోయాయి. ఒక దళం గాయపడిన వాటికి అండగా నిలిచిపోయింది. రెండవది బెలూన్ వైపుకి ముసురుకుంటూ వచ్చింది.

"ఫ్రెడరిక్!" అన్నాడు పాల్ హడావుడిగా. "మన మీద దాడితీసే జంతువులు ఎంత బలంగా ఉన్నాయో చూశావా? వెంటనే బెలూన్‌ని పైకిపోయేట్లు చెయ్యకపోతే వాటిని తప్పించుకోలేం!"

ఓ ఘరానా పెద్దమనిషి జేబు ఎవరో కొడ్తున్నట్లనిపించి వెంటనే ఓ ఇరవయ్యేళ్ల వాడి చేతినిపట్టుకుని:

"వెధవాయ్! చించాల్సింది పైనగాదు. క్రింద!" అంటూ సాచి లెంపకాయకొట్టి వెళ్లిపోయాడు.

"సరే కాని, బెలూన్ పైకి లేవటానికి కనీసం అయిదు నిముషాలన్నా కావాలే."

"ఫరవాలేదు! ఎలాగో మన కష్టాలు మనం పడదాం. మిగతా ముగ్గురం కలిసి ఈ 'పడవ'ని జరపగలమేమో! ఈ మృగాలు పడవ చేరుకున్నాయంటే చాలా ప్రమాదం!"

"ఇక కాచుకోండి!" అంటూ, ఫాన్ ఎగ్ బెర్గు బెలూన్ పైకి పంపించే యంత్రసాధనంవద్దకు వెళ్లాడు.

నీటిసింహాలు దగ్గరకు వచ్చేస్తున్నాయి. పెద్ద పెద్ద గుంపులుగా వస్తున్నాయి. పాల్, ఇక ఆలస్యం పనికిరాదని మరొకసారి తుపాకులు మోగించాడు.

ఈ తడవ మొదట వచ్చిన ఫలితం రాలేదు. ఒక్క నీటిసింహం మాత్రమే ఆగిపోయింది. తక్కినవి ఏకాగ్రతతో బెలూన్ వైపే ఈదుకుంటూ వచ్చేస్తున్నాయి. రెండవ పర్యాయం తుపాకులు పేల్చటానికి ముందే కొన్ని 'పడవ'ని చేరి దానిని బలంగా ఊగించడం ప్రారంభించాయి.

"ఫిలిప్పిన్" అన్నాడు పాల్ నిదానంగా, "ఈ తుపాకులని తిరిగి కాల్చేందుకు తయారుచెయ్యి ... మారిస్, మనం ఈ గొడ్డళ్లు పట్టుకుని వాటి పని పట్టిద్దాం."

అంటూనే ఒక గొడ్డలి పట్టుకుని తెప్పమీదకి ఎక్కుతున్న ఒక నీటిసింహం తల నరికివేశాడు.

మారిస్‌కూడా ఒక గొడ్డలి పట్టుకుని అప్పుడే 'పిట్టె' చుట్టూఉన్న 'బాల్కనీ'లలో ఒకదానిని ఎక్కిన నీటిసింహం దంతం తెగగొట్టివేశాడు.

ఫిలిప్పిన్ తుపాకులను తయారు చేశాడు. పాల్, మారిస్‌లు అవి తీసుకుని వెంటనే వాటిని వాడారు.

మరి రెండు నీటిసింహాలకు అతి ప్రమాదకరమయిన గాయాలు తగిలాయి. మిగిలినవాటికి పట్టరానంత కోపంవచ్చి నమ్మశక్యం కానంత ఆవేశంగా పడవమీద పడ్డాయి. అప్పటికి వాటి సంఖ్య ఎనిమిదికి తగ్గినా ఆకోపంలో మరికొన్ని నిముషాలకి పడవని ముక్కలు ముక్కలు చేసేసేవి.

ఈ ప్రమాదం కనిపెడుతూ ఉన్న పాల్ ఫ్రెడరిక్‌తో, "బెలూన్ యంత్రం సంగతేమిటి?" అని ఆదుర్దాగా అడిగాడు.

"రెండే నిమిషాలు" అన్నాడు ఫాన్ ఎగ్ బర్గ్. "రెండు నిమిషాలలో పైకి పోతాం!"

"రెండునిమిషాలే! ...ఆఖరుసారి, మళ్లీ మన యుద్ధం ప్రారంభించాలి.."

(సశేషం)

ప్రాయశ్చిత్తం

25-వ పేజీ తరువాయి

"ఇంకేం ఫరవాలేదు భాయీ. గండం గడిచి పోయిందని డాక్టరు చెప్పారు అంతా మీ చలవ! మీవు, నారాయణ్య శ్రమపడి ఆ రాత్రికి రాత్రి నన్ను యిక్కడకు తీసుకురాకపోతే యీపాటికి బ్రతికి ఉండేవాడినే కాదనుకో."

"అదంతా యిప్పు డెందుకు లతీఫ్? స్నేహితులన్న తరువాత ఒకళ్ల కొకళ్లం సహాయం చేసుకోకపోతే ఎట్లా? .... యిప్పుడేమయినా పళ్లు తేవాలా?"

"ఏమీ వద్దు భాయీ! మా తమ్ముడు పళ్లు ఇచ్చి వెళ్లాడు. ఇంకా ఉన్నాయి .... సరే గాని నరసింహులు దొరకాడా?"

"ఇంకాలేదు లతీఫ్! ఎక్కడున్నాడో అచూకీ తెలియటంలేదు సబ్‌యిన్‌స్పెక్టరు ఎంతో ప్రయత్నము చేస్తున్నారు. ఈసారి దొరికితే సరే నా జైలుశిక్ష తప్పదంటున్నారు."

"ఆ రాత్రి అసలు వాడు నా చేతులోంచి తప్పించుకొనేవాడేనా? అంతా ఛాన్సు! వాడికి ఛాన్సు దొరికింది. ఒక్క తోపున క్రిందికి తోసి రాయి తీసుకుని కొట్టి పారిపోయ్యాడు. ......"

నరసింహులు వెంబడి తనవెంటే పరిగెత్తుకొచ్చినట్టు, తన బలహీనత వల్లనే వాడు తప్పించుకొన్నట్టు సుందర్రావు లతీఫ్‌తో చెప్పలేదు. ఆ విషయాలు ఎన్నిసార్లు చెబుదా మనుకొన్నా మాటలు గొంతులోనుంచి పెగిలి యివతలకు రాలేకపోయినవి.

అరగంట లతీఫ్ దగ్గర కూర్చున్న తరువాత "వెళ్లి వస్తానని" చెప్పి సుందర్రావు బయలు దేరాడు. అంతవరకు యిందాకటి స్త్రీలు పక్కనే నిల్చుని ఉన్నారు. సుందర్రావు లేచి నిల్చుని వెనక్కి తిరగ్గానే అప్రయత్నంగా ఆ ఇద్దరి స్త్రీలలో ఒకామె ముఖం చూడటం జరిగింది. ఆమె యువతి. బహుశా లతీఫ్—భార్య అయివుంటుం దనుకొన్నాడు. సుందర్రావు. ఆమె ముఖంలోని ఆందోళన అతని మనస్సును విపరీతంగా కలవరపెట్టింది. కళాహీనమైన ఆమె ముఖమే దారి పొడుగునా అతడి కళ్లముందు మెదలసాగింది. దీనికి అంతటికీ తనే బాధ్యుడు. తన మూలాన్నే యిన్ని ప్రాణులు ఖేదపడుతున్నాయి. ఇందుకు తాను ప్రాయశ్చిత్తం చేసుకుతీరాలి. అప్పుడు గాని, తనకు మనశ్శాంతి లేదు....

సుందర్రావు పిననందిపాడు చేరగానే యింటికి వెళ్లకుండా సరాసరి పోలీసు—స్టేషనుకు వెళ్లాడు. అప్పుడు పదకొండు గంటలయి ఉంటుంది. వెంకటస్వామి ఆఫీసులోనే ఉన్నాడు. ఠీవిగా కుర్చీలో కూర్చుని, రెండు కాళ్లను ఎదురుగా ఉన్న టేబులుమీద జాపి, చుట్ట కాలుస్తూ పేపరు చదువుతున్నాడు. వరండాలో శేషగిరీ, ధర్మదాసూ కూర్చుని ఒకే అపరాధ పరిశోధక నవలను యిద్దరూ చదువుతున్నారు. యేసుపాదం తన టేబులు ముందు కూర్చుని పోర్టబుల్ టైపు రైటరు మీద టైపు చేసుకుంటున్నాడు. అతడి ప్రక్కనే యిద్దరు నడివయస్సు గ్రామస్థులు చేతులు కట్టుకొని నిల్చుని ఉన్నారు.

సుందర్రావు లోపలికెళ్లి వెంకటస్వామి—టేబుల్ ముందు అటెంక్షన్‌లో నిలబడి శెల్యూట్ చేశాడు.

వెంకటస్వామి తలెత్తి తలను కొద్దిగా ఆడించి "ఏమిటోయ్? యిట్లా వచ్చావేం? ఇవ్వాళ నీకు ఆఫ్ కదూ?" అన్నాడు.

"అవును సార్. ఇప్పుడే తెనాలినుంచి వస్తున్నాను. ఆస్పటల్‌కు వెళ్లి లతీఫ్‌ను చూసి వస్తున్నాను."

"ఓ! గుడ్. కులాసాగా ఉన్నాడా? మాట్లాడాడా?"

"కులాసాగానే ఉన్నాడు సార్. ఇంకా పూర్తిగా కోలుకోలేదు కాని, పరిస్థితి మెరుగయిందండీ."

"ఊ" అంటూ వెంకటస్వామి మళ్లీ పేపరు చదవటంలో నిమగ్నుడయ్యాడు.

"నరసింహులు జాడ ఏమయినా తెలిసిందా సార్?"

వెంకటస్వామి పుస్తకం(?) ఆశ్చర్యంతో తలెత్తి చూశాడు. చేసేది పోలీసు ఉద్యోగమే అయినా సుందర్రావు ఇటువంటి విషయాలు తనంతట

తానే ప్రవేశించటం యిదే మొదటిసారి. పోలీసు పని చేయటమే గాని, తనంతట తాను నేరస్తుల గురించి ఆచూకీ తీయటానికి ప్రయత్నం చేయటం, దొంగలను పట్టుకోవటంలో ఆసక్తి చూపటం సుందర్రావు ఎన్నడూ ఎరుగడు. అందుకే అతడు కానుస్టేబుళ్ళందరిలోకి 'అశక్తు'డని పేరు తెచ్చుకొన్నాడు. ఆ కారణంచేతనే అతడిని ఎప్పుడూ స్టేషను 'సెంట్రీగా' నే నియమించేవారు.

"అదేమిటోయ్! ఎన్నడూ లేనిది ఈరోజు నీ యింతటనువ్వే అడుగుతున్నావు?" అన్నాడు వెంకటస్వామి ఆశ్చర్యంతో.

"వాడిని పట్టుకొని జైలులో వేసేదాకా నా మనస్సుకు స్థిమితం లేదు సార్. చేసిన దొంగతనానికి తోడు మనలో ఒకడిని కొట్టి పోయాడా? ఈసారి వాడి ఆచూకీ తెలిసినప్పుడు ఒకళ్ళో ఇద్దరూ కాదు సార్. స్టేషను స్టాఫ్ అంతా వెళ్ళాలి సార్ ...." అని క్షణంసేపు ఊరుకుని "నన్ను కూడా తప్పకుండ తీసికెళ్ళండి సార్" అన్నాడు సుందర్రావు, ఆవేశంగా.

"సరేలేవయ్. వాడు ఎక్కడున్నాడో ఇంకా ఆచూకీ తెలియలేదు. దొరకనీ చూద్దాం" అంటూ వెంకటస్వామి తిరిగి పరధ్యానంలో మునిగిపోయాడు.

"ఇక నేను వెళ్లి వస్తాను సార్" అంటూ సుందర్రావు మరోసారి సెల్యూట్ చేసి వెనక్కి తిరిగాడు.

సుందర్రావు వరండాలో కొచ్చేసరికి శేషగిరి తలెత్తి చూసి కొద్దిగా నవ్వుతూ "ఎస్. ఐ. గారికి తైరు కొట్టడం నువ్వు మొదలెట్టావ సుందరం?" అన్నాడు.

ధర్మదాసు కూడా నవ్వుతూ "పైకివచ్చే మార్గం అదేనయ్యా శేషగిరీ. సుందర్రావు సంగతి నే నెప్పుడో చెప్పాను. అంతో యింతో చదువు కొన్నవాడు పై వాళ్లతో మంచిగా ఉంటే, ఎప్పటి కయినా పనికొస్తుంది. ఇన్నాళ్ళూ నా మాటలు చెవి కెక్కలేదు. ఇప్పుడు తెలిసివస్తున్నది. అవునా?" అన్నాడు. తానేదో సత్యం కని పెట్టిన తృప్తి అతడి ముఖంలో గోచరించింది. సుందర్రావు వారి మాటలకు జవాబు చెప్ప కుండా, ఒక చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు.

ఇంటికి తిరిగొస్తుంటే తన ధర్మం తాను సక్రమంగా నిర్వర్తించినట్లు సుందర్రావు తృప్తి పడ్డాడు. నరసింహుల్ని పట్టుకోవటంలో తను కన బరచిన ఆసక్తే తన 'పాపాన్ని' కొంతవరకు తగ్గి స్తుంది. రేపు నరసింహుల్ని పట్టుకొనే చర్యలో తనూ భాగస్వామి అయితే, అంతకంటే నర సింహుల్ని అదృష్టంకొద్దీ తన చేతులతోనే బంధిస్తే తన పాపం పూర్తిగా మాసిపోతుంది. అప్పుడే లతీఫ్ అనుభవిస్తున్న యాతనకు పరో క్షంగా కారకుడయిన తనకు యీ పాపంనుండి విముక్తి లభిస్తుంది. తను చేసిన దానికి ప్రాయ శ్చిత్తం చేసుకొన్నవాడవుతాడు.

మనస్సులో కోరుకొన్నాడే కాని, తన కోరిక అక్షరాలా రెండు మూడు రోజులలో నెరవేర బోతోందని సుందర్రావు కలలో కూడ భావించ లేదు.

4

అర్ధరాత్రి షుమారు పదకొండు గంటల సమయం. పిననందిపాడు పోలీసు—స్టేషనులో దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. స్టేషను కానిస్టేబుళ్లందరూ యూనిఫారం వేసు కొని అటు యిటు తిరుగుతున్నారు. అంతా హడా విడిగా ఉన్నది. పోలీసు—స్టేషను ముందు జీపు ఒకటి ఆగిఉన్నది. వరండాలో ఒక కుర్చీలో వెంకట స్వామి, యూనిఫారంలో పిస్తోలు బెల్టుకు తగి లించుకొని చేతిలోని కర్రను అటు యిటు ఆడిస్తూ కూర్చుని ఉన్నాడు. అతడి పక్కనే యేసు పాదం నిల్చుని ఉన్నాడు. వారికి కొద్ది దూరంలో కాన్‌స్టేబుళ్లందరూ నిల్చుని ఉన్నారు. వారికి పక్కగానే శేషగిరి తుపాకిని తుడుస్తూ కూర్చు న్నాడు. నిల్చునిఉన్న కాన్‌స్టేబుళ్లలో సుందర్రావు కూడ ఒకడు.

వెంకటస్వామి చేతి — గడియారం చూసుకుని "పది ముప్పావయిందోయ్ యేసుపాదం! మనం ఇక బయలుదేరుదామా? వాడు పదకొండు న్నరకు యింటికొస్తాడని కదూ మనకు ఆచూకి తెలిసింది?" అన్నాడు.

"చిత్తం సార్!"

"డ్రయివర్" అంటూ వెంకటస్వామి కేకేశాడు.

"ఈ సారి స్టేజిమీదకి రాళ్లు విసరడానికి వీల్లేనిచోట గాన కచేరీ చేస్తానన్నావ్! ఎక్కడేమిటి?"

"రేడియో స్టేషన్‌లో!"

కె. రంగారావు

జీపు దగ్గిరున్న డ్రయివర్ "సార్" అంటూ వచ్చాడు.

"మనం షుమారు పదకొండున్నరకు పాడివరం చేరాలోయ్. యిప్పుడు పదిముప్పావయింది. మెల్లిగా బయలుదేరుదామా?"

"బయలుదేరితేనే మంచిది సార్! రోడ్డు కూడా సరిగా లేదు. తాపీగా వెళ్లొచ్చు."

"రైట్; యేసుపాదం! అందరినీ జీపులో ఎక్కమను. ధర్మదాసును సెంట్రీగా అట్టిపెట్టు" అంటూ, వెంకటస్వామి కుర్చీలోనుంచి లేచాడు. చేతిలోని టోపి నెత్తిన పెట్టుకుని, బెల్టుకున్న పిస్తోలును ఒకసారి తడిమి చూసుకుని చేతికర్రను విలాసంగా ఆడిస్తూ అతడు జీపు దగ్గరకు వెడు తుంటే, అతణ్ణి అనుసరించా రందరూ.

మరో అయిదు నిముషాలకు అందరిని ఎక్కించు కొని 'బుర్' మని చప్పుడు చేసుకొంటూ, జీపు బయలుదేరింది.

నరసింహులు కొద్దిరోజులుగా పాడివరంలో ఉంటున్నాడని వెంకటస్వామికి ఆచూకీ దొరికింది. తెలిసిన ఆచూకిని ధ్రువపరుచుకొన్నాక, అతడు ఒకరోజు తెనాలి వెళ్లి, పై అధికారులకు అంతా విశదపరచి, నరసింహుల్ని బంధించి తీసుకురావటా నికి ఒక్కరాత్రి ఉపయోగించుకోవటానికి జీపు తెచ్చాడు. పాడివరం పిననందిపాడుకు షుమారు పది మైళ్ల దూరంలో ఉన్నది. ఈ పోలీసు — స్టేషను అధికార పరిధిలోని చివరి గ్రామం అదే. ఆ గ్రామపు గత చరిత్ర పోలీసు అధికారులను భయ కంపితులను చేసేటువంటిది. ఈ గ్రామం ఎప్పుడూ పోలీసు అధికారులకు వెన్నుపోటు వంటిదే. ఒకప్పుడు పోలీసుస్టేషన్ను పిననంది పాడులో గాక, పాడివరంలోనే పెట్టాలనే ప్రతిపా దన ఉండేది. కాని కొన్ని చిక్కుల మూలంగా అది నెరవేరలేదు. ఇదొక కుగ్రామం. దీనికి అతి దగ్గ రగా ఉన్న పట్టణం షుమారు పదిహేను మైళ్లలో ఉన్న తెనాలి ఒకటే! ఎండాకాలంలో నామ మాత్రంగా పొలాలమధ్య ఏర్పడే డొంకదారి తప్పితే ఈ గ్రామానికి యింకో త్రోవ లేదు. మిగతా ఋతువులలో పొలాల గట్టులే శరణ్యం.

జీపు డొంకదారి వెంట పాడివరం చేరుకొనే సరికి పదకొండున్నరయింది. విద్యుచ్ఛక్తి లేని కారణంగా, కటిక చీకటిగా ఉన్నది. గ్రామంలో వీధి—లాంతరలు కూడ ప్రకాశవంతంగా లేవు. ఆకాశం మేఘావృతమయిన కారణంచేత నక్షత్రాలు కూడ అగుపడటంలేదు. గ్రామంలో అధికభాగం పూరిగుడిసెలే. పదికంటె పెంకుటిళ్ళెక్కువలేవు. వెంకటస్వామి జీపును గ్రామం వెలుపలే ఆపించి తను కిందికి దిగాడు.

అప్పటిదాకా చెట్లచాటున ఉన్న ఒక వ్యక్తి, జీపు ఆగటం చూసి ముందుకు వచ్చాడు. అతడిని చూడగానే వెంకటస్వామి సంతోషంతో "అప్పల నర్సయ్యా?" అని పిలిచాడు.

ఆ వ్యక్తి ముందుకొచ్చి వెంకటస్వామికి నమస్క రించి, "చిత్తం బాబూ" అన్నాడు.

"ఇంకా నువ్వు రాలేదేమిటా అని చూస్తు న్నాను. అంతా అనుకొన్నట్టుగానే ఉన్నదా?"

"సిత్తం బాబూ. వాడు తప్ప తాగి గుడిసెలో పడుండాడు. ఇక మీరు పట్టుకోవటమే ఆలస్యం" అన్నాడు అప్పలనర్సయ్య స్వరం తగ్గించి.

"రైట్" అంటూ వెంకటస్వామి తన దళం వేపు తిరిగి, "అంతా నా వెనకాలే రండి" అన్నాడు. అంతా బిలబిలమంటూ, జీపులోంచి దిగారు. ముందు వెంకటస్వామి, అప్పలనర్సయ్య బయలు దేరారు. వారి వెనకాలే యేసుపాదం, ఆ వెనకాల మిగిలిన బృందం బయలుదేరారు. జీపు—డ్రైవరు జీపులోనే కూర్చున్నాడు.

నడిరేయి; అంతా గాఢాంధకారం. అందరూ నిద్రలో ఉన్నారు. నిశ్శబ్దంగా వెడుతున్న ఈ బృందాన్ని ఎవరూ గమనించలేదు. కుక్కలు కూడా నిద్రలో ఉండి ఉంటాయి. వాటి అరుపులు ఎక్కడా వినబడటంలేదు. ఒక గృహస్తు పెంకు టింట్లోనుంచి బయటికొచ్చి వీళ్లను చూసి, చీక టిలో దొంగలేమో ననుకుని భయంతో 'ఎవరూ' అంటూ చేతిలోని బ్యాటరీలైట్ వెలిగించి పోలీసులని గమనించి వెంటనే వెనుదిరిగి లోని కెళ్లాడు....

గ్రామపు దక్షిణపుటంచు చేరుకోగానే, అప్పల నర్సయ్య "యిక్కడ ఆగాలి బాబూ" అన్నాడు. వెంకటస్వామి, మిగిలిన పరివారం అంతా ఆగారు.

ఆ ప్రదేశం అంతా గుడిసెలతో నిండిఉన్నది. ఒక పద్ధతి ప్రకారం ఆ గుడిసెలు కట్టని కారణాన, అంతా అస్తవ్యస్తంగా ఉన్నది. ఒక బాట అంటూ ఏదీ లేదు. ఊరికి అదే చివరి భాగం. ఆ వెనకాల

పెద్ద చెరువున్నది. అప్పలనర్సయ్య మెల్లిగా "అటు చూడండి బాబు! అక్కడ వరుసగా నాలుగు గుడిసె లున్నాయే; అందులో మూడోదే. తెల్సింది కదూ? ఆ గుడిసె వెనక, చెరువుకట్టన ఒక్కొక్కళ్ళను; ఆ చివర ఈ చివర ఒక్కొక్కళ్ళను; గుడిసె ముందూ, వెనకా ఇద్దరిద్దరినీ కాపుంచండి. మీరు, హెడ్‌గారు లోని కెళ్ళండి. ఇక నేను యిక్కడే ఉంటాను" అన్నాడు.

"రైట్ అప్పలనర్సయ్యా! రేపు మధ్యాహ్నం మా స్టేషనుకు తప్పకుండా రావాలి. నీకు రివార్డు డబ్బు యిస్తాను" అన్నాడు వెంకటస్వామి.

"చిత్తం" అంటూ అప్పలనర్సయ్య నమస్కరించాడు.

అక్కడికి అప్పలనర్సయ్య చూపించిన గుడిసెలు వంద గజాల దూరంలో ఉన్నాయి. వెంకటస్వామి తన బృందంలోని వాళ్ళను అప్పలనర్సయ్య సూచించిన విధంగా విభజించి, అందరినీ కేటాయించిన ప్రదేశాలకు వెళ్ళమని ఆదేశించాడు. అందరూ అక్కడినుండే చీలిపోయి నిశ్శబ్దంగా బయలుదేరారు. యేసుపాదం, వెంకటస్వామి, నరసింహాలు ఉంటాడనుకొన్న గుడిసెవేపు బయలుదేరారు.

సుందర్రావు తనకు కేటాయించబడిన చెరువు గట్టు ప్రదేశం చేరుకొన్నాడు. తను పరిశీలించి చూడలేదు గాని, యిది పెద్ద చెరువే ననుకొన్నాడతడు. గట్టుపైన అక్కడక్కడ వృక్షాలు ఉన్నాయి. అంతా చీకటి. చెరువులోని నీరు కూడ సరిగా కనబడటంలేదు. చెట్లమీద అప్పుడప్పుడు ఏవో పక్షుల కూతలు వినబడుతున్నాయి. అతడు ఆ చీకటిలో నరసింహాలు — గుడిసెవేపే దృష్టి సారించాడు. ఏమి కనబడటంలేదు. లీలగా గుడిసె ఆకారాలు మటుకు కన్పిస్తున్నాయి. అతడికి క్షణ మొక యుగంగా గడుస్తోంది. మనస్సంతా తెలియని ఆందోళనతో నిండిపోయింది. అకస్మాత్తుగా వెదుళ్ళపాలెం ఉదంతం అతడి స్మృతిపథంలో మెదిలింది. "అటువంటి పొరపాటు మళ్ళీ ఎందుకు చేస్తాను ?" అనుకొన్నాడు మనస్సులో .....

రెండు నిమిషాలు గడిచినవి.

"ఆగు ! నరసింహాలూ ! కాల్చిపారేస్తాను" అనే పిడుగుపాటి వెంకటస్వామి—స్వరం అకస్మాత్తుగా విన్పించటంతో సుందర్రావు—రోమాలు నిక్కబొడుచుకొన్నాయి.

"యేసుపాదం ! పట్టుకో! శేషగిరీ ! కనబడితే కాల్చిపారేయి !"

సుందర్రావు—చూపులు చీకటిని చీల్చుకొంటూ ముందుకు పోయేసరికి ఆ చీకటిలోనే గుడిసె వెనకాల నుండి తనవేపే ఒక వ్యక్తి పరిగెత్తుకుని రావటం సుందర్రావు చూశాడు సుందర్రావు—శరీరంలోనికి ఏదో అదృశ్యశక్తి—ప్రేరేపణచేత అద్భుతమయిన బలం ప్రవేశించినట్లయింది. కొద్దిగా జరిగి, యిటే వస్తున్న నరసింహాలుకు ఎదురుగా నిల్చున్నాడు. నరసింహాలు దగ్గరకు రాగానే, సింహంవలె లంఘించి నడుముచుట్టు చేతులు వేసి బలంగా బంధించాడు. అనుకోని ఈ తాకిడికి నరసింహాలు స్తబ్ధుడయిపాడు. వెంటనే పెనుగులాట ప్రారంభించి విడిపించుకోవటానికి ప్రయత్నం చేశాడు. ఊహూ! లాభంలేకపోయింది; సుందర్రావు—భల్లూకప్పట్టు విడిపించుకోలేకపొయ్యాడు. నరసింహాలు తన ఇనపహస్తాలతో సుందర్రావును గ్రుద్దటం మొదలుపెట్టాడు. సుందర్రావు ఆ దెబ్బలకు ఓర్చుకొన్నాడు కాని, పట్టు మటుకు వదలలేదు.

ఇంతలో వెంకటస్వామి, తదితరులు పరుగెత్తుకొచ్చారు. ముగ్గురు చేరి నరసింహాలును పెడరెక్కలు విరిచి పట్టుకొన్నారు. వెంకటస్వామి రెండడుగులు ముందుకు వేసి "…. కొడకా ! ఎందుకురా పెనుగులాడుతున్నావు ?" అంటూ చేతిలోని కర్రతో నరసింహాలు—మొహంపైన బలంగా రెండుసార్లు కొట్టాడు. నరసింహాలు "అబ్బా" అంటూ మూలిగాడు.

"వెధవని జీపు దగ్గరకు ఈడ్చుకెళ్ళండి."

ఈ హడావిడికి ఊళ్ళోని జనాభాలో సగం మంది లేచారు. నరసింహాలును పోలీసులు లాక్కెళుతుంటే, జనం గుంపులు — గుంపులుగా వెనకాలే బయలుదేరారు.

ఇద్దరు పోలీసులు నరసింహాలును రెక్కలు విరిచి పట్టుకుని నడుస్తుంటే, అందరూ బయలుదేరారు. వెంకటస్వామి, అతడి పక్కనే సుందర్రావు నడుస్తున్నారు. నరసింహాలును పట్టుకొన్నానని సుందర్రావుకు మనస్సులో సంతోషంగానే ఉన్నా, వెంకటస్వామి చేతి—కర్రతో కొట్టినపుడు నరసింహాలు నిస్సహాయుడిగా మొఖం తప్పించుకో ప్రయత్నించటం, ఆ దెబ్బలు అతడి ముక్కుకు తగిలి నెత్తురు కారడం చూచినపుడు అతడి మనస్సు బాధపడ్డది.....

కూతురు : అమ్మా! నన్ను చూడ్డానికి వచ్చిన పెళ్ళికొడుకు నాకు నచ్చాడే!

తల్లి : వచ్చింది పెళ్ళికొడుకు కాదమ్మా! వాళ్ళ నాన్న!!

కె రంగారావు

జీపులో నరసింహాలును ఎక్కించి అందరూ ఎక్కారు. గ్రామస్థులు ఆ చీకటిలో ఏవేవో చెప్పుకొంటున్నారు. కొందరి చేతులలో లాంతర్లున్నవి. ఈ హడావిడికి అర్థం తెలియని పిల్లలు తల్లుల కొంగులను పట్టుకొని ఏడుస్తున్నారు. వెంకటస్వామి గ్రామ మునసబును పక్కకు పిలిచి ఏదో చెప్పి, జీపు ఎక్కడానికి బయలుదేరాడు.

ఇంతలో "బాబూ! రక్షించండి" అంటూ ఒక స్త్రీ పరిగెత్తుకొచ్చి వెంకటస్వామి కాళ్ళను చుట్టేసింది. ఆమె నిండు చూలాలు. ఆమె వెంట ఒక అయిదు—సంవత్సరాల కుర్రాడు ఏడుస్తూ వచ్చాడు. ఆమె వెంకటస్వామి—కాళ్ళను పట్టుకొని ఏడుస్తూ, "బాబూ! రక్షించండి. వాడి కేమి తెలీదు. వాణ్ణి కొట్లో వేస్తే నేనూ, ఈ పిల్లాడు సచ్చిపోతాం. రక్షించండి" అన్నది.

వెంకటస్వామి కోపంతో "ఛీ ! ఎవతెవే నువ్వు. లం ...." అంటూ కాలును తీసుకోబొయ్యాడు. ఆమె కాళ్ళు విడువలేదు. అట్లాగే దీనంగా ఏడుస్తూ "బాబూ! ఆణ్ణి వొదలండే ఈ కాళ్ళని ఇడవను" అంటూ, కాళ్ళు పెనవేసుకొన్నది.

వెంకటస్వామి రెట్టించిన కోపంతో "లేమ్మంటే లేవవేమే" అంటూ బలంగా ఒక్క తన్ను తన్నాడు.

ఆమె అమ్మో అంటూ కూలిపోయింది. ఆ కేక విన్న నరసింహాలు జీపులో పెనుగులాడి, రెండు లాఠీదెబ్బలు తిన్నాడు.

వెంకటస్వామి జీపు ఎక్కి, "పోనీయువోయ్" అన్నాడు.

అక్కడి జనసందోహంలోని అలజడిని లెక్క చేయకుండా, జీపు బయలుదేరింది.

5

సుందర్రావుకు ఆ రాత్రి నిద్ర పట్టలేదు. మంచంమీద పడుకొంటే ఏవేవో ఆలోచనలూ, తలపులు వచ్చేవి. కళ్ళు మూసుకొంటే పాడివరంలో నిండుచూలాలు వెంకటస్వామి—కాళ్ళు పట్టుకోవటం, వెంకటస్వామి నిర్దయగా తన్నటం—యివే గుర్తుకొచ్చేవి. ఆరాత్రి నరసింహాలును పోలీసు—స్టేషనుకు తీసుకొచ్చిన తరువాత అతడిని వెంకటస్వామి, యేసుపాదం కలిసి హింసిస్తుంటే, సుందర్రావు అది చూడలేకనే నిస్సహాయుడై యింటి కొచ్చాడు. నరసింహాలు దొంగతనం ఎందుకు చెయ్యాలి ? అతడు పట్టుబడిన తర్వాత వీళ్ళు యింత నిర్దయగా ఎందుకు హింసించాలి ? ప్రపంచంలో ఒక వ్యక్తిని మరో వ్యక్తి అసహ్యించుకోవటం, హింసించటం ఎందుకు ? దీనికి అంతమెప్పుడు ?

తెల్లవారి నిద్ర లేవగానే, సుందర్రావు "తక్షణం నేను పాడివరం వెళ్ళి ఆమె పరిస్థితి ఎట్లా ఉన్నదో తెలుసుకోవాలి. దైవానుగ్రహంచేత ఆమె క్షేమంగా ఉంటే, అదే పదివేలు" అని మనస్సులో అనుకొన్నాడు.

స్నానం చేసి, కాఫీ తాగి, తెల్ల ప్యాంటూ, షర్టూ టకప్‌చేసి ప్రయాణమయిన కొడుకుని చూసి కోటేశ్వరరావు, "పొద్దున్నే ఎక్కడికిరా బయలుదేరావు ?" అని ప్రశ్నించాడు.

తన మనోవ్యధను మరొకరికి చెప్పనిదే అతడిలోని బాధ తగ్గేటట్టు లేదు: "ఒకసారి పాడివరం వెళ్ళివస్తాను నాన్నా ......"

"ఇప్పుడు పాడివరం వెళ్ళట మెందుకురా ?..."

".... రాత్రి పాడివరంలో నరసింహాల్ని పట్టుకొని తీసుకొచ్చాం. అక్షరాలా వాడిని నేనే పట్టుకొన్నాను. కాని అనుకోని ఘోరం ఒకటి జరిగింది. వాడిని వదిలిపెట్టమని వాడి పెళ్ళాం—నిండు చూలాలు — వస్తే, మా సబ్ ఇన్‌స్పెక్టర్ తన్నిన తాపుకు "అమ్మో" అంటూ విరుచుకు పడిపోయింది. ఆమె గతేమయిందో తెలుసుకోకుండానే, రాత్రి వచ్చేశాము. ఇప్పటికీ ఆ దృశ్యమే నా కళ్ళలో మెదుల్తోంది. ఒక్కసారి పాడివరం వెళ్ళి, దైవకృపచేత ఆమె క్షేమంగానే ఉన్నదని తెలుసుకుని రాకపోతే, నాకు మనశ్శాంతి లేదు నాన్నా."

కోటేశ్వర్రావు కొడుకు హృదయంలో చెలరేగుతున్న పెనుతుఫానును అర్థంచేసుకో గలిగాడు. "నువ్వు చేస్తున్న ఉద్యోగపు తీరు అంతేరా. ఇటువంటి సంఘటనలు అడుగడుక్కీ ఎదరవుతూంటాయి; తప్పదు. ప్రతిసారీ ఈరకంగా బాధపడితే, నీ జీవితం దుర్భర మవుతుంది. పోనీ, ఒక్కసారి వెళ్ళిరా" అన్నాడు.

సుందర్రావు సైకిలుమీద బయలుదేరాడు. దారి—పొడుగునా అతడి మనస్సులో ఏవేవో ఆలోచనలు పరంపరలుగా ప్రవహిస్తూనే ఉన్నాయి. అంత దూరంలో పాడివరం కన్పించగానే, అతడి మనస్సులో యిదమిత్థమని చెప్పలేని భయం కలిగింది. తాను వెళ్లి ఎటువంటి ఘోర దృశ్యం చూడటం గాని, ఘోరవార్త వినటం గాని జరుగుతుందోనని భయపడసాగాడు. అతడి మనస్సెందుకో కీడునే శంకించసాగింది. అతడి హృదయావేదన, సైకిలు వేగం హెచ్చించినవి. నరసింహులు—గుడిసె ప్రాంతం చేరి, అక్కడ గుంపుగా చేరిన గ్రామస్తులను చూడగానే, అతడి శరీరం కంపించింది. సైకిలు దిగాడు. అతడికి జరిగిపోయినది తెలిసిపోయినట్లయింది. అక్కడివారందరూ విచారగ్రస్తులుగా ఉన్నారు. గుంపు మధ్యలోంచి ఆర్తనాదం వినబడుతోంది. సుందర్రావు సైకిలుకు స్టాండు వేసి, గుంపులోకి బయలుదేరాడు. ఎవరో పెద్దింటి యువకుడని దారి యిచ్చారు. గుంపు మధ్యలోకి వెళ్లి, ఎదురుగా కన్పించిన దృశ్యం చూడటంలో అతడి కళ్లు చెమర్చినవి.

అక్కడ నరసింహులు-భార్య-మృతశరీరం మీదపడి అయిదేళ్ల పసివా డొకడు "అమ్మా, అమ్మా" అంటూ ఏడుస్తున్నాడు. అతడిని యువతలకు లాక్కొచ్చినా, పెనుగులాడి వెళ్లి తల్లి—మృత శరీరంపైనే వాల్తున్నాడు. అంతమంది ఉన్నారనే భావనయినా లేకుండా, సుందర్రావు కంటివెంట కారే నీరును తుడుచుకొన్నాడు. గిరుక్కున వెనక్కి తిరిగాడు. ఇతడి హృదయం ఘోషించసాగింది. "నామూలంగానే యిదంతా జరిగింది. నేను నరసింహులును పట్టుకోకుండా ఉంటే, ఇది జరిగేది కాదేకాదు ..." అనుకొంటూ, బయటికొచ్చి కొద్ది దూరంగా నిల్చున్నాడు.

సుందర్రావుకు అక్కడినుండి కదలటానికి మనస్సొప్పలేదు. అట్లాగే నిల్చున్నాడు. తల్లిలేని ఆ బాలుడి గతి ఏమిటి ? తానే వాడిని మాతృహీనుణ్ణి చేశాడు ......

గ్రామస్తులు మృతశరీరానికి అంత్యక్రియలు జరిపించారు. అప్పటిదాకా సుందర్రావు అక్కడినుంచి కదలనేలేదు. ఇత డెవరు ? ఇక్కడెందుకున్నాడని ఒకళ్లిద్దరు ప్రశ్నించుకున్నారు గాని, వాటి జవాబులకోసం ఎవరూ ప్రయత్నించలేదు. యాంత్రికంగా తానూ గ్రామస్తులతో పాటు అంత్యక్రియలకు హాజరయి దూరంగా నిల్చున్నాడు .....

అంత్యక్రియల తరువాత ఆ బాలుడి చెయ్యి పట్టుకుని నడిపిస్తున్న వృద్ధుణ్ణి ఉద్దేశించి "వీడికి ఎవరూ లేరా తాతా" అని అడిగాడు.

"ఎవరున్నారు బాబూ ? ఆ దేవుడే శరణ్యం" అన్నాడు వృద్ధుడు ఆకాశంవేపు చేయి చాపి.

"మరి వాడి గతేమిటి ?"

ఈ ప్రశ్నకు ఆ వృద్ధుడు సమాధానం చెప్పలేదు.

సుందర్రావు అకస్మాత్తుగా, "వీడిని నాతో పంపిస్తారా తాతా ? తెనాలి తీసుకువెళ్లి అనాథాశ్రయంలో చేర్పిస్తాను" అన్నాడు.

మొదట ఆ తాత ఈ ప్రశ్నకు తెల్లబోయినాడు. కాని, తేరుకొని "మీరు తీసుకు వెడతారా బాబూ?" అన్నాడు.

"అవును తాతా! వాడి బాధ్యత నేను తీసుకుంటాను."

తాత సమాధానం చెప్పేలోపలే ప్రక్కనే ఉన్న మరో యిద్దరు "పంపించు ఎంకన్నా! ఇక్కడుంటే వాడు అడుక్కుని తినటమేగా. అడి కెడితేనన్నా బాగుపడతాడేమో ?" అన్నారు.

తాత అంగీకరించాడు.

ఈ సంగతి క్షణంలో ఊరంతా పాకిపోయింది. చాలామంది చోద్యం చూడటానికి వచ్చారు. గ్రామమునసబు వచ్చి, "మీరు వీడిని తీసికెడతారా ? మీరు ఎక్కడుంటున్నారు ?" అని అడిగాడు.

"మాది గుంటూరులెండి. ఊరికే ఈ పల్లెటూళ్లో తిరగటానికి బయలుదేరితే, ఈ సంగతి తటస్థపడ్డది. చేతనయిన సహాయం కదా అని చేస్తానన్నాను" అన్నాడు సుందర్రావు.

గ్రామ-మునసబు తృప్తిపడ్డాడు. బాలుడికి ఉన్న వాటిలో మంచి దుస్తులు వేసి తీసుకొచ్చారు. ఇంకేదో మూట యివ్వబోతే, "అవి అక్కరలేదు లెండి; అక్కడివాళ్లే చూసుకుంటారు" అన్నాడు సుందర్రావు.

అయిదేళ్ల బాలుడి మొహం దుఃఖంతో నీరసించిఉన్నా, చూడటానికి బాగున్నాడు. సుందర్రావు అతడిని సైకిలు ముందుభాగాన కూర్చోపెట్టి, గ్రామస్తులు అచ్చెరువొందుతూంటే, బయలుదేరాడు.

సుందర్రావు ఇల్లు చేరేసరికి పన్నెండుగంటలయింది. సుందర్రావును చూడగానే, సరోజ పరుగెత్తుకొచ్చి, "అన్నయ్యా, అన్నయ్యా! వస్తే ? ఒక సంతోషవార్త చెబుతాను. ఏమిస్తావు ?" అని, ఈ అబ్బాయిని చూసి "వీడెవడు ?" అన్నది.

సుందర్రావు, "ముందు ఆ సంతోషవార్త చెప్పు. బాగా సంతోషమయిన దయితే, చీర కొని పెడతాను ..... " అన్నాడు.

సరోజ తన వెనుక దాచిన కవరు తీసి ఇచ్చింది. సుందర్రావు తీసి చదువుకొన్నాడు.

సర్వీసు కమిషను సెలక్షను !! కాకినాడలో కలెక్టరాఫీసులో నియమించారు ......

"నాన్నా" అంటూ, సుందర్రావు యింట్లోకి పరిగెత్తాడు. అతడి వెనకాలే ఆ అబ్బాయి పరుగెత్తాడు. సుందర్రావుతో కలిసి ప్రయాణం చేసిన ఈ కొద్ది సమయంలోనే ఆ అబ్బాయికి, ఇతడికి అంతర్యం ఏర్పడ్డది.

కోటేశ్వర్రావు కొడుకుని చూస్తూనే, చిరునవ్వు నవ్వాడు: "నీ కోరిక తీరింది కద్రటా? ఇదిగో, ఈ రిజిస్టర్డుపోస్టు రసీదు సంతకం చేసి పోస్టుమాన్ రాగానే ఇవ్వు. దాంతోపాటు ఒకటో, రెండో రూపాయలు ఇవ్వు .... అరె, ఈ కుర్రవా డెవరు ?" అన్నా డాయన ఆశ్చర్యంతో.

"నరసింహులు—భార్య చచ్చిపోయింది నాన్నా. ఆ పాపంలో నా భాగం కూడా ఉన్నది కదా ? అందుకని, ప్రాయశ్చిత్తంగా వాడి కొడుకుని తీసుకొచ్చాను. ఇకముందు వాడు నా తమ్ముడుగా పెరుగుతాడు; ఆ బాధ్యత నాది" ఆవేశంగా చెప్పాడు సుందర్రావు.

కోటేశ్వర్రావు నోట్లోంచి మాట పెగల్లేదు.

"ఏం నాన్నా ? నేను చేసింది తప్పా ? వీణ్ణి తల్లిలేనివాడిగా చేసింది నేను కదా ?"

"నువ్వు చేసిందేముందిరా ? వాడి ఖర్మే వాణ్ణి అట్లా చేసింది. కాని, నువ్వు చేసిన ఈ పని మటుకు గొప్పది" అన్నారు కోటేశ్వర్రావు కళ్లు తుడుచుకుంటూ. ★

జీవిత సంగీత

12 వ పేజీ తరువాయి

మీనాక్షి లేచి, గౌరి—భుజాన్ని దగ్గరకు తీసుకుంది. ఇద్దరి వయసూ ఒకటే. భగవంతుని సృష్టిలోని సమత్వమే అక్కడ నిలిచింది గాని, మానవులు కల్పించుకున్న అంతరాలక్కడలేవు.

"గౌరీ ! నీ కొడుకు పేరేమిటి ?" మీనాక్షి అడిగింది.

సన్నని ఒణుకుతో "ఏడు—కొండలని పెట్టుకుంటిని—మీ యిష్ట మొచ్చిన పేరే పెట్టుకుని పిలుచుకోండి తల్లీ" అని కొడుకు నొకసారి ఎత్తుకొని కన్నీరు కార్చింది. ఇక అక్కడ నిలవలేక ఆ అబ్బాయిని మీనాక్షి—చేతుల్లో వదిలిపెట్టి దట్టమైన చీకట్లోకి దూసుకుపోయింది గౌరి. ఇతరులలోకి తన హృదయాన్ని చొప్పించి వారి వేదనలను తానై తెలుసుకునే మీనాక్షి కళ్లు అశ్రువులతో నిండిపోయాయి. చేతిలోని బిడ్డను హృదయానికి అదుముకున్నది. ఈ కొత్తరకపు బాధ్యత చివరకు ఏమవుతుందో అనే దిగులు కూడా అలుముకున్నది ఆమెలో.

* * *

ఉయ్యాలలోని బాబు కలవరించాడు. గత జీవితాను స్మరణలో గంటలెన్ని గడుస్తున్నాయో యోచించని మీనాక్షికి స్పృహ వచ్చింది. 'ఈ రామకృష్ణుడి భారం తనపైన వేసుకుని సుమారు నాలుగు సంవత్సరాలు దాటి మరొకటి నడుస్తున్నది. రామకృష్ణ అని—తను పెట్టుకున్న పేరు. ఆమధ్య ఒక ప్రవాదం బయల్దేరింది—గౌరి ఎవరితోనో లేచిపోయి ఉంటుందని దాని సారాంశం. ఈ మధ్యలో తను రామకృష్ణుని పెంచుకుంటున్నట్లు తెలిసిన కొందరు కుల—ప్రసక్తి తెచ్చి గుట్టు లాగాలని చూచారు. తను కులస్తురాలని ఖచ్చితంగా చెప్పింది; అబద్ధం మంచికి మార్గదర్శకమైతే దాన్ని నొక్కి వక్కాణించొచ్చు అని తను నిశ్చయించుకున్నది దృఢంగా.

—'ఇప్పటివరకు ఇలా జరిగింది. ఇంకా ఎన్నాళ్లో ఈ అనుబంధం' అనుకుంటూ మీనాక్షి కళ్లు మూసుకుని మెల్లిగా నిద్రలోకి జారిపోయింది.

* * *

సుమనోహరమైన సాయంకాలం. చుట్టుపట్ల దగ్గర—దగ్గరగా ఉన్న ఇళ్లు తప్ప ఆ వీధిలో చెట్లూ చేమలూ ఎక్కువగా లేవు. ఆ యిళ్ల వరసల్లో పెద్ద పెద్ద భవనాలూ ఉన్నాయి— చిన్న మండువా లోగిళ్లూ ఉన్నాయి. ఇళ్ల వెనుక ఎత్తుగా పెరిగిన కొబ్బరిచెట్లు, పనసచెట్లూ— సూర్యాస్తమయానంతరం ఆకాశం ధరించిన విచిత్ర వర్ణంలో నీడలవలె కనిపిస్తున్నాయి. మీనాక్షి ప్రహారీ గేటు వానుకుని రామకృష్ణకోసం నిరీక్షిస్తున్నది. రామకృష్ణకు ఏడేళ్లు దాటుతున్నా, వాడి కే ఆపద ఏ క్షణంలో ముంచుకొస్తుందో అని ఆమెకి ఎనలేని భయం. అనుభవంలోని దురదృష్ట సంఘటనల

న్నావే అనుక్షణం భయం కలిగి కలవరపడుతుంది. తన అదృష్టహీనత, ఆవేదన అతన్ని చుట్టు కుంటాయేమో అని అన్నివేళల విచారిస్తూ కూర్చుం టుంది.

వీధిలో దీపాలు వెలిగాయి. ఆకాశంలో ధవళ కాంతి ఇంకా పూర్తిగా పోలేదు. మలుపువైపే దృష్టి నిలిపింది మీనాక్షి. 'ఎందుకింత ఆలస్యం చేశాడు కుడుకు ?'— విలంబన జరుగుతున్నకొద్దీ కళ్లల్లో

జీవిత సంగీత

రామకృష్ణ రూపమే, అతని పెంకి చేష్టలు, ముద్దు పనులే తిరుగుతున్నాయి— మొన్న పండుగనాడు కాబోలును తలంటుతుంటే, గారాబం ఒలక బోస్తూ అడిగాడు— 'అమ్మా ! నేను సంగీతం నేర్చుకుంటానే' అని. తనకు ఆశ్చర్యంవేసింది. తను చెప్పకుండానే సంగీతం గురించి ఈ చిన్నవాడి కెలా తెలిసింది ? ఎక్కడ నేర్చుకుంటానంటాడు ?' అని వెయ్యి ప్రశ్నలు తలెత్తాయి. అయినా సమస్యలన్నీ అణచుకుని— "ఇక ఆ ఊసెత్తకు; మన బ్రతుకులకు సంగీతమూ వద్దు; సాహిత్యంవద్దు; బుద్ధిగా బడికెళ్లి చదువుకో" అని గట్టిగా మందలించింది. ఆ రోజంతా వాడిమొహం—పాపం—వాడిన మొగ్గలాగేకనిపించింది.

కాకపోతే— తన ఆనందం కోసమని వాడిపై అధికారం చూపడానికి తన కొడుకైనా కాదు, రామకృష్ణ. అచ్చిరాని ఆకాంక్షను మొదట్లోనే తుంచేయడం మంచిది. తన దగ్గర పెరుగుతున్నందుకు తన గతే వాడికి పట్టకూడదు. పాపం ! ఏ మూరు మూల ఉన్నా, తన బిడ్డకు సుఖాన్నివ్వమని భగవంతుణ్ణి కోరుతూ ఉంటుంది కన్నతల్లి హృదయం—వ్చ్. గౌరి...అది దేవకి అయితే, తను యశోద కాబోలు— నవ్వుకుంది మీనాక్షి.

ఆలోచనలు ఆపి, వీధి కొసకు చూచింది. దూరంగా మసక—వెలుగులో రామకృష్ణలా కని పించాడు.గేటుచువ్వలుపట్టుకుని మరికొంతప ... కు ఒరిగి పరీక్షగా చూచింది. ముందు ఎవరో ఒకా యన చేతిలో పేముబెత్తాన్ని ఆడించుకుంటూ వస్తున్నాడు; వెనకాల పుస్తకాలతో తలవంచుకొని నడుస్తున్న రామకృష్ణ.

ఎవరాయన ? అనుకుంటూ లోపలికి వెళ్లింది. అయిదు నిముషాల్లో ఇద్దరూ గదిలోకి వచ్చారు. రామకృష్ణ, ఆ పెద్దాయన వెనకనుంచి ముందుకు రాడాయె. ఆయన స్కూల్లో మాస్టారయి ంటారు. వీడేదే తప్పుచేసి ఉండాలి అనుకుంది ానాక్షి. పమిట నిండుగా కప్పుకుని, కుర్చీ ఒకటి యన—ముందు వేసి "తమరూ ?...." అన్నది పశ్నార్థకాన్ని సూచిస్తూ.

ఆయన కుర్చీలో ఆసీనులై కొంతసేపు ఆగి ర్వాత గొంతు సర్దుకున్నారు.

"ఈ అబ్బాయి మీవాడే కదూ ?"

"అవునండీ ! ఏం— ఏం చేశాడేమిటి ?" ంగారుగా అడిగింది మీనాక్షి. ఆయన రామకృష్ణ వైపు ఒక్కక్షణం చూసి మరొకతడవ గొంతు సర్దుకున్నారు.

* * *

"ముందు నా గురించి కొంత చెప్పాలమ్మా నా పేరు లక్ష్మీనారాయణమూర్తి. ఈ ఊరి నేను వచ్చి సుమారు నాలుగేళ్లు అవుతుందన కుంటాను— సరిగ్గా గుర్తులేదు. నాకు సంగీతం వచ్చు. ఆంధ్రదేశంలో నా కేదో బిరుదు కూడా ఇచ్చారు. అవన్నీ జరిగినాక ఇక్కడ, బంధువులకు దూరంగా ఉండి ప్రశాంతజీవనం గడుపుదామనే ఉద్దేశంతో వచ్చేశాను. సంగీత కచ్చేరీలను, ఇతర వ్యాసంగాలను మితం చేసుకున్నా నన్నమాటే గాని, ఈ విద్యను ఎవరికో ఒకరికి చెప్పాలనే నిత్యమూ అనిపిస్తూంటుంది — ఆ అలవాటు పోగొట్టుకో లేక పోయాను. ఆత్మస్తుతి చేసుకోడానికి ఇక్కడికి రాలేదమ్మాయ్ ! మీ అబ్బాయికి సంగీతంపట్ల ఉన్న కుతూహలాన్ని చూచి, అది మీకు చెప్పటానికి వచ్చాను" అని అంటూ పొడిదగ్గు దగ్గి, కొద్దిసేపు ఆగారు ఆయన. అమృతపానం చేస్తున్నట్టుగా ఆయన మాటల్ని ఆకర్ణిస్తున్నది మీనాక్షి. ఆయన చెప్తున్నాడు :

"ఈ ఊరికి వచ్చాక ఇద్దరు అబ్బాయిలు సంగీ

ఠం నేర్చుకుంటామంటూ నా దగ్గరకు వచ్చి అడిగారు. అప్పటినుంచి — అంటే రమారమి రెండు సంవత్సరాలనుంచి వాళ్లకు సంగీత శాస్త్రం బోధిస్తున్నాను. బజారుకు అవతల సత్యనారాయణస్వామి ఆలయం ఉంది. అక్కడ ప్రశాంతంగా బోధన కనుకూలంగా ఉంటుందని సాయంత్రం నాలుగు మంచి అయిదూ, ఆరుగంటలవరకు ఆ ప్రాంగణంలోనే నేర్పిస్తుంటాను. ఆ పిల్లలుకూడా శ్రద్ధతో నేర్చుకుంటున్నారు లెండి. అసలు సంగతి చెప్పున్నాను. మూడునెలలనుంచి ప్రతిరోజూ మీ అబ్బాయి అటువైపు వస్తున్నాడు కొందరు బడిపిల్లలతో కలసి. అందరూ అక్కడ గెంతుతుంటే, తను మాత్రం వచ్చి, నే నేలాచెప్పున్నదీ ప్రతిదినమూ ఆలకిస్తాడు. అతని ఓపికను, పాటకు కరిగే మనసుని చూసి, నాకుఆశ్చర్యంవేసింది. మొన్నొకనాడు మామూలుగా వచ్చి, మాలతీ—పందిరి క్రింద అరుగుపై కూర్చుని వింటున్నాడు. దగ్గరికి పిలిచాను. "ఏమయ్యా! ఇనాళ్లుగా వింటున్నావ్ కదా! ఒక పాట జ్ఞాపకం ఉంటే పాడు చూద్దాం" అన్నాను. అనటమే తరువాయి — ఎంత చక్కగా పాడాడనుకున్నారు. ప్రయత్నపూర్వకంగా అనిపించినా, కొందరు రాగాన్ని పట్టలేరు. అదంతా అతనికి ఆ కళపట్ల ఉన్న ఆసక్తి లెండి..... పూర్వజన్మ సుకృతం."

మీనాక్షి యావత్తూ విన్నది. అంతరంగంలో ఆనందాని కంతులేదు. "అవునండీ! వాడంతే. చిన్నప్పటినుండి పాట అంటే ప్రాణం. పూజ చేసుకునే వేళ ఏమైనా భక్తి—పాటలు, మంగళం పాడుకుంటుంటే ఎక్కడున్నా, వచ్చి దగ్గర చేరిపోయేవాడు. పసితనంలోనే వాడు పాట మాధుర్యాన్ని తెలుసుకున్నాడండీ!" అన్నది ఇనుమడించిన అభిమానంతో. మూర్తిగారు అన్నారు: "అది నేను తెలుసుకునే, అబ్బాయికి సంగీతం నేర్పాలని నిశ్చయించుకున్నాను తల్లీ! మీరు వద్దన్నారని యివాళ చెప్పాడు. అందుకని మీ ఉద్దేశ్యాన్ని తెలుసుకుందామని ఇక్కడకు రావలసివచ్చింది. ఏమంటారు?"

"మావంటివారికి ఈ విద్యలు అబ్బవని జంకుగా ఉంటుందిమాస్టరుగారూ!" అన్నది మీనాక్షి సన్నగా.

"అబ్బ! ఎంత మాట అన్నావు తల్లీ! అలా ఎప్పుడూ అనుకోకూడదు. మనం దేన్ని గాఢంగా కాంక్షిస్తామో, దాన్ని ఏనాటికైనా భగవంతుడు ఏదో ఒక రీతిగా ప్రసాదిస్తాడు.... ఇక్కడ హెచ్చు తగ్గు లేమిటి? చూడు తల్లీ! నీకు ఇంకా సంగీతం విషయం సరిగ్గా తెలియదు." మీనాక్షి మనసు చివుక్కుమన్నది. దేన్ని తను ప్రాణప్రదంగా ప్రేమించిందో, దాన్ని గురించే తనకు తెలియదంటున్నారు. తను సంగీతం కోసమని తపించి పోతూ, ఎన్ని తెలుసుకున్నది! ఆయన మాటలే నిజమై ఉంటే, ఈపాటికి తన కంఠంలో అమృత ధునులే ప్రవహించి ధరిత్రి నంతటినీ హర్ష పులకాంకితం చేయకపోవునా? ఆయన మాటను సగంలో ఆపుతూ, "సరే, మాస్టరుగారూ! మీ ఇష్టం" అంది మీనాక్షి. లక్ష్మీనారాయణగారు ఉత్సాహంతో లేచి, "మీవాణ్ణి అయిదేళ్లలో మంచి సంగీత విద్వాంసుడిగా చేసే పూచీ నాది" అన్నారు. అంటూ, చిరునవ్వునవ్వి రామకృష్ణ—భుజం చరిచి వీధిలోకి నడిచారు. ఏభై అయిదేళ్ళ ఆయన విగ్రహం దూరమయ్యేవరకు చూసి, ఒక్కసారిగా రామకృష్ణను హృదయానికి హత్తుకుని వెక్కిళ్లను సరిపేసింది మీనాక్షి.

అప్పటివరకు నేరం చేసినట్లు తల వొంచుకు గుటకలు మింగుతున్న రామకృష్ణ—గుండె కుదుట పడ్డది.

అది ఒక ప్రభాతం. దినానికి నాందీ వచనం పలుకుతున్న ప్రాతఃసమయం. పాలించడానికి వస్తున్న ద్యుమణి దరహాసాన్ని చూచి ధరణీతల మంతా మెచ్చబడుతున్నది. తెలియకనే జీవన తాపత్రయంలో పడి, కలకలమని చంచలంగా సంచరిస్తూ, ఆహారాన్వేషణ చేస్తున్న పక్షులు, అడ్డు పడుతున్న మనుషుల్ని చూచి మధ్యమధ్య విసుక్కుంటున్నాయి.

అటువంటి సుందరమైన సూర్యోదయాలను మీనాక్షి నలభై ఎనిమిదేళ్ల తన జీవితంలో ఎన్ని సార్లు చూచిందో! కానీ, ఈనాటికి ఆ వెలుగులను తన కళ్లల్లో నింపుకో గలుగుతున్నది. మీనాక్షి కళ్లు ఇప్పుడు నిర్మలమైన హాస—ముద్రను చూపుతూ, స్నేహభావాన్ని పుట్టిస్తాయి. అనుభవించక మరుగుపడిన ఆనందమంతా ఆమె మనసులో ఉప్పొంగి పోతున్నది. సముద్ర తరంగాలవలె ఉరకలు వేసే వయసులో కూడా ఆమె ఎక్కువ ఆనందంగా కనిపించేది కాదు. బాల్యంలోనూ, వైవాహిక జీవన ప్రారంభంలోను ఆమె కళ్లల్లో పారడే నీడలు ఈనాడు లేవు. ఈనాటి మీనాక్షి పరిపూర్ణ హృదయంలో స్వచ్ఛమైన ఆనంద తరంగాలు ప్రవహించుతున్నాయి. వాటి తాకిడివల్ల ఆమె ముఖ—కమలం మరింత వికాసవంతమైంది. అపరిమితమైన గౌరవభావం కలిగి ఆమెను చూచినవారందరూ సన్నిహితులు కావాలని తాపత్రయ—పడతారు.

> ప్రమాదాలు జరక్కుండా ఉండేందుకు తాయత్తు కట్టుకున్నాడుట ఒక పెద్దమనిషి. తాయత్తు అమ్మే వ్యక్తి, అతను స్వయంగా కారునడిపే అలవాటుందని తెలుసుకుని "అయ్యా! ఈ తాయత్తు నలభయి మైళ్ళ వేగం మించితే పని చెయ్యదు!" అని చెప్పాడు.
>
> కె. వి. ఎస్.

అంత ఆనందం, ఆ ఉద్రేకము, ఉత్సాహం ఎందుకని అని ఎవరూ ఆలోచించలేదు.

మీనాక్షికే తెలుసు తనలో మార్పు; అది ఎలా సంభవించిందో—

ఆమె తపస్సు ఫలించింది. మీనాక్షి ఎదలో ఎదగా, మదిలో మదిగా పెరిగిన రామకృష్ణ ఇప్పకవే, ఆమె హృదయాన్ని వణికి పుచ్చుకో గలిగాడు. ఆమె భక్తి—పుష్పాన్ని భగవంతుడికి సమర్పించడానికి అతను పూజారి అయినాడు. రామకృష్ణ విఖ్యాతమైన సంగీత విద్వాంసుడు. పదేళ్ల గురు—శుశ్రూష ఫలితంగా పొందిన సంగీత ప్రజ్ఞ దేశాంతరాలకు కూడా వ్యాపించుతుంది. అతని గానంలో సర్వ—జనీనత ఉంది. అదిగాక జనరంజకంగా పాడగలడు.

మీనాక్షి—సంగతి చెప్ప నవసరంలేదు. అతి మధురమైన ప్రణవనాదం ప్రతిదినం మందిరంలోనూ, మానసంలోనూ వినిపిస్తుంటే, మీనాక్షి హృదయం అనిర్వచనీయమైన భావ—పరంపరలో తేలిపోతున్నది. కొన్నాళ్లవరకు గత జీవన భావనలు కలిగినప్పుడల్లా విషాదాన్నే నింపుకోగలిగిన ఆవిడ మనస్సులో నేడు వెదకి చూచినా, ఒక విషాద భావమూ కనిపించదు—పైగా గతించిన జీవితం తలుచకుంటే, మాటలకందని సంతృప్తి కలుగుతుంది. తనను భగవంతుడు కరుణించాడని అనుకున్నప్పుడంతా, మీనాక్షి కళ్ళు ఆర్ద్రమవుతాయి. ఆ కళ్లల్లో రవ్వంత గర్వం తొణికిసలాడి మరుక్షణంలో మటుమాయమవుతుంది — అంతేకానీ, ఆమె మోహంలో మునుపటి బెదురు లేదు. రామకృష్ణ—సంగీతం వలన మీనాక్షిలో మానసిక పరిణామం అలా జరిగింది. ఆమె హృదయస్థితి చెప్పాలంటే అసాధ్యం. 'విశ్వ వీణయై నా హృదంతమయ్యె' అన్నట్టు ఆనందోద్దీపిత మనస్కురాలౌతున్నది మీనాక్షి.

ఆ అచంచలమైన ప్రేమలో రామకృష్ణను కనురెప్పలలోనే కాపాడుకుంటుంది. అతనిపై ఈగ అయినా వాలకూడదు. అతని ఆరోగ్య విషయంలో ఎవరు అశ్రద్ధ చేసినా సహించలేదు ఆమె. అతను నిద్ర లేవగానే, తనే నీళ్ళు తోడాలి స్నానానికి— తల దువ్వాలి; బట్టలివ్వాలి— అతన్ని కాపాడుతుండమని దేవుణ్ణి నిరంతరం కోరుతుంది! భర్త—సేవ కూడా అంతగా ఎప్పుడూ చేసి ఉండదు మీనాక్షి.

అదంతా చూసి రామకృష్ణ—భార్య సరస్వతి నవ్వుకుంటుంది. 'పసిపిల్లవాడిలా చేయించుకుంటున్నారు' అని రామకృష్ణతో అంటుంది రహస్యంగా. రామకృష్ణ జీవిత సంగీతంలో మోహనరాగం ఆలపిస్తున్నాడు—అతను కూడా నవ్వుతాడు—'మా అమ్మ నన్నంత ముద్దుగా చూస్తుంటే, నీకు అసూయగా ఉన్నట్టుంది; పోనీ, మీ అమ్మ దగ్గరికి పో రెండు రోజులపాటు' అంటాడు సరసంగా రామకృష్ణకి తను మీనాక్షి స్వంత కొడుకు కాడని తెలుసు. ఒకటి రెండు సార్లు ప్రస్తావిస్తే, అది ఏమేది లేకుండా ఆరంభించి అంతం చెప్పకుండనే ఏపు చేసేది ఆమె. కిష్టంలేని దాన్ని తరచి తరచి అడగలేదు రామకృష్ణ. ఆ అవసరమూ లేకపోయింది. మీనాక్షి భర్త కూడా అప్పుడప్పుడు వేళాకోళంగా అంటాడు —'కొడుకు సేవలో నన్ను బొత్తిగా మరచి పోతున్నావ్ మీనా' అని. ఆయన మాటలో రామకృష్ణ స్వంత కొడుకు కాడని గుట్టు చెందం తోస్తుంది. అది హాస్యమాడ్లో యిమిడి [illegible].

అయినా దేనినీ పట్టించుకో [illegible] వాడు. ఒకరి ఎవరి పనిధ్యాసి [illegible] వారు బంధువులు, ఆత్మీయులు [illegible]

జీవిత సంగీత

ప్రేమబంధంతో సన్నిహితులైనవారు. అందువా క్షణకాలం కలసిఉన్నదానికంటే, క్షణమైనా ఎవరిపై సద్భావం కలుగుతుందో, అదే అనుబంధయుతమైనది. వారిని పరులుగా ఎవరూ చూడలేరు. అంతర్యంలో దానికి ఒక దివ్య దృష్టి ఉంది.

* * *

"రామూ! ఆ కీర్తన పాడరా! వినిపిస్తావని వచ్చాను. ఉండుండు—ముందుగ ఈ కాఫీ తీసుకో. నువ్వు రాగాలాపన మొదలెట్టావంటే ఒక పట్టాన వదల్తావా ?"

"పాడేముందు కాఫీ తాగితే, గొంతు పాడవుతుందమ్మా .... పోనీ, ఇలా తే."

"ఊఁ—ఏమిటి పాడమన్నావమ్మా యిక చెప్పు."

"అదే—ఎంత విన్నా తనివితీరదు నాకు. 'అపరాధము లన్నియు మన్నించి ఆదరింపవయ్యా' అని. ఎవరి కీర్తన అది? మరచిపోయాను ...."

"అది ఎన్నోసార్లు విన్నావు కదమ్మా! నే నెప్పుడూ వినిపించని కృతి పాడతాను; విను. తర్వాత నువ్వు చెప్పినది పాడవచ్చు—ఊఁ—కలిగియుంటే కదా కల్గును అనీ ...."

"అవును. మంచిది చెప్పావు కృష్ణా నాలాంటి వారి కది భగవంతునితో హృదయ నివేదనలా ఉంటుంది."

"వినమ్మా. ఇది త్యాగరాజస్వామి చేసిన కీర్తన."

"అవును. నాకు తెలుసు."

"ఆఁ—నీ కేం తెలుసు .... మహా వచ్చినట్టు."

"చూడవే సరస్వతీ! మీ ఆయన ఏమంటున్నాడో—లోకంలో తనకన్నా మించిన విద్వాంసులు లేరనుకుంటున్నాడు—"

"సరస్వతినే అడగాలి; పత్ని మొద్దు. ఆ పేరు పెట్టి పిలవడమే సిగ్గు సిగ్గు. ఎలా నవ్వుకుని వెళ్ళిపోతున్నదో చూడమ్మా!"

"దానికి సంగీతం యిష్టమే గాని, పిచ్చి వ్యామోహము లేదు. నాకు సంగీతమే ప్రాణం. గానం విన్నప్పుడే నా హృదయం స్పందిస్తుంది. నాలో జీవరసం ప్రవహిస్తుంది. సంగీత — ప్రాప్తికోసం మనసులో ఒక యజ్ఞం చేశానురా! రామూ! అందుకే నువ్వు దొరికావు. నువ్వు వరప్రసాదుడవు."

"అవును. నాకు తెలుసమ్మా; పూర్తిగా తెలుసు.. పాడనా యిక:"

"కలిగియుంటే కదా .... కలుగును కామిత ఫల దాయకా .... "

"అమ్మా! కంట నీరు వచ్చిందా ? త్యాగరాజు గారు అలానే వ్రాశారు. ఆయన కూడా మనలానే సాంసారిక జీవితంలో అనేక బాధలను, సమస్యలను ఎదుర్కొన్నారు. జీవిత పర్యంతమూ ఉండే హృదయ వేదననూ, ఆరాటాన్నీ ఆయన కృతుల మూలంగా శాశ్వతం చేశారు. మన స్థితి అలా ఉన్నప్పుడు మనమూ విచలితుల మౌతాం — కళ్ళు చెమరుస్తాయి. అందులో ఆశ్చర్యం లేదు."

"ఒకప్పుడైతే నా కన్నీరు దుఃఖాశ్రువులుగా ఎవరైనా అనుకున్నా పొరపాటేమీ ఉండ పోను. కానీ, ఇప్పుడు అది కాదు. ఇవి ఆనందబాష్పాలు...

"రామూ! నేనొక గొప్ప సంగీత కళా కోవిదురాలినై ఉన్నా, నువ్వు నా ఎదుట పాడగా విన్నప్పుడు కలిగే తృప్తినీ, అనంతమైన శాంతినీ పొందగలిగి ఉండునో లేదో అనుకుంటున్నాను ఇప్పుడు—అంతా లెక్కగా ఒకటి చెప్తాను విను."

"—నువ్వు ఎంత జ్ఞానసిద్ధి సంపాదించినా సంపాదించు. ఎంత కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించి కొద్దిగా గర్వించిన గర్వించు; మనసులో మాత్రమే. ఎంత నిగర్వులైన ప్రముఖులు ఆత్మపరిశీలన చేసుకుంటూ, ఒకప్పుడైనా మనసులోనైనా గర్వించక పోరు. దాన్ని ఎవరూ తప్పించుకోలేరు.— కానీ ఎప్పుడూ నీ నడత మారకూడదు. [illegible] అమూల్యమైన [illegible] ఎందరో సంగీత సాహిత్యాన్ని సృష్టించి ఉన్నారు. వారి రచనల్లో గాని, పద్ధతుల్లో గాని ఏదైనా లోపం ఉండి నీకు నచ్చక పోతే, అది వెల్లడిచేసి నిస్సంకోచంగ విమర్శించు. అంతేగాని, ఎప్పటికీ వారి సృష్టిని తృణీకరించకు. అలా కనుక చేసితే, నీకు సంగీతమేగాని, పరమాత్ముడు అర్థం కానట్టే."

"అంత చెప్పాలా ? నాకు తెలియదూ. నీకు పుట్టినవాణ్ణి కాకపోయినా, అక్కడిలా నీ కొడుకునే అనిపించుకుంటాను. అందరిలో !"

"రామూ! ఒక మాట! నువ్వర్థం చేసుకోవా అని చెప్తాను. ఎన్ని జన్మలనుంచి ఎంత తపస్సు చేశానో, నువ్వు నా కొడుకు. [illegible] ఈ జన్మ కింత భాగ్యం కలుగుతుందని కలలో నేనే — ఈ తల్లికే కష్టమూ కలిగిస్తున్నాడని చేతుల్లోకి వచ్చి వాలావు."

"నే నొకటి అనుకుంటున్నానమ్మా!"

"ఏమిట్రా."

"నేను చెయ్యబోయే కీర్తనలకి నీ పేరుకి అంకిత మిద్దామని అనుకుంటున్నాను."

"నా పేరేమిటి ? ఏ రాముడికో, కృష్ణుడికో అంకితమిస్తే బాగుంటుంది."

"అంతే, నా పేరే పెట్టుకోవటానికి ఆఖరికి. నువ్వైనా నేనైనా ఒకటే. అస్సలు ఆలోచించలేక పోయావు. సరే, నా ఈ మాటకు తిరుగులేదిక."

"సరే లేరా! నీ మాటలా నవ్వు [illegible] నా పేరేమిటి మధ్య—[illegible] పేరు."

"అదే నేననబోయేది. [illegible]"

"అది సరే కాని, నిన్ను గురించి శ్రీ [illegible] కుంటున్నారు రామూ! [illegible] నీ పేరు పట్టుకు అంత గోల చేశారు. ఆ ఖ్యాతి పెరిగిందా? తరిగిందా? అని."

"నా కెలా తెలుస్తుందమ్మా! నువ్వు మారువేషంలో బయల్దేరి చూద్దాం."

"అలాగా ?"

"వచ్చే నెల కలకత్తా వెళ్తున్నామ్మా! అక్కడి ఆంధ్ర సోదరులు ఆహ్వానించారు. ఎంత దూరం అయినా, అభిమానంతో ఆహ్వానిస్తే తిరస్కరించడానికి మనస్కరించదు."

"అంత దూరం వెళ్ళి.... ఊఁ...తిండీ, నిద్రా సరిగ్గా లేకుండా... ఏమిటి బాబూ! నువ్వు దూరం వెళ్తే, నాకు మనసు మనసులో ఉండదురా!"

"భయమేమిటమ్మా! రెండురోజుల్లో ఇక్కడ ఉంటాను. తొమ్మిది గంటలకి కచ్చేరి ప్రారంభ మవుతుంది. ఒంటిగంటకల్లా పూర్తవుతుంది. అలా బండిఎక్కి ఇలా వచ్చేస్తా."

"సరేలే— నీతో వాదన వేసుకు కూర్చోటానికి సమయం చాలటంలేదు. పద, భోజనానికి." (సశేషం)

ప్రవాహంలో

తృణకణాలు

15—వ పేజీ తరువాయి

"పోనిలే—స్నేహధర్మం చూపించుకున్నావు. కాని ఒక్కమాట అడుగుతాను — ఇందాకా వచ్చింది కాబట్టి—విధివశాత్తూ అతని మేనత్త కూతురునై పుట్టడంతోనే అతనికి నేను అంకితం కావాల్సిందేనా ? నా జీవిత భాగస్వామిని ఎన్నుకోలేను సరే, అతన్ని అర్థం చేసుకోవటం కూడా వీలుకాదా ?" అంది. మాటలు సూటిగా గురిచెదరక నాటాయి నాకు.

"శారదా! రాజామీద ఎందుకు వచ్చిందా అపనమ్మకం ?" అన్నాను.

లేచింది శారద .... నేనూ లేచాను. ఇసుక దులుపుకుంది శారద.

"తెలిదని దాచిపుస్తావంటావుకదూ ? నీకే కాదు; నాకూ స్నేహితు లుండగలరు బిల్గాంలో—(తాగి తందనాలాడే రాజాకి నన్ను నేను ఎందుకు అర్పించుకోవాలో చెప్పగలవా ?" అంది.

ఆరోజు చీకటి—తెరల మధ్య నన్ను పై ప్రశ్న వేసి, ఉక్కిరి — బిక్కిరి చేసిన శారదకు, రాజా ఎంగేజిమెంట్ (ప్రెజంట్ కొనబోవటం—దానికి నా సెలక్షన్ ! ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాను, నేను, వారిద్దరి వైవాహిక జీవిత బంధాలకు నాందీ—వాక్యం పలకడమా ?

* * *

"శారద నచ్చుతుందా రాజా ?" అన్నా సందేహిస్తూనే.

"వాడ్డయు మీన్ .... మద్రాసు పిల్ల పైత్యం చేశాయేంరా నీకు ? శారదకూ, నాకు పెండ్లి సరిగ్గా రెండు నెలలుంది. తాంబూలాలు, వ్యవహారాలు అన్నీ అయిపోయాయి. అందుకనే (ప్రెజంట్" అన్నాడు.

కంగ్రాచ్యులేట్ చేశాను. నవ్వి, భుజం తట్టి బయల్దుదేరాడు.


అంతా తిరిగి—తిరిగి, అయిదువందల అరవై రూపాయలు పెట్టి ఉంగరం కొన్నాడు రాజా. దాన్ని ఇన్ష్యూర్డ్ పార్సెల్లో శారదకు పంపించి, బిల్గాం వెళ్లిపోయాడు.

ఆతర్వాత నెలరోజులు గడిచిన తర్వాత శారదనుంచి నా కో ఉత్తరం వచ్చింది శారద వద్దనుంచి. సంబోధన లేదు. ఎక్సర్సైజు—నోట్సు నుంచి కాగితాలు చించి, వాటిమీద వ్రాసింది శారద :

"కాబోయే భార్యకు నీ మిత్రుడు పంపిన—కనీసం వెయ్యి రూపాయల ఖరీదుచేసే ఉంగరం భద్రంగా అయిదు రోజుల ముందే చేరిందని చెప్పడం కాదు ఈ ఉత్తరం లక్ష్యం—

మనుష్యులూ, భావాలూ, ఉద్దేశాలూ, మాటలూ చేతలూ, పరిస్థితుల్నిబట్టి క్షణక్షణానికి మారుతాయని నా భావం. రాజా ఎలాంటివాడయినా నా కక్కర్లేదనిపిస్తోంది. నేనూ, మా నాన్న, కుటుంబం రాజావాళ్లకి చాలా ఋణపడి ఉన్నాం — మా మామయ్య చనిపోయేలోగా పెండ్లి జరిగిపోతుంది ఆయన ఆత్మకు శాంతి నివ్వబోతున్నాం. ఆడదాని మాటలకు అర్థాలుంటాయి.... ఆలోచిస్తే—

ఏమో, ఎవరికి తెలుసు—రాజా తెలివితక్కువవాడు కాదు. నాకూ, అతనికీ పద్దెనిమిది సంవత్స



వంజంగూడు ఔషధములకు ఒక టవునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము



ప్రవాహంలో తృణపత్రాలు

నా భార్యగా ... అదృష్ట మంచి దారిలోకి తేవాలని నా సంకల్పం.—నా కథనిమిద—"ప్రేమ" ఉందా లేదా అని నీవు చర్చించుకుంటే నా దగ్గరినుంచి కూడా సహాయం లభించదు. వివాహం జరగడం మాత్రం ఖాయం. ఆ తర్వాత నా అదృష్టం—నీ ఆశీర్వాదం — ఉంటాను.

'శారద.'

ఆ ఉత్తరం వెనుక ఉన్న జీవిత నాటక క్రమం ఈరోజు బోధపడింది కాని, ఆరోజు నాకు ఏమీ అర్థంకాలేదు. శారద నిజంగానే రాజాని ప్రేమించి ఉండవచ్చు.—రాజా పద్ధతులు మార్చుకుని, శారదని మక్కువగా చూసుకోవచ్చు.

ఏదో జరుగబోతూ ఉందన్న భయం ఒకవేపు పీకుతూ ఉన్నా, రాజా, శారదా సుఖంగా ఉండాలనీ, అన్నివిధాలుగా ఆనందించాలనీ మనసారా కోరుకున్నాను.

రాజా అనిన ప్రకారం వివాహం జరిగిపోయింది. అయిదు రోజులపాటు వైభవంగా జరిపించారు. ఒక్క క్షణం తీరిక దొరకలేదు నాకు. హనీమూన్‌కు బెంగుళూరు వెళ్ళారు రాజా, శారదా. నేను మద్రాసు వెళ్ళాను వెంటనే. కొద్ది రోజులకే జాబు వచ్చింది శారదనుంచి....రెండే రెండుముక్కలు:

'నేను ఎంతో ఉత్సాహంతో ఒక మహాకార్యం చేయబూనుకున్నాను. అందులో సఫలీకృతురాల్నీ అయితే సరే—లేకా ...

శారద.'

శారద మనో—ప్రవృత్తి అర్థంకాలేదు నాకు.

పెండ్లయిన నెల రోజులు శారదా, రాజా కలిసి ఉండడం నాకు తెలుసు. ఆ తర్వాత రాజా బెల్గాంకు పోతున్నానని వ్రాశాడు. శారదనుంచి మళ్లీ ఉత్తరాలు లేవు. జవాబులు రాలేదు జాబులు వ్రాసినా కూడా బెల్గాం నుంచి వాడిని గూర్చే కాని, శారద గూర్చి ఏ వార్త రాలేదు. ఆఖరికి మద్రాసుకు టెస్ట్ మాచ్ అయినా రమ్మని వ్రాశాను. రాలేనని నిర్మొహమాటంగా వ్రాశాడు. ఏ లేదన్నాడు.

అయిదు నెల్ల తర్వాత జాబులో శారద వ్రాసిన ఉత్తరంతో నా మనస్సు ఆనందంతో పరవళ్ళు తొక్కింది.

ఆఖరికి శారదే గెలిచేలా చెప్పించింది.

"రాజా నుంచి జాబులు వస్తున్నాయి—అప్పుడప్పుడూ. కాని, ఇక్కడికి ఒక్కసారి రమ్మని వ్రాశాను. జవాబు రాయలేదు, పదిరోజు లయిపోయింది వెళ్ళేముందు తప్పక వస్తానన్నాడు. నీవయినా వ్రాయి. నాకోసం కాకపోయినా, కనీసం నీ అల్లుడి లేక కోడలికోసం అయినా ఆయన్నిక్కడ కోసారి రమ్మని వ్రాయి— శారద."

వెంటనే రాజాకి పెద్ద ఉత్తరం ఘాటుగా వ్రాసి పంపాను. మొదటి కాన్పుకు భర్త, భార్య దగ్గర ఉండటం మానసికంగా భార్యకు ఎంత ధైర్యం ఇచ్చేదీ, ఎంత ఆనందం కల్గించేదీ వివరించాను. నేను 'డాక్టరు' గా ఈ ప్రపంచంలోకి తీసుకు వచ్చిన పిల్లలందరూ వారి తండ్రులు తల్లి దగ్గర ఉన్నప్పుడు ఎంత సులభంగా ఈ ప్రపంచ ప్రవేశం చేసిందీ లెక్కలేసి, స్టాటిస్టిక్స్ పంపాను. శారదకు కూడా జాబు వ్రాశాను.

అయిదారోజుల తర్వాత రాజా జవాబు వ్రాశాడు:

"నీ ఉత్తరం అందింది. నీవు చెప్పిందంతా నిజమే అయ్యుండాలి. కాని బెల్గాం వదిలి రావటం ఇప్పట్లో కొంచెం వీలుకాదు. కాని నిన్నో సహాయం అడుగుతున్నాను. సమయానికి నీవు వెళ్ళి అన్ని సదుపాయాలూ చేయి. ఇది నా కోరిక.. నీమీద నాకు ఎంతో నమ్మకం .... మరోలా అనుకోకు ...

రాజా."

తర్వాత శారదకు జాబు వ్రాశాను; సాధ్యమయినంతగా అనునయిస్తూ. వారం రోజులు తిరగ్గానే శారద నన్ను ఆహ్వానిస్తూ రాసింది. ప్రొఫెసర్‌తో చెప్పి, బయలుదేరాను.

శారదను అప్పటికే హాస్పిటల్‌లో చూపించడం, అంతా అయిపోయింది. నేను వాళ్ళింట్లో కూర్చుని అదీ ఇదీ చదువుకుంటూ, శారదను ఓ కంట చూచుకుంటూ గడిపాను. ఒకరోజు ఇద్దరం, భోజనాలయింతర్వాత హాల్లో కూర్చొనుండగా, శారద అంది:

"రాజుకి బెల్గాం ఇస్తున్నాను. రాజా వస్తే సరి, లేదా, నేను ఓడిపోయినట్లు ఒప్పుకుంటాను."

"తప్పక వస్తాడు శారదా" అన్నాను ఆశిస్తూ.

ఆ మర్నాడు రాజా — దగ్గర్నుంచి ఓ జాబు వచ్చింది. శారద కూడ అది తెలుసుకుంది. కాని, ఏమిటని అడగలేదు. రాజా వ్రాశాడు :

"నీవు శారదకు సహాయంగా వెళ్ళిఉంటావన్న నమ్మకంమీదనే ఈ అడ్రసుకు రాస్తున్నాను. బహుశా ఈపేళ్టికి నేను ఓ తండ్రిని అయి ఉండవచ్చు. ఒక విషయం చెప్పదల్చుకున్నాను నీకు. చాలా వ్యక్తిగత విషయం; హనీమూన్ రోజుల్లో జరిగింది :

"నాది చాలా దుడుకు స్వభావం అని నీకు తెలుసు. నాకు ఏదయినా కొంచెం 'అతి'. నేనూ, శారదా ఆరోజు సినిమాకు పోదామని ప్రోగ్రాం వేసుకున్నాం పొద్దున్నే. ఎందుకో సాయంత్రం అయ్యేసరికి నాకు రాత్రి తొమ్మిది గంటల ఆటకి వెడదా మనిపించింది. శారద ఒప్పుకోలేదు. అనవసరంగా ఎడముఖం, పెడముఖం అయిందా రోజు. సెకండ్ షోకి రాలేదు శారద. నే నొక్కడినే వెళ్ళి వచ్చాను. శారద తలుపు తీలేదు. మరో రూంలో పడుకున్నాను ఆ రాత్రికి.

ఇదంతా ఎందుకు రాస్తున్నానో గ్రహించావనుకుంటున్నాను. నేను క్షణక్షణానికి మారుతూ ఉంటాను. నాకు నిలకడ అయిన స్థిర—ప్రవృత్తి లేదు. శారదని నేను వివాహం చేసుకుంది ఇందుక్కోసం— ఆమె నాకు చాలా భిన్నం; కాంట్రాస్ట్—ఆమె పట్టుదలతో, అర్థం చేసుకుంటుందనే ఆశతో పెండ్లికి ఒప్పుకున్నాను. ఆమె పట్టుదల, మొండి తనాలకి మరో రూపంగా కన్పించింది నాకు.

ఆరోజునుంచి మాకు సరిగ్గా సఖ్యం కుదరలేదు. శారదకు నామీద ఏదో కోపం, అసూయ ఉన్నా యనిపిస్తుంది నాకు. శారద కొంచెం ఆలోచించి, తనను తాను అవగాహన చేసుకుని ప్రవర్తిస్తే, చాలా బాగుండేదేమో—

ఆఖరికి నేనే మారాలా ? కాని, ఎంతయినా శారద నా భార్య—నీలాయితే కావాలని ఉంది—కాని చెప్పలేను. ప్రయత్నిస్తాను—ఈ విషయం వెంటనే బెల్గాం ఇవ్వు— రాజా."

ఈ సంగతి శారదకి చెబుదా మనుకున్నాను, కాని ఏలాగూ రాజా వస్తే, వార్త విని కాచుకొని ఉంటుందన్నా, అదే ఎక్కువ ఆనందం ఇస్తుందని అనుకుని, చెప్పలేదు. అలా అయితేనే ఆ పునస్సమాగమం మరింత ప్రగాఢంగా ఇద్దరి మనస్సుల్లోనూ తగిలి, పాత పొగను తోసేస్తుందని ఆశించాను. శారదతో ఆ సంగతి అందుకని, ప్రస్తావించనే లేదు.

ఆ మర్నాడు రాజునుంచి మరేమీ జాబు రాలేదు.. ప్రతిరోజూ కాచుకుని కూర్చున్నాను. వారం రోజులయినా, రాజా రాలేదు.

శారదకు నొప్పులు ప్రారంభించటమే, విపరీతంగా వచ్చాయి. రాజుకు ఎలాగయినా రమ్మని ఎక్స్‌ప్రెస్—బెల్గాం పంపాను రహస్యంగా. శారదను పట్టశక్యంకాలేదు. రాత్రంతా వార్డులో తయారుగా, భయంభయంగా గడపాల్సివచ్చింది.

మరునటిరోజు ప్రొద్దున చంద్రాస్తమయం సమయానికి, దాదాపు వేకువజామునకు ముందు మరో గంట ఉండనగా, శారద పండులాంటి శిశువుని కంది — మైకంలో.

కాని, రాజా, శారదల దురదృష్టంకొద్దీ, ఎంత ప్రయత్నించినా, ఎంత కొట్టినా శిశువు నోరు విప్పలేదు. విరిగిన మనసుల విఫల ప్రయత్నాల నిర్జీవాకృతిగా రూపొందాయి.. డాక్టర్ షెపర్డ్ పెదవి విరిచి, 'సారీ' అంది..

ఒక పత్రికలో ప్రకటన:

"మాజీ హీరో వేషాల నటుడికి డ్రామాలలో పాత్రలు కావలెను. స్టేజిమీద శవాలు, నేపథ్యంలో శబ్దాలు రెండింటికీ పనికివస్తాడు.

కె. వి. ఎస్.

మైకం వదిలింతర్వాత శారదకు ఈ వార్త చెప్పలేకపోయాను. సంగతి గ్రహించిన శారద ఎలా బాధపడుతుందో అని చాలా సతమత మయ్యాను. శారద చేయి మంచులాగా ఉంది నా చేతిలో; కండ్ల వెనుక ఆశా నిరాశల వెలుగునీడలు దోబూచులాడాయి వెనవెనుకుంటూ.. శారద కంట నీరు మాత్రం రాలేదు చెప్పింతర్వాత.. "మనం దురదృష్టవంతులం" అని ఒక్కక్షణంపాటు కాబోలు శారద కండ్లు ఆర్పింది; నిర్లిప్తంగా, ఆ తర్వాత నా వేపోసారి చూచి, గోడవేపు చూడసాగింది. ఆమెచేయి నిర్జీవంగా, అచేతనంగా, ఘనీభవించిన నిరాశలాగు చల్లగా నిలిచింది నా చేతిలో. చాలాసేపు గడిచింది. తర్వాత పాలిపోయిన పెదవులు ప్రయత్నంమీద విప్పి, అడిగింది: "రాజా వచ్చాడా ?" అని.

అడ్డంగా తలూపాల్సివచ్చింది.

శారద కళ్ళుమూసుకుంది. నా చేయి ముఖానికి దత్తుకుంది. వేడి కన్నీరు గుండెల్లోంచి వచ్చింది....

"ఓడిపోయాను — ఓడిపోయాను" అంది ఏడుస్తూ....

అంతదాకా ఓటికి వస్తూన్న శోకం కట్టలు త్రెంచి రా—సాగింది. ఆ వేదనా వాహినిలో నేను కొట్టుకుపోయాను.

ఆ తర్వాత ఆరునెలలకు గాని, శారద పూర్తిగా కోలుకోలేదు. నేను మద్రాసు వెళ్ళిపోయాను వారం రోజులు కాగానే— ఆ ఆరునెల్లలోనూ శారద నాకు ఒక్క జాబు రాయలేదు. రాజా జవాబివ్వలేదు ఎన్ని సార్లు వ్రాసినా..

రోజులు గడిచిపోయాయి — నెమ్మదిగా, భారంగా, యాంత్రికంగా జరిగిపోయిందంతా... ఆపగలిగిందెవరు చెప్పి ?

* * *

"నేను రేపు మద్రాసుకు పోవాలి శారదా !" అన్నాను.

శారద జవాబీలేదు.. తలూపింది నెమ్మదిగా..

"జి. టి. లో వెడతావా?" అంది తర్వాత.

"అవును" అన్నాను. తలెత్తి క్షణంసేపు చూచింది నావేపు.

"రాజా కలుస్తాడా ?" అంది చాలాసేపు ఆలోచించి అడిగినట్లు.

"తప్పకుండా.. నేనే బెల్గాం వెళ్తాను.. తీసుకొస్తా నిక్కడికి" అన్నాను నా ప్రగల్భాలు నేనే నమ్మ ప్రయత్నిస్తూ..

"మరేం లాభం ఉండదు. వృథా శ్రమ..రాజా... రాజా, రాడు—" అంది.

పరాజిత అయిన శారద-కంఠంలో ఆ వేదన నన్ను చలింపజేసింది. ఆమె వెంటనే మళ్ళీ చెప్పింది:

"నిన్ను ఒక సంగతి అడగాలనుకుంటున్నాను చాలా రోజుల్నించి.... ఆ రోజు నీవు చెప్పలేదు— ఆ పాప— ఆడా.. మగా ?"

గొంతు వణికింది.... ఆ వెనుక బాధ, ఆశ, దొరకని ఆనందపు అందం కన్పించాయి.. ఆమెవేపు చూచాను..

కూలిపోయిన పురాతన భవనాల బీటల్లో మొక్కలు వస — వసంతంలో చిగురించటంలేదా అన్పించింది.. హిమాలయ శిఖర శీతల ప్రాంగణంలో మాత్రం సూర్యరశ్మి సోకడంలేదా ? వెచ్చదనం, వెలుగూ ఇవ్వటంలేదా భగవంతుడక్కడ ?

"మగపిల్లవాడు శారదా !" అన్నాను. వెంటనే ఒక వింత ఊహ స్ఫురించింది.

"శారదా, నిజంచెప్పు— ఆ పిల్లవాడే బ్రతికి ఉంటే — ఎలా ఉండేది—?" అని అడిగాను ఆతృతగా.. ఇంతదాకా దొరకని ఏదో సమాధానం, వస్తుందని ఆశిస్తూ..

శారద తలెత్తింది.

ఆమె కండ్లవెంబడి నీరు ప్రవహించింది. హృదయాంతరాళాల్లో పగిలిన అగ్నిపర్వతాల పెగలు కొట్టాయి.

విధి—తాడిత అయిన శారద ఉన్మాదినిలాగా ఏడవసాగింది. నిస్సహాయంగా చూస్తూ కూర్చున్నాను..

ఆ దుఃఖానికి ఉపశమనంలేదు..

ఆ గాయానికి మందూ, ఆ జీవికి శాంతీ లేవు. తెలిసి తెలిసీ, లోతు తెలియని ప్రవాహంలోకి దిగటం ధైర్యం లక్షణం..

దిగి, సుడిగుండంలో చిక్కుకోవటం దురదృష్టం కాని, అందులో చిక్కుకుని అంతమొందే దౌర్భాగ్యులకు గడ్డిపోచలు చూపి, ఏడిపించి నాశనం చేయటం ఆ భగవంతుడికయినా పరే, అనర్థమయిన పని— హీనమయిన కార్యం—

చీకటి చుట్టూ అలుముకుంది.

ఇద్దరం లేచాం..

మా వెనుక సంక్షుభిత సాగరం ఘోషపెట్టింది. ★

తామరకొలను

11—పేజీ తరువాయి

తన ప్రయాణాన్ని గురించి ఇంట్లో ఎవరూ ఏమీ అభ్యంతరం పెట్టనప్పుడు, మరిది చేసె గొడవ చూసి ఆమెకు నవ్వు వచ్చింది.

రాత్రి అందరి భోజనాలూ అయ్యాయి. తెల్ల వారు ఝామునే ప్రయాణం గనుక మరిదితో అప్పుడే చెప్పి వద్దామని అతడి గదిలోకి వెళ్ళింది కాంత.

"పాలు తీసుకో రమేశ్!"

"అలా ఉంచండి."

"చల్లారిపోతుంది మరి."

"అబ్బా, మీ గొడ హాటటే.......ఊఁ ఇలా తెండి" అంటూ, గ్లాసు అందుకుని ఆముదం తాగేవాడిలా మొహంపెట్టి గడగడా త్రాగేశాడు.

"రేపు ఉదయం నువ్వు లేచి ఉంటావో, లేదో" అంటూ, తను చెప్పబోయేదానికి నాంది వేసింది కాంత.

"లేచి ఉండను" అన్నాడు రమేశ్ చటుక్కున

"లేవక్కర్లా. ఇప్పుడె చెప్పుదామని వచ్చాను. రేపు వెళ్తున్నాను."

"మంచిది" అన్నాడు రమేశ్ ముభావంగా.

"అమ్మను కష్టపెట్టకుండా చూడు. వీలైనంత వరకూ నీ పనులు నువ్వే చేసుకో. కూర్చున్న చోటికే కాఫీ, టిఫిన్ తెచ్చివ్వాలని మొండి పట్టు పట్టకు. ఆమె కసలే ఏమీ చేతకాదు. వంటింట్లోకి వెళ్ళి, ఏం కావాలో అడిగి తీసుకో. పరీక్షకు బాగా చదువు."

"నే నేం పసిపిల్లాడి ననుకున్నారా ఏం? నాకూ ఇరవై మూడేళ్ళొచ్చాయి. ఈ సంవత్సరం దాటితే డాక్టర్ రమేశ్, ఎం. బి. బి. ఎస్. అని బోర్డు వేసుకుంటాను. గుర్తుంచుకోండి" అన్నాడు రమేశ్.

"నువ్వు డాక్టరయితేనేమాత్రమేం? ఇంట్లో స్వభావం మారుతుందా?"

"మారకపోతే పోయింది. ఉదయం మీరు వెళ్ళేటప్పుడు లేవాలనుకుంటాను. వెళ్ళి పడుకోండి" అన్నాడు రమేశ్.

"సరే" అంది కాంత.

ఊరికి వెళ్ళేముందు మరిదితో కాస్సేపు కబుర్లు చెప్పాలనే ఉందామెకు. కాని, మరిది ముభావపు మాటలతో మెదలకుండ బయటికి వచ్చేసింది.

గదిలోకి వెళ్ళిన కాంత, మడత పెట్టిన చీరలని పెట్టెలో సర్దుకుంటోంది.

ఎవరో దబదబా తలుపు బాదటంతో!

"ఎవరో చూడండి" అంది భర్తతో.

"ఈ సమయంలో ఇలా తలుపు కొట్టేవారెవరు? మీ ముద్దుల మరిదే అయ్యుంటాడు" అంటూ లేచి తలుపు తీశాడు.

"కొంచెం పనుండి వచ్చాను" అంటూ లోపలికి అడుగుపెట్టాడు రమేశ్.

"ఏమిటి సంగతి?" అంది కాంత.

"అదే, మీరు ఊరినుండి ఎప్పుడొస్తారు?" అని ముఖ్యమయిన ప్రశ్న వేశాడు రమేశ్.

"పుట్టింట్లో కొన్నాళ్ళు ఉండనీరా బాబూ ఆ నాలుగు రోజులైనా హాయిగా ఉందాం" అన్నాడు కృష్ణమూర్తి.

"పదిహేను రోజులుంటాను" అంది కాంత.

"అన్నాళ్ళు ఉండిరా కాంతా! ఇక్కడేం మునిగి

కాతుంది" అంటూ రమేశుడిని ఉడికించాడు కృష్ణమూర్తి.

కాంత నవ్వుతున్నా, రమేశ్‌కు కోపం వచ్చింది.

"మీకేం నవ్వులాటగా ఉంది. వదిన అక్కడుంటే నా చదువు ఎలా సాగుతుంది? ఉదయం నన్ను లేపే వాళ్లెవరూ?" అన్నాడు కోపంగా.

"అలారం గడియారం" అన్నాడు కృష్ణమూర్తి.

"అది చెడిపోతేనో? ఇక అమ్మకు కాలేజికి భోజనం

తామరకొలను

పంపటం తెలుస్తుందా? క్యారియర్ ఎలా సర్దాలో కూడా తెలీదాయె. ఇక నేను అన్నంలేక మాడాలి."

"అంత ఖర్మే మొచ్చిందిరా తమ్ముడూ. ఎక్కడ బడితే అక్కడ హోటళ్ళున్నాయి."

"హోటల్ భోజనం ఏం బావుంటుంది? వంటికి మంచిదికాదు. మీరు చెప్పండి వదినా! నే హోటల్ భోజనం చెయ్యాలనేనా మీ కోరిక?" అన్నాడు రమేశ్ కాంతతో.

"అమ్మకు క్యారియర్ ఎలా సర్దాలో చెప్పి వెడతాను" అంది కాంత మృదువుగా.

"నన్ను చూస్తే మీ కందరికీ నవ్వు—అందుకనే మీరందరూ కలిసి నామీద కుట్రపన్నుతున్నారు. కాని, ఇప్పుడే చెపుతున్నా—నేను ఈ మారు పరీక్ష తప్పితేమాత్రం అది నా తప్పుకాదు."

తాపురకోలను

రమేశుడి మాటలు విని, శాంతకు ప్రయాణం మానుకుందామనిపించింది. కాని, అంతా నిర్ణయించుకుని, తండ్రి కూడా వచ్చేశాక ఆఖరుక్షణాల్లో వెళ్ళనని చెప్పటం ఎలా?

"అయితే నన్ను వెళ్ళమంటావా, ఒద్దంటావా?" అంది చిన్నబుచ్చుకుంటూ.

"అంతా నిశ్చయమయిపోయాక నన్నడిగితే నేనేం చెప్పను? ఇదిగో ఈ మాత్రలు రోజుకు రెండు తీసుకోండి. ఇవి ఇద్దామనే వచ్చాను. తలనొప్పి మరీ ఎక్కువగా ఉంటే, ఈ ములాము రాసుకోండి" అంటూ మాత్రలూ, ములామూ శాంతకు అందిచ్చాడు.

"చాలా థ్యాంక్స్ రమేశ్!"

"తలనొప్పి ఎక్కువయితే ఇక్కడికే వచ్చెయ్యండి — ఎంతయినా అది చిన్న ఊరు."

"అలాగే; మీ ఈ సలహాకు ఫీజు ఎంత?" అని చిలిపిగా అడిగింది శాంత.

"పదిహేను రోజుల్లోగా మీరు ఇక్కడికి వచ్చెయ్యాలి. అదే నా ఫీజు."

"రాకపోతే?"

"రాకపోతే, మీ జట్టు వదిలేస్తాను రవ్వ లడ్డూ లెన్న, సినిమా—ఏవీ నా కోపాన్ని పోగొట్టలేవు. గుర్తుంచుకోండి" అన్నాడు హెచ్చరిస్తున్నట్టు.

"వెన్నెల — కాంతివంటి దేహచ్ఛాయ, అమ్మాయి?"

రమేశ్ తనను తానే మరిచిపోయాడు.

"చాలదు! చంద్రబింబంలాంటి మొహం, పద్మాల్లాంటి కళ్ళు, సంపంగి పూవులాటి......."

"రమేశ్, ఇహ నాకు నిద్దరొస్తోంది. తెల్లారగట్టే లేవాలి గాని, ఇక వెళ్ళు బాబూ" అంటూ అతడిని బయటకు పంపించి తలుపు వేసుకుంది.

రమేశ్ తన కాబోయే భార్య వర్ణన సగంలో ఆగిపోయినందుకు బాధపడుతూ వెళ్ళిపోయాడు.

శాంత, "చూశారా భార్య అంటే ఎలా మురిసిపోతాడో" అంది భర్తతో.

"అంతే మరి; ఆ వయసులో నేనూ అలాగే ఉండేవాడిని. ఎన్ని కలలు కన్నానో. కాని, ఇప్పుడు అర్థమయింది పెళ్ళామంటే ఏమిటో" అన్నాడు కృష్ణమూర్తి.

"పెళ్ళామంటే ఏమిటి?" కుతూహలంతో అడిగింది శాంత.

"ఒక కవి చెప్పాడు: 'స్త్రీ పెళ్ళికి ముందు పురుషుడికి ఓ రహస్యం; పెళ్ళయ్యాక ఓ సమస్య' అని."

"ఆఁ అయితే మీ కిప్పుడు ఓ సమస్యగా తయారయ్యానా ఏమిటి?"

"కాదా మరి? నీ తలనొప్పి నాకు నిజంగానే ఓసమస్యగాపరిణమించింది" కృష్ణమూర్తి నవ్వుతూ అన్నా, ఆమె ఆరోగ్యం గురించి అతడి మనసులో ఉన్న వ్యథ అతడి మొహంలోనే వ్యక్తమయింది.


"మరేం బెంగపడకండి. గాలి—మార్పుతో నా తలనొప్పి చెప్పి—చెయ్యకుండా పారిపోతుంది" అని ధైర్యం చెప్పింది శాంత.

మర్నాడు ఉదయం రమేశ్ నిద్ర లేచేసరికి శాంత తన తండ్రితో ఊరికి వెళ్ళిపోయింది. అలారం గడియారం సహాయంతో నిద్ర లేచాడు. పదిన కబుర్లు లేక అప్పుడే చికాకు పడటానికి మొద

ఫిలిప్స్ నోవోసోనిక్ ట్రాన్సిస్టర్ రేడియోలు

PHILIPS

* అసామాన్య శబ్దగ్రహణము
* అధునాతనమైన సాంకేతికాలు
* విశిష్టమైన నిర్వహణ
* పూర్తిగా ఉష్ణ నిరోధకమైనవి.
* సొమ్ముకు తగిన విలువ




B5CA19T

ఫిలిప్స్ రెక్సన్ కర్రి కాబినెట

2 స్పీకర్లు 4 బ్యాండులు

రు. 674/-




L4CA18T

ఫిలిప్స్ పోర్టబుల్

3 బ్యాండులు 7 ట్రాన్సిస్టర్లు

రు. 415/-

★



B3CA09T

ఫిలిప్స్ ట్రాన్సిస్టర్

3 బ్యాండులు 7 ట్రాన్సిస్టర్లు

రు. 349/-

(పన్నులు అదనము)

విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు అనుమతిపొందిన ఫిలిప్స్ రేడియో డీలర్లు:

తంతి "సౌండ్"

వైజాగు రేడియో కో.,

ఫోన్: 120

మెయిన్ రోడ్డు, విశాఖపట్నం-1

బ్రాంచి: శ్రీకాకుళం

లేట్టాడు. కొస్త త్వరగానే కాలేజికి బయల్దేరాడు.

వెళ్ళిన మర్నాడే ఉత్తరం రాసింది శాంత. అమ్మా,నాన్న, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు—అందర్నీ కలుసుకుని సంతోషంతో తలనొప్పిని కొద్దిగా మరిచి పోగలుగుతున్నానని రాసింది. అది విని అందరూ సంతోషించారు. కాని, రమేశుడు మాత్రం ఎప్పటి లాగానే వ్యాఖ్యానించాడు.

“వదిన తలనొప్పి మరిచిపోగలుగుతున్నాననే రాశారు. కాని, తగ్గిందని కాదు. కాబట్టి అంత సంతోషించాల్సిన విషయమేం కాదు”

సాయంకాలం ఇంటికి వచ్చిన కృష్ణమూర్తి: “అమ్మా, ఈవారు దసరాకు శేషగిరి వస్తున్నాడమ్మా! బొంబాయినుండి. భార్యా, కూతురూ కూడా వస్తున్నారు. బహుశా ఎల్లుండి రావచ్చు” అని చెప్పాడు.

“శాంత కూడా లేదు కదా. బొంబాయిలో ఉండే వాళ్ళాయె. వాళ్ళకు తగ్గట్టుగా అన్నీ నాజూగ్గా నేనేం చేయగలను? అంత నాగరికత నా కెక్కడిది చెప్పు? ఇప్పుడేం చేయను?” అని వాపోయారు సుశీలమ్మగారు.

“అయితే వెంటనే వదినను రమ్మని రాసేస్తా; ఇక ఏ బాధా ఉండదు” అంటూ, అందుకున్నాడు రమేశ్.

“ఒద్దు రమేశ్! ఇంకా ఇప్పుడేగా వెళ్ళింది అప్పుడే రాస్తే బావుండదు” అని సుశీలమ్మగారు వారించినా, రమేశ్ వినలేదు.

“వదినా! మీ ఇంటికి బొంబాయినుండి అతిథులు వచ్చారు. మీరు వచ్చి, ఆదర సత్కారాల భారం వహించాలి. అమ్మకు ఏమీ చేతకాదు” అని ఓ పోస్టుకార్డు గీచి పడేశాడు.

శాంత రాలేదు. కాని, రమేశుడికో చిన్న ఉత్తరం వచ్చింది.

“నేను రాలేను. వారి ఆదర సత్కారాల బాధ్యత నీకు చెందింది.”

చదివి, కోపంతో ఉత్తరాన్ని చింపి పారేశాడు.

శేషగిరి వస్తున్నాడని కృష్ణమూర్తికి చాల సంతోషంగా ఉంది. వారిద్దరూ ఇంటర్‌వరకూ కలిసే చదివారు. తరువాత వాళ్ళ వృత్తులు వేరు కావడంతోబాటు జీవితాలు కూడా వేరు మార్గలలో సాగిపోయాయి. డాక్టర్ శేషగిరి బొంబాయి వెళ్ళి, అక్కడే ప్రాక్టీసు చెయ్యసాగాడు. స్నేహితులు కలుసుకోవటం చాలా అరుదైనా, ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా పలకరించుకుంటూనే ఉన్నారు.

చాలా కాలానికి స్నేహితుడిని కలుసుకోబోతున్నందుకు సంతోషంగా ఉన్నా, ఈ సమయంలో శాంత లేకపోవటం పెద్ద లోటనిపించింది కృష్ణమూర్తికి.

శేషగిరి—దంపతులు వచ్చేందుకు ముందురోజు రాత్రి కూడా తల్లీ కొడుకులు ఇదే విషయం మాట్లాడుకున్నారు.

“నేను పాతకాలందాన్ని. ఈ కాలపు నయం, నాజూకు నాకేం తెలుస్తాయి” అని చిన్నబుచ్చుకున్నారు సుశీలమ్మగారు.

“మనకు వచ్చినట్టే చేస్తే సరి” అన్నాడు రమేశ్.

“ఆ బొంబాయి — పిల్ల నా మొరటుతనానికి నవ్వుకుంటుందంటే.”

“నవ్వుకోనీ; నాకు చేతనయ్యేది ఇలాగే అంటే సరి” అన్నాడు రమేశ్.

“నువ్వూరుకో. ఇక మాట్లాడకు” అని విసుక్కున్నారు సుశీలమ్మగారు.

కృష్ణమూర్తి “నువ్వేం బెంగపెట్టుకోకమ్మా! వాళ్ళేమీ అనుకోరు” అని ధైర్యం చెప్పాడు.

కృష్ణమూర్తి ఆఫీసుకు సెలవుపెట్టి స్నేహితుడికి స్వాగతమివ్వటానికి స్టేషనుకు వెళ్ళాడు.

ఇంటిముందు టాక్సీ ఆగగానే, సుశీలమ్మగారు, శేషగిరిరావుగారు బయటకు వచ్చి నిలబడ్డారు. అందరూ టాక్సీనుండి దిగారు. కృష్ణమూర్తి తన స్నేహితుడిని, అతడి భార్యను తల్లిదండ్రులకు పరిచయం చేశాడు. వాసంతోళ్ళ లతా కుతూహలంతో కొత్త మొహాలను చూస్తోంది.

శేషగిరి చుట్టూ చూసి, “మీ ఆవిడ కనిపించ దేం?” అని అడిగాడు.

"ఊళ్లో లేదు. పుట్టింటికి వెళ్ళింది"

"ఓ, అయితే మా కందరికి మిఠాయి పంచుతా వన్నమాట."

"అబ్బే, అదేంలేదు; ఊరికే వెళ్ళింది" అన్నాడు కృష్ణమూర్తి.

శేషగిరి—ప్రశ్న విని సుశీలమ్మగారి మనస్సు చిన్న బోయింది. కృష్ణమూర్తికి పెళ్ళయి పన్నెండేళ్ళకు పైగా అయినా, ఆ ఇంట్లో పసిపాపను చూసుకునే

తామరకొలను

అదృష్టం నోచుకోలేదు. వృద్ధాప్యంలోకి అడుగు పెట్టిన ఆమెకు సహజంగానే మనవడిని ఎత్తుకోవాలని ఆశగా ఉంది.

కాని, కోడలి ఎదుట ఎప్పుడూ ఆ విషయాలు గురించి ఎత్తేవారేగాదు. వృథాగా కోడలి మనస్సు నొప్పించటం ఆమెకు ఇష్టం ఉండేదికాదు. వీటన్నిటి వల్లా అవ్యక్తమైన విచారం ఆ కాపురంలో చోటు చేసుకొని ఉంది.

సుశీలమ్మగారి మొహంలో క్షణకాలం కనిపించి మాయమయిన విషాద-రేఖను సూక్ష్మమతియైన రత్న గమనించింది. ఎంతయినా తనూ ఓ ఆడదే కదా!

"ఇంట్లో మీ లొక్కరేకదూ ఉండటం. నే నుంతా వచ్చి, మీకు చాలా శ్రమన కల్పిస్తున్నాం',



అంది రత్న మాట మారుస్తూ.

సుశీలమ్మగారు చిన్నగా నవ్వి:

"అలా అనకమ్మా. శ్రమేముంది. నీకోసం నేను ప్రత్యేకంగా ఏంచెయ్యాలి గనుక? నీ రావటం నాకెంతో సంతోషంగా ఉంది" అన్నారు.

రత్న—కొంగు పట్టుకుని నిల్చున్న పాపను, "నీ పేరేమిటమ్మా" అంటూ పలకరించారు.

పాప సిగ్గుతో జవాబు చెప్పలేదు.

"ఊఁ చెప్పుమరి. ఇల్లెగిరిపోయేట్టు కబుర్లు చెప్తావు. అవ్వ పేరడిగితే చెప్పలేవూ?" అన్నాడు శేషగిరి నవ్వుతూ.

"ఆశ" అంది పాప.

మగవాళ్ళు కబుర్లు చెప్పుకొంటూ కూర్చున్నారు. రత్న సుశీలమ్మగారి వెంట వంటింట్లోకి వెళ్ళింది. అప్పటికే వంటంతా అయిపోయింది. ఇక అప్పడాలు వేయటమే తరువాయి.

"నే నేం చెయ్యను? నాకూ ఏదైనా పని చెప్పండి" అంది రత్న.

"నువ్వేం చెయ్యకమ్మా. అలా కూర్చో" అంటూ పీట వాల్చారు సుశీలమ్మగారు.

కూర్చున్న రత్నవైపు పరిశీలనగా చూశారు.

సాదా వాయిల్ చీర కట్టుకుని, రెండు జడలు వేసుకుంది రత్న. ఆమె మాటలు ఎంతో సరళంగా ఉన్నాయి. కాని, ఒక పిల్ల—తల్లి అయ్యాక కూడా రెండు జడలు వేసుకోవటం సుశీలమ్మగారికి అంతగా నచ్చలా.

రత్న తనే ఆకులు వేసి, నీళ్ళు చిలకరించింది. సూక్ష్మంగా ఏది ఎక్కడుంది అనే విషయాలు గమనించి ఉప్పు, ఊరగాయ వడ్డించి, గ్లాసులలో నీళ్ళు పెట్టింది.

సుశీలమ్మగారి కాస్త బెంగ కూడా తీరిపోయింది. అంత సరళంగా సహజంగా ప్రవర్తిస్తున్న ఆ పిల్లను తన ఇంటి పిల్లలాగే ఆదరించవచ్చుననుకున్నారు.

"నువ్వూ భోజనానికి కూర్చో" అని ఎంత చెప్పినా వినక రత్న "నేనూ మీతోబాటే" అనేసింది.

మగవాళ్ళ భోజనాలయ్యాక సుశీలమ్మగారు, రత్న భోజనానికి కూర్చున్నారు. రత్నతో కలిసి భోంచేస్తుంటే, సుశీలమ్మగారికి కొంతే గుర్తు కొచ్చింది. తన కోడల్ని గురించి చెప్పింది రత్నకు.

"ఆమె కూడా ఉంటే, ఎంతో బావుండేది" అంది రత్న.

భోజనాలయ్యాక, "కాసేపు పడుకుని విశ్రాంతి తీసుకోవమ్మా" అన్నారామె.

'మేము బొంబాయినుండే నడిచి రాలేదు సుమండీ' అనేసింది రత్న.

సాయంకాలం రమేశ్ ఇంటికి రాగానే, కొత్త వాళ్ళెవరో తల్లితో మాట్లాడుతూ కూర్చొని ఉండటం చూశాడు. రత్న రెండు జడలు ముందు కనిపించాయి. వెను—తిరిగి వెళ్ళి పోబోతున్న రమేశుడిని పిలిచి, రత్నకు పరిచయం చేశారు సుశీలమ్మగారు.

"వీడేనమ్మా, నా చిన్న కొడుకు. ఈ సంవత్సరంతో వీడి చదువు పూర్తవుతోంది. వీడికి పెళ్ళిచేస్తే నా బాధ్యత తీరిపోతుంది" అన్నారు.

రత్న రమేశుడి వంక చూసింది.

"నమస్తే" అన్నాడు రమేశ్.

తరువాత తల్లివైపు తిరిగి, "అమ్మా! నేను వెళ్ళాలి. టైమయిపోతోంది" అని తొందర చేశాడు.

సుశీలమ్మగారు కాఫీ—టిఫిన్ అందించారు. మళ్ళీ **ఒక నిమిషంలో బయటకు వెళ్ళటానికి సిద్ధంగా** నిల్చున్నాడు. అప్పుడే బయటనుండి వస్తున్న కృష్ణమూర్తి, శేషగిరితో:

"ఇడుగోనోయ్, నా తమ్ముడు రమేశ్. త్వరలోనే మీ ఫీల్డులోకే ప్రవేశించబోతున్నాడు. వీడికి వెన్నెలవంటి దేహచ్ఛాయగల అమ్మాయి కావాలిట. మరి కళ్ళేమో సంపంగి పువ్వులా ఉండాలిట. కదుట్రా............. అంటూ తమ్ముడిని చూసి తృప్తిగా నవ్వాడు.

రమేశ్ ఆడపిల్లలా సిగ్గుపడ్డాడు. అతడి మొహం ఎర్రబడింది.

"అన్నయ్య మాటలు నమ్మకండి......" అంటూ నసిగాడు.

"ఎక్కడికోయ్ వెడుతున్నావ్?" అని అడిగాడు కృష్ణమూర్తి.

"పింగ్‌పాంగ్ ఆడటానికి వెడుతున్నా నన్నయ్యా"

"ఇవాళ్టికి అలా షికారుకు వెళ్దాం రావోయ్" అన్నాడు కృష్ణమూర్తి.

రమేశుడికి వాళ్ళతో వెళ్ళడానికి ఇష్టంలేదు. కాని, ఎలా చెప్పటం?

"ఆటకు వెళ్ళాలనుంటే వెళ్ళని" అన్నాడు శేషగిరి.

"అది రోజూ ఉండేదేగా. ఈరోజు మనతో వస్తాడులే" అన్నాడు కృష్ణమూర్తి.

ఇహ తప్పించుకోలేకపోయాడు రమేశ్. విధి

తామరకొలను

లేక బయల్దేరాడు.

రత్న ఆతకు వేరే గుడ్డలు తొడిగి, అలంకారం చేసింది. తమా, చీర మార్చుకుని బయల్దేరింది

కబుర్లలో రాను రాను శేషగిరి గమనం కృష్ణమూర్తి నుండి రమేశుడి వైపుకు తిరిగింది. ఎంతయినా వృత్తి—బాంధవులు. ఆ గొడవలే మాట్లాడుకు పోగారు. ఇక కృష్ణమూర్తి విధిలేక ఆతను మాట్లాడించపోగాడు. చివరికి ఆ గుంపులో రత్న ఒంటరిగా మిగిలిపోయింది. శాంతయినా ఉంటే, బావుండేది అనుకుందేమో.

ఇంటికి వెళ్ళిపోతే బావుండుననిపించింది. కాని, ఎవరికీ ఆ ఆలోచన ఉన్నట్టు లేదు. రత్న అర్థ—గర్భితంగా చూసినా, శేషగిరి గమనించే స్థితిలో లేడు.

బయలుదేరినప్పటినుండి నోరు మెదపకుండా నడుస్తున్న రత్నను చూసి, జాలేసింది రమేశుడికి. ఆమెకు విసుగ్గా ఉందేమో పలకరిద్దామనుకున్నాడు. కాని, ఏమని పలకరించటం? తల్లిని మెప్పించగలగటం పిల్లల ద్వారా వేకదా!

"ఆతను బళ్ళో వేశారా?"

"లేదు"

ఆ సంభాషణ అక్కడికి ఆఖరయింది. ఆమెను మాటల్లోకి దింపటం చాలా కష్టమనిపించింది రమేశుడికి. మితభాషిణి అనుకున్నాడు.

"వదిన ఉంటే, మీ కింత విసుగనిపించేదికాదు" అన్నాడు రమేశ్.

"విసుగేమీలేదు........" అంది రత్న నవ్వటానికి ప్రయత్నిస్తూ.

"అలాకాదు. మా స్టైతాస్కోపు, పల్సుల ప్రపంచం మీకేం నచ్చుతుంది?"

"స్టెతస్కోపు—పల్సు విసుకువేవక్క. పోరం కొక, మరి అన్నీ నచ్చాల్సిందే" అంటూ నవ్వాడు కృష్ణమూర్తి.

రత్న మాట్లాడలేదు.

కాఫీ—హొటల్‌నుండి ఇంటికి పోదామనుకున్నప్పుడు రత్న హాయిగా నిట్టూర్చింది. ఇంటికి రాగానే పంజరంనుండి బయటపడ్డ పిట్టలా సుశీలమ్మగారివద్దకు వెళ్ళింది.

"ఎక్కడికి వెళ్ళి వచ్చారమ్మాయ్" అని అడిగారు సుశీలమ్మగారు.

"ఇక్కడినుండి వెళ్ళి, అక్కడ కాఫీ—హొటల్‌లో కూర్చున్నాం" అంది రత్న.

"ఏమీ చూడటానికి వెళ్ళలేదేం?"

"కబుర్లతోనే సరిపోయింది."

"రమేశుడి స్వభావమే అంత. కబుర్లలో పడ్డాడంటే, మరింకేమీ అక్కర్లేదు వాడికి. వదిన పుట్టింటికి వెళ్ళిన దగ్గర్నుండి ఇంట్లో మాటలే తగ్గించేశాడు."

"వాళ్ళ వదిన దగ్గర చాలా చనువనుకుంటాను మీ చిన్నబ్బాయికి."

"ఊఁ తనే అలా అలవాటు చేసింది. ఇక భోజనానికి వస్తారా?"

రత్న ఆవిడకు వడ్డించడంలో సాయపడింది.

రెండు రోజులుమాత్రం ఉండి శేషగిరి దంపతులు మూడవ రోజున ప్రయాణమయ్యారు. స్నేహితుడిని మరో నాల్గు రోజులు నిలుపుకోవాలని కృష్ణమూర్తి ఎంతో ప్రయత్నించాడు.

"పిచ్చోడురా! సెలవులేదు వెళ్ళి తీరాలిందే" అన్నాడు శేషగిరి.

"ప్రైవేట్ - ప్రాక్టీస్ కదా నీది? నీ సెలవేమిటని?"

"నా రోగుల గతో" అంటూ నవ్వాడు శేషగిరి.

రెండ్రోజులు కలకలలాడుతున్న ఇల్లు, శేషగిరి, రత్న, ఆతు వెళ్ళిపోగానే బావురుమంది

"ఏమీ తోచటంలేదు. శాంతను పిలిపిస్తే బావుంటుంది" అంటూ గొణిగారు సుశీలమ్మగారు.

రమేశ్ వెంటనే వదినకు ఉత్తరం రాశాడు.

"అమ్మకు ఏమీ తోచడం లేదట. మీరు వెంటనే రావాలట."

రమేశుడి ఉత్తరానికి శాంత నాన్నగారు జవాబు రాశారు; శాంత ఆరోగ్యం ఏమంత బాగుండటం లేదని.

కోడలి అనారోగ్యం విషయం విని, మామగారు శాంత తండ్రికి ఉత్తరం రాశారు. అది చూసుకుని ఆయన కూతుర్ని తీసుకుని వచ్చారు.

శాంత నవ్వుతూ ఇంట్లోకి అడుగు పెట్టింది. నవ్వొక్కటే ఆమెలో ఉన్న వస్తువు అనిపించింది రమేశుడికి. సామాన్యంగా దేన్నీ గమనించని కృష్ణమూర్తి కూడా భార్య ఇలా కృశించిపోవటం చూసి కంగారుపడ్డాడు.

ఎముకల గూడులా ఉన్న కోడల్ని చూసి సుశీలమ్మగారి కళ్ళలో నీళ్ళు నిండాయి. శాంత కళ్ళు మునుపటి కళ్ళు కావటంలేదు కోల్పోయాయి. నిర్జీవంగా ఉన్నాయి. (సశేషం)

న్యూఢిల్లీ లేఖ

7-వ పేజీ తరువాయి

ఈ ఆరోపణలన్నీ నిరాధారాలని చెప్పటమన్నది అటార్నీ జనరల్ నిర్ణయాలకు బాధకము, పూర్వ, పక్ష నిర్ణయమూ అవుతుంది.

కలకత్తాలోని ఒకానొక సంస్థ రు. 10000 లు కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల నిధికి ఇవ్వవలసిందిగా కోరినమాట నిజమేనని ఫలానా మంత్రిగారు ఒప్పుకున్నారు. దీన్ని చూసీచూడటంతోటే ప్రధానమంత్రి సంతృప్తిపడ్డారు. కాని, ఇది అంత తేలికగా తృప్తిపడదగ్గ విషయం కాదు. కనిపించినంత తేలికైందీ కాదు.

ఆ ఫలానా పెద్దమనిషి మంత్రి పదవిలో లేకపోతే, ఆ సంస్థ కాంగ్రెస్‌కు పదిరూపాయలైనా ఇచ్చి ఉండేదా! ఒకవేళ మంత్రిహోదా వల్లనే ఆ డబ్బు వచ్చిఉంటే మంత్రి హోదాను, అవకాశాలను అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు కాదా! ఇదే పెద్దమనిషి- ఎన్నికల ప్రచారానికిగాను రు 10 వేలు చెల్లించాల్సిందిగా ప్రభుత్వ కార్యదర్శి, అంటే ఒక ఐ. సి యస్. వ్యక్తి స్వహస్తాక్షరాలలో లేఖ వ్రాస్తే, ఆ ఉద్యోగిపట్ల ప్రధాన మంత్రి ఎలా ప్రవర్తించేవారు? అధికార దుర్వినియోగం నేరం కింద నామకః విచారణ జరిపి, ఉద్యోగంనుంచి ఉద్వాసన చెప్పేవారు కాదా! ముంద్రా వ్యవహారంలో శ్రీ హెచ్. యం. పటేల్‌ను విచారణ కాలంలో సస్పెండ్ చేయలేదూ?

భారత రాజ్యాంగం ప్రకారం ఈ దేశంలో పౌరులందరికీ సమానమైన హక్కులున్నాయి. మంత్రి కొక న్యాయం, ఉద్యోగి కొక న్యాయం నిర్వర్తిస్తే, సమానహక్కుల పరిగణనం ఎలా సాధ్యమవుతుందా అనేదే ప్రశ్న!

అసలీ అవినీతి దుమారాన్ని లేవగొట్టిన వ్యక్తి మాజీఆర్థిక మంత్రి శ్రీ చింతామణి దేశ్‌ముఖ్. నిష్పాక్షిక న్యాయస్థానం (ట్రిబ్యునల్) ఏర్పరిస్తే దానిముందు ఆయన 'కేసులు' అప్పగించగలనని ప్రకటించారు మరి మన ప్రధాన మంత్రి అలాటి న్యాయస్థానం నెలకొల్పటానికి అంగీకరించలేదు; పైగా విద్యాలయాల గ్రాంట్ల సంఘం అధ్యక్షుడుగా ఉన్న రోజుల్లో పింఛనుతో పాటు వేతనంకూడా పుచ్చుకొంటున్నారనే అభాండాన్ని శ్రీ దేశ్‌ముఖ్ ఎదుర్కోవాల్సివచ్చింది. అంతే! మళ్లీ ఆయన పదవీనిర్వహణ కాలాన్ని పొడిగించలేదు!

కొన్నిపత్రికలు కొందరుమంత్రులకు పరువునష్టం కలిగించేట్లు వ్రాస్తున్నాయని ప్రధానమంత్రి ఆరోపించారు. ఇంతకన్న మంచిపద్ధతేమిటంటే, ఈ మంత్రుల్ని అలాటి పరువునష్టపు వ్రాతలు వ్రాసే పత్రికలపైన దావా వేయాల్సిందిగా ప్రధానమంత్రి కోరి, వారందుకు అంగీకరించకపోతే పదవినుండి తొలగిస్తే బావుంటుంది. దీనివల్ల ప్రధానమంత్రి ఎదుర్కొంటున్న అభాండాలు, అవాకులు చవాకులు తొలగి నిష్కల్మష వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుంది. దేశమనేది పక్షాలకన్న పక్షాలు వ్యక్తులకన్న ఎక్కువని, ముఖ్యమని గుర్తించాలి. ★

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra PatrikaPress 6 & 7, Thambuchetty Street Madras-1, Chief Editor : S. Sambhu Prasad.